# తొలినాటి గ్రామఫోన్ గాయకులు

రెండవ సంపుటి



పుస్తకంతో పాటు
సి.డి.
ఉచితం!



మొదలి నాగభూషణశర్మ

# తొలినాటి గ్రామఫోన్ గాయకులు

## రెండవ సంపుటి

మొదలి నాగభూషణశర్మ

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్
1-8-725/ఎ/1, 103సి,
బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
నల్లకుంట, హైదరాబాద్ - 500044
ఫోన్స్ : 98480 65658, 98485 06964

# తొలినాటి గ్రామఫోన్ గాయకులు - రెండవ సంపుటి

# Tolinaati Gramophone Gaayakulu - 2nd Volume


ప్రతులు : 1000

ఆవిష్కరణ :
**సెప్టెంబర్, 2012**

వెల :
**రూ. 100/- (సి.డి. ఉచితం)**

పుస్తక రూపకల్పన :
**క్రియేటివ్ లింక్స్**
1-8-725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
నల్లకుంట, హైదరాబాద్ - 500044
ఫోన్స్ : 98485 06964, 98480 65658,



రచయిత చిరునామా:
**ప్రొ॥ మొదలి నాగభూషణ శర్మ**
1-8-702/32/39, పద్మ కాలనీ,
నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
మొబైల్ : 9246103316
E-mail : modalisarma@rediffmail.com



ఈ పుస్తకం లభించే చోట్లు :
**విశాలాంధ్ర బుక్ హౌస్ (అన్ని పట్టణ శాఖల్లో)**
**నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్-500027**
**తెలుగు బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్-500027**
**ఆంధ్ర బాలానంద సంఘం, బర్కిట్ రోడ్, టి.నగర్, చెన్నై - 600 017**

# ముందుమాట

"తొలినాటి గ్రామఫోను గాయకులు" అన్న పేరుతో మేము విడుదల చేసిన మొదటి సంపుటం (పుస్తకం+పాటల సి.డి.) చదువరులను, శ్రోతలను కూడా అలరించిందని, "పాతకాలం సరుకు" అని పక్కన పడవేయకుండా, "ఆబ"గా తాము చదివి, తమ స్నేహబృందాల చేత చదివించారని, వినిపించారని మా సంపుటికిచ్చిన ఆదరణ, మాకు అవిశ్రాంతంగా వచ్చిన/వస్తున్న "దూరవాణి పిలుపులు" మాకు తెలియచెప్పాయి. కేవలం "పుస్తకం బాగుంది", "పాటలు బాగున్నాయి" అని చెప్పడంతో ఆగక, చాలమంది ఉత్సాహవంతులు "ఫలానా గాయకుడి పాటలు ఇవ్వలేదేమండీ?" అనో, "ఫలానా పాటలు లేవేమండీ?" అనో అడగడం ఆనవాయితీ అయింది. 1925-35 మధ్యకాలంలో దాదాపు మూడువందలమంది గాయకులు రికార్డులిచ్చారు. అప్పుడు రికార్డు కంపెనీల అధిపతులో, రికార్డింగ్ నిర్వాహకులో ఆనాటి రంగస్థల నటులు చాలమంది చేత రికార్డు లిప్పించారు. ఇవాళ అందులో చాలమంది నటీనటుల జీవిత ప్రస్థాన విశేషాలు లుప్తమైపోయాయి. ప్రఖ్యాత నట-గాయకుల వివరాలు తెలుస్తున్నా, అంతగా ప్రఖ్యాతిలేక, కాలప్రవాహంలో కొట్టుకుపోయిన అనేకమంది అత్యద్భుత గాయకుల జీవిత విశేషాలు ఇంకా తెలియవలసి వుంది.

ఇందులో మాకు అందుబాటులోకి వచ్చిన మరో 21 మంది గాయకులను గురించిన వివరాలు పొందుపరిచాం. ఇతరుల జీవితవిశేషాలు తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. గ్రామఫోను రికార్డులిచ్చిన ఆనాటి గాయకుల జీవితాలను గురించి తెలిసిన శ్రోతలుగాని, పాఠకులుగాని ఉంటే వారిని గురించిన వివరాలు మాకు తెలియచేయవలసిందిగా కోరుతున్నాం. తప్పకుండా మరో సంపుటంలో వారి జీవితచరిత్రను, పాటల పాటవాన్ని విస్తృత పాఠకలోకానికి తెలియచేయగలం.

లబ్ధప్రతిష్టులైన ఎందరో నటీనటులు ఆరోజుల్లో మొత్తం నాటకాలను కలిపి అయిదారు భాగాలుగా "సెట్'ల రూపంలో ఇచ్చేవారు. అటువంటివి దాదాపు నూరు వరకు ఉండవచ్చునని అంచనా. ఆ రికార్డుల్లో ప్రధానమైనవాటిని - ముఖ్యంగా ప్రధాన పాత్రధారులు (గాత్రధారులు?) పాల్గొన్న నాటకం రికార్డులను (అందులో ఆనాటి మాటలు, పాటలు, పద్యాలు పూర్తిగా ఉంటాయి) నాటక, గాయక అభిమానులకు అందుబాటులోకి తేవాలని మా చిరకాలవాంఛ. మరో ఆరు నెలలలో "సంప్రదాయ రంగస్థల నాటక సంగీతం" పేరుతో ఒకటి, రెండు నాటకాలను, అందులో పాల్గొన్న గాయక-నటబృందాన్ని గురించి వివరాలతో యివ్వడానికి పూనుకున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాం. మా ప్రయత్నానికి మీ చేయూత తప్పక దొరుకుతుందని మా ఆశంస.

ఈ చిన్న సంపుటాన్ని, దానికి తోడుగా యిస్తున్న విస్తృతమైన గానవైవిధ్యాన్ని తయారుచేయడంలో సహకరించిన మిత్రులు మధుసూదన శర్మ గారికి నమస్సులు. ఆయన రెండు దశాబ్దాల కాలం వెచ్చించి రికార్డుల నుంచి వెలికితీసిన అమృతభాండాగారంలో కాస్తంత భాగాన్ని శ్రోతలతో పంచుకోగలగడం మా అదృష్టం.

ఈ సంపుటి, సి.డి.లను వెలికి తీసుకొని రావడానికి అహరహరమూ శ్రమిస్తున్న మిత్రులు సూరిబాబు, శ్రీకాంత్‌లకు, తదితర మిత్రులకు అభినందనలు.

**మొదలి నాగభూషణ శర్మ**

# మనవి

రెండు సంవత్సరాల క్రితం మేము వెలువరించిన 'తొలినాటి గ్రామఫోన్ గాయకులు' అన్న చిన్న పుస్తకానికి, దానితో పాటు యిచ్చిన పాటలకి సంగీతాభిమానులైన పాఠకుల నుంచి విశేష స్పందన లభించి రాష్ట్రం నలుమూలల నుండి ఎందరో అభిమానులు ఉత్తరాల ద్వారా, టెలిఫోన్ ద్వారా నాటితరం గాయకులపై తమకు గల అవ్యక్తమైన అభిమానాన్ని తెలియజేశారు. ముందుగా వారందరికీ నా హృదయపూర్వక నమస్సులు.

నాకు ఎప్పటి నుండో రికార్డులలో నిక్షిప్తమై ఉన్న సంగీతాన్ని, ఆ గానమాధుర్యాన్ని అందించిన గాయకుల జీవిత విశేషాలను డాక్యుమెంట్ చేయాలని ప్రగాఢ వాంఛ ఉండేది. ఆ ప్రయత్నంలో ఎందరినో సంప్రదించాను. ఇవన్నీ జరగాలంటే ఒకళ్ళతో అయ్యే పని కాదు, ఏ ప్రభుత్వ సంస్థో, ఏ సాంస్కృతిక సంస్థో పూనుకొని చేయాలని చెప్పిన వాళ్ళే ఎక్కువమంది. అయినా నిరుత్సాహపడలేదు. ప్రయత్నలోపం లేకుండా నాకు హితులు, ఆత్మీయులు మధుసూదన శర్మగారిని సంప్రదించి ఒక రికార్డుల కేటలాగు తయారుచేశాను. ఈ రికార్డులలో ఉద్దండులైన 60 మందికి పైగా నటగాయకులు ఉన్నట్లు తెలిసింది. ఇవన్నీ అరవై, డెబ్బయ్ ఏళ్ళనాటి రికార్డులు. వీరిలో రంగస్థల నటులేగాక, కేవలం గ్రామఫోన్ రికార్డులనే ఇచ్చిన ఎందరో సంగీతజ్ఞులు ఉన్నట్లు తెలిసింది. వీటన్నిటినీ ఒక క్రమంలో పెట్టడం, వాటిని రికార్డింగ్‌కి అనువుగా సిద్ధం చేయటం, డిస్కుల రూపంలోకి మార్చటం ఒక ఎత్తైతే వీరి గురించి సమాచారం సేకరించటం, వారి ఫోటోగ్రాఫులు సంపాదించటం, లభించిన సమాచారం సరిచూసుకోవటం యివన్నీ ఒక మహాయజ్ఞంలా కనిపించింది. అయినా దానిని సుసాధ్యం చేసిన నా హితాభిలాషులు ఆచార్య మొదలి నాగభూషణశర్మ గారికి, జె.మధుసూదనశర్మ గారికి, ఈ ప్రయత్నంలో నాకు అండగా నిలిచిన శ్రీకాంత్, వేణుగోపాల్, శ్రీ చాగంటి గౌరీనాథ్ లకు నేను సర్వదా కృతజ్ఞుడిని.

మలివిడతగా యిప్పుడు మీ ముందుకు వస్తున్న యీ రెండవ సంపుటిలో 21 మంది గాయకుల సంక్షిప్త జీవిత విశేషాలతో కూడిన పుస్తకంతోపాటు వారు పాడిన 62 పద్యాలు, పాటలు (4 గం॥ల నిడివి గల డిస్కు) మీ ముందుకు తీసుకు వస్తున్నాము.

నా సహచర మిత్రులు చాలామంది యీ కార్యక్రమంలో నాకు సహాయ సహకారాలు అందించారు. వీరిలో మాకు తమ వద్దనున్న రికార్డులను అందించి సహకరించిన కీ॥శే॥ ఎమ్. కపోతేశ్వరరావు (నరసరావుపేట), దాసు అచ్యుతరావు గార్లకు, శ్రీయుతులు కె.ఎల్.ఎన్.మూర్తి (సత్తెనపల్లి), ఏలేశ్వరపు రఘురామ శర్మ (మంగళగిరి), మన్నవ రాయుడు (బెంగుళూరు), పి.రమేష్, ఎ.షణ్ముఖాచారి, పరుచూరి శ్రీనివాస్ (జర్మనీ), కె.ప్రసాద్ (డి.టి.పి.), పరిమి సాంబశివరావు (విజయనగరం) వీరందరికీ నా నమస్సులు.

తేది: 06.09.2012

**యం. సూరిబాబు**

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్


# విషయసూచిక


1. యడవల్లి సూర్యనారాయణ ........................ 7
2. బెల్లంకొండ సుబ్బారావు ........................ 13
3. మాధవపెద్ది వెంకటరామయ్య ........................ 16
4. పులిపాటి వెంకటేశ్వర్లు ........................ 21
5. మంగళగిరి (సీనియర్) శ్రీరంజని ........................ 25
6. దాసరి కోటిరత్నం ........................ 29
7. పారుపల్లి సుబ్బారావు ........................ 33
8. ఆర్. (రేకందార్) సుభద్రమ్మ ........................ 36
9. కళావర్ రింగ్ (సరిదె లక్ష్మీనర్సయ్యమ్మ) ........................ 39
10. ఋష్యేంద్రమణి ........................ 41
11. తుంగల చలపతిరావు ........................ 45
12. మాస్టర్ కళ్యాణి ........................ 49
13. ఘంటసాల రాధాకృష్ణయ్య, ఘంటసాల బలరామయ్య..... 52
14. నిడుముక్కల సుబ్బారావు ........................ 58
15. లక్కరాజు విజయగోపాలరావు ........................ 62
16. ముప్పవరపు భీమారావు ........................ 65
17. క్షత్రియ పార్వతీబాయి ........................ 68
18. అబ్బూరి వరప్రసాదరావు ........................ 71
19. చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్ ........................ 74
20. బెజవాడ రాజరత్నం ........................ 77
21. బెంగుళూరు నాగరత్నమ్మ ........................ 80

మరికొందరు గాయకుల సంక్షిప్త పరిచయం :
వల్లూరి జగన్నాథరావు, పసుపులేటి అంజయ్య,
కాకినాడ రాజరత్నం ........................ 83

అనుబంధం - డిస్క్‌లో ఉన్న గ్రామఫోన్ పాటలు, పద్యాలు, శ్లోకాల వివరాలు .. 85

# యడవల్లి సూర్యనారాయణ



తెలుగు పద్యనాటక యుగంలో (1887-1930) యడవల్లి సూర్య నారాయణగారికున్న పేరు ప్రతిష్టలు తెలుగు సాహిత్య చరిత్రలో సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలను తలపిస్తాయి. రాచఠీవి, ఏ భావాన్నయినా స్పష్టంగా వెలువరించగల విశాలమైన ఫాలభాగం, తీక్షణమైన కనులు, సమున్నత శరీర సౌష్టవం - యిదీ యడవల్లి వారి బాహ్యరూపం. ఎంతటి కఠినమైన పద్యాన్నయినా, సంక్లిష్టమైన వచన భాగాన్నయినా అర్థస్ఫోరకంగా, శ్రవ్యపేయంగా వినిపించగల వాక్కు ఆయనది. శరీర శారీరాల ఆహ్లాదకరమైన సమన్వయ సోయగం యడవల్లి వారిది. అందుకే ఆయన తెలుగునాటకరంగంలో మకుటంలేని మహారాజుగా వెలుగొందాడు. జమీందారీ తలపాగాతో, నలగని సిల్కుమడతల గుబాళింపుతో, స్వాభిమాన స్ఫోరకమైన మీసాలతో ఆయన విజయవాడ (అప్పటి బెజవాడ) రైల్వే ఫ్లాట్‌ఫారమ్ మీద సాయం వ్యాహ్యాళికి వస్తే రాజకీయ నాయకులకు లేని మన్నన, ఈనాటి సినిమా కథా నాయకులకు ఉండే ప్రేక్షకాదరణ ఉండేవట! ఇక రంగస్థలం మీద దుష్యంతుడు, సారంగధరుడు, నలుడు, దుర్యోధనుడు, అర్జునుడు వంటి ధీరోదాత్త, ధీరోద్ధత నాయకుల వేషాలు వేయడంలో తనకుతానే సాటి అనిపించుకున్న నటసార్వభౌముడు యడవల్లి. అంతటి అదృష్ట నటజీవితం గడిపిన వ్యక్తి ఆయన.

సంక్రాంతికి గొప్ప సంతోషము!

బెజవాడ సరస్వతీ టాకీస్ వారి

# ద్రౌపదీ వస్త్రాపహరణము

మనోహరముగా సంక్రాంతికి ప్రదర్శింపబడ గలదు.

## ఆంధ్రుల కళావేతృత్వమునకిది మచ్చుముక్క.

సూపర్ వైజింగు డైరెక్టరు.
హెచ్. యం. రెడ్డి.

డైరెక్టరు:
హెచ్. వి. బాబు.



ముఖ్య పాత్రధారులు:

| | |
|---|---|
| యడవల్లి సూర్యనారాయణ | దుర్యోధనుడు |
| సి. యస్. ఆర్. ఆంజనేయులు | శ్రీ కృష్ణుడు |
| చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్ | ధర్మరాజు |
| దొమ్మేటి సూర్యనారాయణ | భీముడు |
| దొమ్మేటి సత్యనారాయణ | అర్జునుడు |
| బి. వి. ఆంజనేయులు | నకులుడు |
| కొచ్చర్లకోట సత్యనారాయణ | సహదేవుడు |
| కుంపట్ల సుబ్బారావు | ధృతరాష్ట్రుడు |
| లంక కృష్ణమూర్తి | దుశ్శాసనుడు |
| కెల్లంకి వెంకటేశ్వర్లు | కర్ణుడు |
| వెల్లూరి నాగరాజరావు | శకుని |
| మాస్టర్ కోటిసూర్యం | వికర్ణుడు |
| ఆరణి సత్యనారాయణ | విదురుడు |
| మద్దిపట్ల వెంకటసూర్యనారాయణ | భీష్ముడు |
| కృత్తివెంటి వెంకట సుబ్బారావు | ద్రోణుడు |
| తంగిరాల హనుమంతరావు | కృపాచార్యులు |
| కడారు నాగభూషణం | అశ్వత్థామ |
| వేమూరి గగ్గయ్య | శిశుపాలుడు |
| వేమూరి పరబ్రహ్మశాస్త్రి | వ్యాసుడు |
| పి. సూరిబాబు | నారదుడు |
| యం. వి. రాఘవన్ | ధౌమ్యుడు |
| మిస్ కన్నాంబ | ద్రౌపది |
| ,, రామతిలకం | సత్య |
| పువ్వుల నగరాజకుమారి | రుక్మిణి |
| కళారి శకుంతల | భానుమతి |
| పువ్వుల నాగభూషణం | గాంధారి |

*For Booking apply to :—* **SARASWATHI TALKIES, LTD.,**

**Camp : Palace Theatre Buildings, Kolhapur, 'Grams : "Saraswathi" KOLHAPUR.**

'ద్రౌపదీ వస్త్రాపహరణము' (1936) పత్రికా ప్రకటన

1888లో గుంటూరులో శ్రీమంతుల కుటుంబంలో పుట్టి అక్షరాభ్యాసం నుంచి యస్.యస్.యల్.సి. వరకు అక్కడే చదివి, నిత్యమూ తాను చూస్తూ ఆరాధిస్తున్న ఆనాటి మేటి నటులు, గుంటూరు ఫస్టు కంపెనీగా ఆంధ్రదేశం అంతటా ప్రసిద్ధికెక్కిన గుంటూరు హిందూ నాటక సమాజ నిర్వాహకులు, నటులు అయిన హరిప్రసాదరావు, బలిజేపల్లి లక్ష్మీకాంతంగార్ల నటనా, సంగీత వైభవాలకు ముగ్ధుడై వారికి పట్టంకట్టే ప్రేక్షకులలో తాను కూడా ఒకడై, ఏనాటికయినా హరిప్రసాదరావుగారి నటనా ప్రాభవాన్ని, లక్ష్మీకాంతకవిగారి సంగీత సామర్థ్యాన్ని అధిగమించాలని అహరహమూ తపించి వారిని అనుకరిస్తూ అధిగమిస్తూ నిత్యమూ వారినే తలపింప చేయడంలో కృతకృత్యుడైన దక్షుడు యడవల్లి.

ఈ నైపుణ్యాన్ని సాధించడానికి యడవల్లి చేసిన కృషి ప్రశంసనీయం; ఈనాటి నటులకు మార్గదర్శకం. భారతదేశంలో, తన యెరికలో ఎక్కడ మంచి నాటకం ఉంటే, ఎక్కడ పేరుపొందిన నటులు నాటకాలు ప్రదర్శిస్తే అక్కడికల్లా వెళ్లి వారివారి మెళకువులను గ్రహించాడు. గొప్ప సంగీత విద్వాంసుల గ్రామఫోను రికార్డులను తెప్పించుకొని వాటిని విని, వారు పాడిన రాగాలను సాధన చేసి, నాటకాలలో వాడి, 'శెహబాస్' అనిపించుకున్న కృతనిశ్చయుడు. ప్రసిద్ధ గాయకుల సంగీత కచేరీలకు స్వయంగావెళ్లి, వారి నుంచి ఎన్నో ఆనుపానులు నేర్చుకున్న సంగీత పిపాసి. అలాగే నాట్యశాస్త్రానికి సంబంధించిన గ్రంథాలను తెప్పించుకొని అధ్యయనం చేసి పూర్వనాట్యరీతులను ఆకళింపు చేసుకున్న శ్రద్ధాళువు యడవల్లి. నిత్యకృషితో, పట్టుదలతో నటజీవితానికి కావలసిన అన్ని హంగులనూ సమకూర్చుకొని, వాటిని ఆచరణలో పెట్టి తనకు, తాను పని చేసిన నాటక సమాజాలకు గుర్తింపును, గౌరవప్రపత్తులను సాధించిపెట్టాడు.

యడవల్లి నట జీవితం విద్యార్థి దశ నుంచే ప్రారంభమైంది. ఆనాడు గుంటూరు వృత్తి నాటక సమాజాలకు కేంద్రం. ఫస్టుకంపెనీ సెకండు కంపెనీలు పోటాపోటీలుగా నాటకాలు ప్రదర్శించేరోజులవి. హరిప్రసాదరావు ఫస్టు కంపెనీలోను, మల్లాది గోవిందశాస్త్రి సెకండు కంపెనీలోను నాయక వేషధారణలో కొత్త పుంతలు తొక్కుతున్న రోజుల్లో వారిద్దరకు దీటుగా యువకులను చేర్చి "అమెచ్యూర్స్ క్లబ్" ను ప్రారంభించి పై రెండు నాటక సమాజాలు ఆడే నాటకాలనే స్వీకరించి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (ఆయన రాజకీయాలలో ప్రవేశించి

'ఆంధ్రరత్న' గా పేరు ప్రతిష్టలనార్జించక ముందు) వంగల ఆంజనేయులు, బెల్లంకొండ నరసింహం వంటి నటుల సహకారంతో దిగ్విజయంగా ప్రదర్శనలిచ్చి ఆనాడే ప్రేక్షకుల మన్ననలను, నాటక నిష్ణాతుల ఆదరాన్ని పొందాడు. 'ప్రసన్నయాదవం', 'గయోపాఖ్యానం', 'బొబ్బిలి' నాటకాలలో అర్జున, కృష్ణ, విజయరామరాజు పాత్రలను పోషించాడు. ఆ సంస్థ బెజవాడలో 'గయోపాఖ్యానం' కాంపిటీషన్‌లో అర్జున పాత్రకు ద్వితీయ బహుమతి గడించి నాటకాభిమానుల ప్రశంసలు అందుకున్నాడు.

ఆంధ్రదేశంలో వృత్తినాటక సమాజాలు వ్యాపార నైపుణ్యాన్ని సంపాదించుకొంటున్న రోజులవి. రాజమండ్రి హిందూ నాటక సమాజ వైభవాన్ని చూసి దానికన్న మిన్నగా ఉండాలన్న రంగోత్సాహంతో మైలవరం రెండవ రాజాగారైన సూరానేని వెంకట పాపయ్యారావు గారు తమ యాజమాన్యం కింద "మైలవరం కంపెనీ" గా ప్రసిద్ధికెక్కిన బాలభారతి నాటక సమాజాన్ని ప్రారంభించి అప్పటికే దేశంలో లబ్ధప్రతిష్టులయిన నటులకు ఎక్కువ పారితోషికాలిచ్చి, ఇతర సదుపాయాలను కలుగచేసి ఒక ఆదర్శప్రాయమైన ఛాయాలో సమాజం నడపడం ప్రారంభించారు. ముందు మైలవరం గ్రామంలోనే ప్రారంభించినా, మరో రెండేళ్లకు బెజవాడలో ఒక నాటకశాల నిర్మించి పెద్ద ఎత్తున బాలభారతిని ప్రారంభిస్తూ అందులో ప్రధాన నాయకపాత్రలకు ఆనాడు నాటకరంగం మీద యువకిశోరంగా వెలుగొందుతున్న యడవల్లి వారిని ఆహ్వానించారు. వారితోపాటు ఇతర ప్రధాన పాత్రలకు అద్దంకి శ్రీరామమూర్తిగారు, స్త్రీ పాత్రలకు ఉప్పులూరి సంజీవరావు, కడియాల రత్తయ్యగార్లు, ఉద్ధత పాత్రలకు గురజనాయుడుగా ప్రఖ్యాతి గాంచిన గూడపాటి నరసింహారావు నాయుడు గారు, పాటలకు మట్లుకట్టడానికి ప్రఖ్యాత నాటక సంగీతజ్ఞులు పాపట్ల కాంతయ్యగారు – ఎందరో, ఎందరో ప్రఖ్యాతులు ఈ సమాజంలో సభ్యులై ఏకాగ్రతతో పాఠ్యాలు చదివి, క్రమశిక్షణతో పూర్వాభ్యాసాలు చేసి 'శాకుంతలం', 'వేణీసంహారం', 'సారంగధర', 'హరిశ్చంద్ర', 'ద్రౌపదీ వస్త్రాపహరణం' వంటి దాదాపు ముప్ఫయ్ నాటకాలను ప్రదర్శిస్తూ దేశదేశాలు తిరిగి ప్రదర్శనలిస్తూ అజరామరమైన కీర్తిప్రతిష్టలను ఆర్జించారు.

'చిత్రనళీయం' లో నలుడు – బాహుకుడు, 'పాదుకా పట్టాభిషేకం'లో



'ద్రౌపదీ వస్త్రాపహరణము' సినిమా (1936)లో దుర్యోధనుడుగా

రాముడు, 'సావిత్రి' లో సత్యవంతుడు, 'గయోపాఖ్యానం'లో అర్జునుడు, 'వేణీసంహారం', 'ద్రౌపదీ వస్త్రాపహరణం', 'పాండవ ఉద్యోగ విజయాలు' లో దుర్యోధనుడు, అన్నిటిని మించి వీరేశలింగంగారు తెనిగించిన 'శాకుంతలం' లో దుష్యంతుడు పాత్రలకు యడవల్లి పేరుప్రఖ్యాతులు సంపాదించాడు. "శాకుంతలం" లో దుష్యంతుడుగా మూల సంస్కృత నాటకంలోని శ్లోకాలను కూడా చేర్చి అర్థస్ఫోరకంగా చదివినప్పుడు ప్రేక్షకుల ఆనందానికి అవధులు ఉండేవి కాదట! స్పష్టమైన ఉచ్చారణ, భావయుక్తంగా పద్యాన్ని చదవడం, ఎంతటి క్లిష్ట సమాసాలనైనా తేలికగా అర్థం అయ్యేవిధంగా పద విభజన చేసి, తన పఠనరీతి ద్వారానే ప్రేక్షకులకు పాత్యంలో ఉండే అంతరార్థాన్ని అందించేవాడు.

తన సమకాలీన నాటకరంగ ప్రముఖులలో యడవల్లి కన్న గొప్ప విద్వాంసులుండవచ్చు (కప్రా పేరయ్య శాస్త్రి మొ॥); గొప్ప సాత్త్వికాభినయ వేత్తలుండవచ్చు (బళ్లారి రాఘవ, నాగరాజారావు మొ॥); గొప్ప గాయకులు ఉండవచ్చు (బుర్రా రాఘవాచారి, బలిజేపల్లి లక్ష్మీకాంతం మొ॥). కాని ఈ అన్ని లక్షణాలను సమన్వయం చేసి, నాటకాన్ని ప్రదర్శనోద్దిష్టం చేసిన గొప్ప సమన్వయకర్త యడవల్లి సూర్యనారాయణ. 'పర్‌ఫార్మర్' అనే పదం ("ప్రదర్శక నిపుణుడు" అనవచ్చు) ఆయనకు నప్పినట్లు మరొకరికి నప్పేది కాదనడం నిర్వివాదం.

పదిహేను సంవత్సరాలు మైలవరంవారి "బాలభారతి" లోను ఆ తరువాత మోతే నారాయణరావుగారి "శ్రీ సీతారామాంజనేయ నాటక సమాజం"లోను, అటు తరువాత దానినుంచి బయటకువచ్చి "దుర్గా అమెచూర్స్" అనే పేరుతో స్వంత నాటక సమాజాన్ని స్థాపించి దేశం నలుమూలలా ప్రదర్శనలిచ్చి ప్రజల హర్షామోదాలను పొందారు. యడవల్లి నాటకంలో ఉంటే మూడు రోజులు ముందుగానే టిక్కెట్లు అయిపోయేవనీ, అటు బరంపురం నుంచి, ఇటు మద్రాసు, కోయంబత్తూరుల నుంచి, చివరకు హైదరాబాదు నుంచి కూడా ప్రత్యేక రైళ్లలో వచ్చి నాటకాలు చూసేవారని చెబుతారు. ఆయన నాటకాలతో వృత్తి నాటకానికి పట్టాభిషేకం జరిగింది; రంగస్థలం ఆయనను "నాట్యాచార్యు"నిగా సన్నుతించింది.

యడవల్లి సినిమా పాత్రధారణ కూడా అంత ప్రశస్తంగాను చేశారని ప్రశస్తి పొందారు. తెలుగులో వచ్చిన రెండవ టాకీ "పాదుకా పట్టాభిషేకము" (1932) లో ఆయన రాముడుగా నటించాడు. 1933లో విడుదలైన "శకుంతల" చిత్రంలో దుష్యంతుడుగాను, 1936 లో వచ్చిన "ద్రౌపదీ వస్త్రాపహరణం"లో దుర్యోధనుడుగాను నటించిన యడవల్లి 1939లో దివంగతులైనారు.

నిష్ఠతో నియమబద్ధంగా, చేస్తున్న పనిలో అకుంఠితదీక్ష, పట్టుదల, అలుపెరుగని కృషి, సాధన యడవల్లి నేర్చుకున్న విద్యలో భాగాలైతే, నటరాజు ప్రసాదించిన రంగవైఖరి, శ్రావ్యమైన సంగీతం, స్పష్టమైన, భావోద్దీప్తమైన ఉచ్చారణ, భావార్థ ప్రతిపాదకమైన వాచిక విన్యాసం ఆయనను సమకాలీన నటలోకంలో ఉన్నతమైన స్థానంలో నిలబెట్టాయి. ❑

# బెల్లంకొండ సుబ్బారావు



"మీసాల కృష్ణుడు"గా ప్రసిద్ధుడై తెలుగునాటకరంగం మీద కృష్ణ పాత్ర చిత్రణలో వైవిధ్యాన్ని, విభిన్న కోణాలను చూపుతూ, అనుక్షణమూ మారుతూ పోయే ఆయన మనోభావాలను అలవోకగా వెలువరించి తరువాతి తరాల కృష్ణ పాత్రధారులందరికీ ఒక ఒరవడి సృష్టించిన ఘనత బెల్లంకొండ సుబ్బారావుగారిది. నిజానికి ఆయన నలుడు, హరిశ్చంద్రుడు, సారంగధరుడు, రంగారాయుడు వంటి అనేక ప్రధానమైన పాత్రలను అంతే సామర్థ్యంతో నిర్వహించినా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచింది మాత్రం 'ఉద్యోగవిజయా'ల్లో కృష్ణ పాత్రవల్లనే. తొలిరోజుల్లో గుంటూరు కంపెనీలో హరిప్రసాదరావుగారి బాణీ పట్టుబడడం వల్ల దానికి తనవైన అలంకారాలు దిద్ది తన కృష్ణ పాత్రకు సమున్నతమైన వ్యక్తిత్వాన్ని కల్పించాడాయన.

బెల్లంకొండ సుబ్బారావు జన్మస్థలం పల్నాటిసీమలోని కారంపూడి. కాని పిల్లలను పెద్ద చదువులు చదివించాలన్న ఆకాంక్షతో తండ్రి లక్ష్మీనారాయణగారు కుటుంబాన్ని నరసరావుపేటకు మార్చారు. బెల్లంకొండ అక్కడే మెట్రిక్యులేషన్ పూర్తిచేసి గుంటూరులో కాలేజి విద్య చదివి, లా చదవడానికి మద్రాసు చేరి, లాయరుగా నరసరావుపేటలో ప్రాక్టీసు ప్రారంభించారు. బి.ఏ. చదివేరోజుల్లోనే గుంటూరులో తొలుత గుంటూరు ఫస్టు కంపెనీ నుంచి చీలి హరిప్రసాదరావు గారు ప్రారంభించిన సీనియర్ హిందూ థియేటర్‌లో చిన్న

చిన్న వేషాలు వేసి ఆ తరువాత అఫీషియల్ డ్రమెటిక్ క్లబ్‌లో నాయక పాత్రలు ధరించే స్థాయికి ఎదిగారు. ప్రఖ్యాత దర్శకులు, సంగీత దర్శకులు ఈ సంస్థ నాటకాలకు దర్శకులుగా ఉంటూ బెల్లంకొండ నరసింహం, బెల్లంకొండ సుబ్బారావు, చోరగుడి దాశరథిరావు వంటి ఎందరో నటులను తీర్చిదిద్దారు. ఈ సంస్థలో సుబ్బారావుగారు 'పాండవోద్యోగ', 'పాండవ విజయాల'లోను, 'తులాభారం'లోను కృష్ణుడుగాను, 'బొబ్బిలి యుద్ధం'లో విజయరామరాజుగాను, 'చిత్రనళీయం'లో బాహుకుడుగాను, 'విజయనగర సామ్రాజ్యపతనం'లో పఠాణిగాను ఎంతో కీర్తిని ఆర్జించాడు. మిగిలిన అన్ని పాత్రలలోను సమకాలీన నాటకరంగంలో ఆయా పాత్రలకు పేరెన్నికగన్న నటులతో సరిసమానంగా చేశాడన్న పేరు గడించినా, కృష్ణపాత్రలో ఆనాటి కృష్ణపాత్రధారులందరినీ అధిగమించే వాచిక సాత్త్వికాభినయాలను ప్రదర్శించేవాడన్న పేరు సంపాదించుకున్నాడు.

ఒక పక్క వీలున్నప్పుడు గుంటూరు సభలలో నటిస్తున్నా నరసరావుపేట మాత్రం ఆయనకు ప్రథమగణ్యమైన పట్టణంగానే ఉండిపోయింది. ఇక్కడ 1900లోనే జమిందారు గారి సహకారంతో ప్రారంభమయిన 'విక్టోరియా మెమోరియల్ థియాట్రికల్ కంపెనీ'లో బెల్లంకొండ ప్రధాన పాత్రలు ధరించాడు. తొలుత దీనికి ఆధిపత్యం వహించిన వంగల ఆంజనేయులుగారు బందరు నేషనల్ థియేటర్ నుంచి నరసరావుపేట వచ్చి ఈ నాటక సమాజానికి సారథ్యం వహించారు. ఆయన కీర్తిశేషులయిన తరువాత ఆ స్థానాన్ని పూరించినవాడు బెల్లంకొండ సుబ్బారావుగారు. నిర్దిష్టమైన వాచికం, శ్రుతిలో మేళవించే పద్యపఠనం, అర్థాన్ని ఒలిచి చేతిలో పెట్టినట్లుండే భావ ప్రధాన వాచికవైశిష్ట్యం, పద్యం పాడేటప్పుడు కేవలం పద్య అర్థాన్నే కాక అందులో ఉండే అంతరార్థాన్ని, వ్యంగ్యాన్ని కూడా సమాంతరంగా పలికించడంలో దిట్టగా పేరు గడించారు సుబ్బారావుగారు. 'పాండవోద్యోగం'లో "పడకసీను" (ఇప్పుడు దాని పేరు యిది!) దుర్యోధ నార్జునులను ఆయన మాటలతో లాలించి, ఏడ్పించి, కవ్వించి వదిలేవారు. అలాగే రాయబారం సీనులో భీముడిని వ్యంగ్యంగా ఈసడించే పద్ధతి, ఆ వెంటనే అనునయించే పద్ధతి, మధ్యలో ధర్మరాజును సముదాయించే పద్ధతి – ఒక ఆటగా, ఒక సవాలుగా కనిపించేది. ఆ రంగాల కోసం ప్రేక్షకులు


ఎదురుచూసేవారు. ఆయనకున్న 134 పద్యాలలో ఏ ఒక్కటి వదిలినా ఒప్పుకునేవారు కాదు. అంత బక్కప్రాణం రాత్రంతా గుక్క తిప్పకుండా పాడుతూనే పోవడం, అలా అనేక వరుస రాత్రులలో అలుపెరుగని సుబ్బారావుగారి గళం పద్య విన్యాసం చేస్తూనే వుండి ప్రేక్షకులకు నిరంతర హర్షామోదాలను కలిగించడమే సుబ్బారావుగారి పేరుప్రఖ్యాతులకు కారణం.



తెలుగు నాటకరంగం మీద ఆయనను మించిన అందగాళ్లయిన కృష్ణ పాత్రధారులుండ వచ్చు; ఆయనకన్న గొప్పగా 'గిరికీ'ల సంగీతాన్ని వినిపించి వుండవచ్చు; హావభావాల ప్రదర్శనలో అఖండులనిపించవచ్చు, కాని ఆయనలా తిరుపతి వేంకటకవుల కృష్ణ పాత్ర లీలాతత్వాన్ని ఆవిష్కరించిన నటులు బహు తక్కువమంది. అందులో ప్రప్రథమ స్థానంలో నిలిచే నటుడు బెల్లంకొండ సుబ్బారావు. అంతేకాదు ఆ రోజుల్లో ఆయన మీసాలు తీయకుండా కృష్ణుడి వేషం వేస్తూ వుంటే "కృష్ణునకు మీసములున్నవా?" అని పత్రికలలో పండితుల మీమాంసలు జరుగుతూ వున్నప్పుడే తాను రంగస్థలం మీద మీసాల కృష్ణుడుగా ప్రత్యక్షమై కృష్ణునికి మీసాలు ఉన్నా లేకపోయినా ఆ కృష్ణుడు బెల్లంకొండ వారివలెనే ఉండేవాడు, మాట్లాడేవాడు, పాడేవాడు, ఎకసక్కేలాడేవాడు, లాలించేవాడు అని ప్రేక్షకులు అనుకుంటూ తన్మయత్వం చెందేటట్లు నటించిన నటుడు కూడా బెల్లంకొండ సుబ్బారావుగారే!

అనేక సంవత్సరాలు తన శ్రీకృష్ణ పాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించిన బెల్లంకొండ సుబ్బారావు గారు 1952వ సంవత్సరం నవంబరు 21వ తేదీన నరసరావుపేటలో కాలధర్మం చెందారు. ❑

# మాధవపెద్ది వెంకటరామయ్య



తెలుగు నాటకరంగ చరిత్రలో ఉదాత్త నటనకు భాష్యం చెప్పి, ఆయా ప్రఖ్యాత పాత్రలకు ప్రాణం పోసి ఆ పాత్రలను పోషించే ఇతర నటులందరూ తన నటనా వైదగ్ధ్యాన్ని అనుసరించేవిధంగా నటించిన మహామహులైన నలుగురైదుగురు తెలుగునటులలో మాధవపెద్ది వెంకటరామయ్య ఒకరు. ఉద్ధత పాత్రలకు ఉదాత్త నటనను జోడించి ఆ పాత్రలను అజరామరం చేశాడాయన. 'రోషనార'లో శివాజీ వంటి ఉత్తమ నాయకపాత్రను ఎంత హుందాగా రాచరికపు ఠీవితోను, వీరరసాత్మకంగాను పోషించారో, రారాజుగా ప్రసిద్ధుడై, ప్రతినాయకుడైన దుర్యోధనుని పాత్రను అంతే సర్వజనామోదంగా నటించిన నటధీరుడాయన.

మాధవపెద్ది వెంకటరామయ్య గారిది గుంటూరుజిల్లాలోని బ్రాహ్మణ కోడూరు. పాండిత్య కళాదీధితులు వెదజల్లిన గ్రామం. ఆ గ్రామంలోని మాధవపెద్ది వంశం కళలకు కాణాచి. ఆ వంశంలో వెంకటరామయ్య గారు 1898లో జన్మించారు. బ్రాహ్మణకోడూరులోను, తెనాలిలోనూ విద్యాభ్యాసం. యస్.యస్.యల్.సి. వరకు చదివి, బందరులో మెకానికల్ ఇంజనీరింగ్‌లో సర్టిఫికెట్ పొంది కొన్నాళ్ళు ఉద్యోగం చేశారు. తెనాలి తాలుకా హైస్కూలు పూర్వవిద్యార్థుల వార్షికోత్సవంలో తొలి రంగస్థల ప్రవేశం చేసి తొలుత సహదేవుడు వంటి చిన్నపాత్రలను సమర్థవంతంగా నటించి పెద్దల మెప్పు పొందారు. 1920లో ప్రారంభమైన శ్రీరామవిలాససభలో ప్రముఖ సభ్యుడై ఆ సంస్థ దర్శకులైన త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారికి ప్రియశిష్యుడైనాడు.



'ద్రౌపదీ మానసంరక్షణము' (1936)లో శిశుపాలుడుగా

మాధవపెద్ది క్రమశిక్షణ గల నటుడు. రోజూ వ్యాయామం చేసేవాడు. తాను ధరించే పాత్రలకు న్యాయం చేయడానికి నిత్యమూ తపన పడేవాడు. ఆంగ్ల, సంస్కృత భాషలతో కొంత పరిచయం, తెలుగులో మంచి ప్రవేశం ఉండడం వల్ల పాత్రలను కేవలం గురువు చెప్పిన మేరకే పరిమితం చేయక వాటి పూర్వాపరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసేవాడు. పెద్ద గాయకుడు కాకపోయినా తన వచన సంభాషణలనే లయాన్వితంగా భావస్ఫోరకంగా ఉదాత్తానుదాత్తల క్రమగతిలో ఉచ్చరించడంలో దిట్టగా పేరు పొందాడు. రాగం లేకపోయినా శ్రుతిపక్వంగా ఉండే భావాలను ఉద్దీప్తం చేసేవిధంగా పద్యాలలోని ఎంతటి కఠిన సమాసాలనయినా విడగొట్టి రసరమ్యంగా చదివేవాడు.

మాధవపెద్ది తనకీ పాత్ర కావాలని, తాను నాయకపాత్రే ధరించాలని పట్టుదల లేని నటుడు. తన సమాజం, దర్శకులు ఏ పాత్రనిస్తే ఆ పాత్ర అనుపానులు తెలుసుకొని నిండుగా నటించేవాడు. పాత్రలను రంగస్థలం మీద వ్యక్తీకరించేటప్పుడు మాధవపెద్ది నిర్దిష్ట వాచిక విన్యాసంతోపాటు,

ఆంగికచలనాలను, సాత్త్వికభావాలను వాచికానికి వ్యాఖ్యానంగా జోడించేవారు. ఒక శిరః కంపనంతో, పెడమొగం పెట్టడంతో, ఒక భ్రూకుటి ముడి వెయ్యడంతో – పాత్రల మనస్తత్త్వాన్ని వెల్లడించే ఉత్తమ సాత్త్విక నటుడు మాధవపెద్ది.

మాధవపెద్దికి పేరు గడించి పెట్టిన పాత్రలలో శివాజీ, దుర్యోధనుడు, రంగారాయుడు ముఖ్యమైనవి. శివాజీ పాత్రలో మాధవపెద్ది రవివర్మ చిత్రించిన శివాజీ రూపంతో సర్వాంగస్ఫూర్తితో కనిపించేవాడు. తారుణ్యవతి, అభిమానవతి అయిన రోషనారా అసంగతమైన ప్రేమను తిరస్కరిస్తూ శివాజీ చూపిన లాలిత్య ప్రధానమైన ఉదాత్త స్వభావం మరువలేనిది. రోషనార అతిలోక సౌందర్యవతి. కాని ఆమె పరస్త్రీ. తానో స్వాతంత్ర్యకంకణబద్ధుడు. ఏ ఇతర భావమూ తన మనసులోనికి రాకూడదు. పైగా సర్వ భారతీయ గర్వోన్నతికి తాను చిహ్నం. అటువంటి ప్రేమాస్పదుడైన, రాచరికపు మర్యాదనెరిగిన శివాజీని చూపాడు మాధవపెద్ది. రామవిలాససభ నాటకాలలో 'రోషనార'కు వచ్చినంత పేరుప్రతిష్ఠలు మరో నాటకానికి రాలేదు. దానికి కారణం రోషనార పాత్రధారి స్థానం నరసింహారావు, శివాజీ పాత్రధారి మాధవపెద్ది. తరువాతి కాలంలో ఈ ఇద్దరు ప్రధాన నటుల మధ్య అభిప్రాయభేదాలు రావడంతో మాధవపెద్ది ఆ పాత్ర నుంచి తప్పుకున్నాడు. ఇతరులు ఆ పాత్ర ధరించినా రక్తి కట్టకపోవడంతో ఆ నాటకం తెరమరుగు కాక తప్పలేదు.

మాధవపెద్దికి పేరు తెచ్చిన మరో పాత్ర 'బొబ్బిలియుద్ధం'లో రంగారాయుడి పాత్ర. వీరతాభావం, కారుణ్యం సమపాళ్ళలో రంగరించి ప్రదర్శించే ఈ పాత్రలో మాధవపెద్ది నటన అద్వితీయం. పరస్పర విరుద్ధ భావాలను కన్నులతోనే పలికించగల దిట్ట మాధవపెద్ది. మానవతి అయిన భార్య సహగమనం చేయడానికి సమకట్టడం, ఇతర అంతఃపుర స్త్రీల అంధకార భవితవ్యం, తన కొడుకు చిన రంగారాయని క్షేమం, బావ పాపారాయుడు దగ్గరలేని లోటు, ఏమరుపాటున ఉండగా దొంగదెబ్బ తీస్తున్న ప్రత్యర్థుల వంచన – ఇన్ని విరుద్ధభావాలను అలవోకగా వ్యక్తీకరించడంలో మాధవపెద్ది రసోద్వేగ నటనా వైవిధ్యాన్ని ప్రదర్శించేవారు.

మాధవపెద్ది నటజీవన పరాకాష్ఠ 'పాండవోద్యోగ విజయాల'లో దుర్యోధన పాత్ర. తిరుపతి వేంకటకవుల రెండు నాటకాలను 'ఉద్యోగవిజయాల'ని, 'కురుక్షేత్రం' అనీ ఒకే నాటకంగా ఆడడంలో మాధవపెద్ది ప్రధాన సూత్రధారుడు.



**'సతీ తులసి' (1936) సినిమాలో శివుడుగా**

దుర్యోధన పాత్రను ప్రదర్శించడంలో అంతకుముందే యడవల్లి సూర్యనారాయణగారికి ఎంతో పేరుండేది. ఆయన దుర్యోధన పాత్ర పోషణలో ఆ చక్రవర్తిని అవమాన పరాభూతుడుగా, క్రోధోన్మత్తుడుగా, కపటద్యూతప్రియుడుగా, పాండవద్వేషిగా కనిపించేవాడు. కాని మాధవపెద్ది దుర్యోధనుడిని అభిజాత్యం ఉన్న శౌర్యవంతుడుగా, శాస్త్రవిషయసంపన్నుడుగా, స్వశక్తి మీద నమ్మకం ఉన్న రారాజుగా రూపొందించాడు. ఇద్దరివీ రెండు వేర్వేరు విశ్లేషణలు! రెంటినీ ప్రజలు ఆదరించారు. కాని విద్యావంతులకు మాత్రం మాధవపెద్ది పాత్ర చిత్రణే సమంజసం అనిపించేది. 1930 నవంబరు నాటి భారతి మాసపత్రిక పేర్కొనట్లు – "అభిమానత తన శక్తియందును, బలము నందును, మెండగు విశ్వాసము... జయముగాకున్న స్వర్గమనెడు వీరభావము' ఇన్ని లక్షణములతోడి దుర్యోధనుని ఉత్కంఠ ప్రకృతిని తమలో చూపించిరి" – అన్న మాటలు పాత్ర చిత్రణను గురించిన మాధవపెద్ది ప్రత్యేకతను నిరూపిస్తాయి.

ఈ పాత్రలు ఆయనకు అశేషమైన పేరుప్రఖ్యాతులను సంపాదించి పెట్టినా, ఇంకా నాలుగు కాలాలపాటు జ్ఞాపకం ఉంచుకొనే ఎన్నో పాత్రలను మాధవపెద్ది పోషించారు. 'శ్రీకృష్ణతులాభారం'లో కృష్ణుడుగా, 'ప్రతాపరుద్రీయం'లో వలీఖానుగా, 'నర్తనశాల'లో కీచకుడుగా, 'వేనరాజు'లో వేనరాజుగా, 'సారంగధర'లో సారంగధరుడుగా తన ప్రతిభను వెల్లడించాడు. తన అరవయ్యో సంవత్సరంలో తన మాతృసంస్థ అయిన పూర్వ విద్యార్థి సంఘం ప్రదర్శించిన 'ప్రతాపరుద్రీయం'లో విద్యానాథుని పాత్రను ధరించి తనకు ఆ పాత్రకు కూడా అజరామరత్వం కల్పించాడు మాధవపెద్ది.


మాధవపెద్ది ఆంధ్ర నాటక కళాపరిషత్తులో అనేక సంవత్సరాలు కార్యవర్గ సభ్యుడుగా వున్నాడు. 1951లో పరిషత్తు సభలకు అధ్యక్షత వహించాడు. పరిషత్తు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఎందరో శిష్యులకు వాచిక, అభినయాలలో శిక్షణనిచ్చాడు.

మాధవపెద్ది స్నేహశీలి. నాటకరంగంతో మమేకం అయి జీవితం గడిపాడు. ఎందరో యువనటులకు ప్రోత్సాహసహకారాలందించాడు. తనకు పిల్లలు లేకపోతే ఒక ముస్లింబాలుడిని పెంచి పెద్దచేసిన సౌమ్యశీలి. బయటకు వచ్చినా అతి సాధారణమైన వస్త్రధారణ. బనీను, లుంగీ, పైన ఒక అంగ వస్త్రం. పొగతాగడం, చీట్లపేక ఆడడం ఆయన వ్యసనాలు. అడిగినవారికి లేదనకుండా దానం చేయడం ఆయన సహజ సౌశీల్యం.

మాధవపెద్ది సినిమాలలో కూడా రాణించారు. 'ద్రౌపదీ మానసంరక్షణము' (1936) లో శిశుపాలుడు, 'సతీతులసి' (1936) లో శివుడు, 'విజయదశమి' (విరాటపర్వము 1937) లో కీచకుడు, 'నలదమయంతి' (1938) లో నలుడు, 'పార్వతీకల్యాణం' (1939) లో శివుడు, 'చంద్రహాస' (1941) లో దుష్టబుద్ధి, – మొదలైన అనేక పాత్రలను పాత్రోచితంగా తీర్చిదిద్దారు. సినిమాలలో నటించాక కూడా తిరిగి రంగస్థల ప్రవేశం చేసి స్వంత నాటక సమాజాన్ని స్థాపించి పీసపాటి నరసింహమూర్తి మొదలైనవారితో ఉద్యోగవిజయాలు ఊరూరా ప్రదర్శించారు.


తన 61వ ఏట 1951 మార్చి 19న తెనాలిలో ఆ మహానటుడు నిర్యాణం చెందాడు. ❑

# పులిపాటి వెంకటేశ్వర్లు



సహజసిద్ధమైన వాక్చాతుర్యం, స్ఫుటమైన వాచిక విన్యాసం, ఎంతటి జటిల సమాసాలు గల పద్యాల నయినా భావార్థ ప్రతిపాదకాలు చేసి గూఢార్థాలను సైతం విశదం చేయగల ఉచ్చారణా నైపుణ్యం ఉన్న అతికొద్ది మంది తెలుగు నటులలో పులిపాటి వెంకటేశ్వర్లు ఒకరు. మనిషి అందగాడు కాదు. చామనచాయ. దృఢమైన కాయం కలవాడు కాదు. సంగీతశాస్త్ర పరిజ్ఞానం అంతగా లేనివాడు. అయినా ఆయన తాను ధరించబోయే పాత్రల ఆనుపానులు గ్రహించగలిగిన విజ్ఞత కలవాడు. ఆ పాత్ర స్వభావాన్ని తన ఆంగిక వాచికాభినయాల ద్వారా ప్రస్ఫుటం చేయగల నటధీశాలి. పద్యాన్ని ఎలా చదివితే ప్రేక్షకుల మనసులకు కవి హృదయం విస్పష్టంగా తెలుస్తుందో అవగాహన కలిగిన ఉత్తమ నటుడు. రంగస్థలం మీద పులిపాటి తమతో నటిస్తున్నాడంటే ప్రధాన నాయక నాయికా పాత్రధారులంతా తమ తమ పాత్రల చిత్రీకరణలో జాగ్రత్త వహించేవారు. 'రాయబారం'లో అర్జునుడు, 'చింతామణి'లో భవానీశంకరుడు, 'ప్రతాపరుద్రీయం'లో చెకుముకి శాస్త్రి – ఈ పాత్రలు చాలు పులిపాటివారి నటనా వైవిధ్యానికి, నటనా వైశద్యానికి అద్దం పట్టడానికి. ధీరోదాత్త పాత్రలను ఎంత గొప్పగా పోషించాడో హాస్యరస స్ఫోరకమైన పాత్రలను కూడా అంతే శక్తియుక్తులతో నటించి తన సంపూర్ణ నట సామర్థ్యాన్ని చాటిచెప్పిన నటశిరోమణి పులిపాటి.

1900వ సంవత్సరం సెప్టెంబరు 15న ఓ మధ్యతరగతి కుటుంబంలో తెనాలిలో జన్మించిన పులిపాటి అక్కడే తన విద్యాభ్యాసం కొనసాగించాడు.




ఆనాటి పత్రికా ప్రకటనలో పులిపాటి

స్కూలు పిల్లలను చేర్చుకొని నాటకాలు ఆడడం, ప్రతిరోజూ జరిగే ప్రార్థనా కార్యక్రమంలో క్రమం తప్పకుండా పద్యాలు పాడడంతో పిల్లలందరికి పులిపాటి అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం ఏర్పడ్డది. శ్రావ్యమైన కంఠస్వరం కలిగివుండడంతో పాటు సంభాషణాచతురుడు, పరిహాస ప్రియుడు కావడంతో అతి కొద్ది కాలంలోనే పిన్నల పెద్దల ఆదరాభిమానాలు పొందాడు. 1921లో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని, ఆంగ్ల పాఠశాలలను బహిష్కరించండని గాంధీజీ యిచ్చిన పిలుపు మేరకు చదువుతున్న మెట్రిక్యులేషన్ చదువుకు స్వస్తి చెప్పాడు. అప్పటికే పూర్వ విద్యార్థి సంఘ వార్షికోత్సవాలలో నాటకాలాడుతుండడంతో అక్కడ చేరిన విద్యార్థులను కూర్చుకొని "యూనివర్సల్ డ్రమెటిక్ అమెచూర్స్" పేరున నాటక సమాజాన్ని స్థాపించి నాటకాలాడడం మొదలుపెట్టాడు. 1921లో ప్రారంభించ బడిన ప్రఖ్యాత నాటక సమాజం శ్రీరామవిలాస సభలో చేరి ప్రముఖమైన పాత్రలను ధరించి ఆ సంస్థకు, తనకు, తనతోటి నటులకు గౌరవ ప్రతిష్టలు సంపాదించి పెట్టాడు. ఈ సంస్థలో ఉండగానే 'గయోపాఖ్యానం', 'పాండవోద్యోగ విజయాల'లో అర్జునుడు, 'పాదుక'లో రాముడు, 'చింతామణి'లో భవానీశంకరుడు, 'బొబ్బిలియుద్ధం'లో వెంగళరాయుడు, 'కన్యాశుల్కం'లో కరటకశాస్త్రి, 'ప్రతాపరుద్రీయం'లో చెకుముకి శాస్త్రి వంటి పాత్రలకు జీవం పోసి ఆంధ్ర నాటకరంగంలో తనదైన ఒక ప్రత్యేకతను, గుర్తింపును సాధించాడు.

సభ్యులలో సమన్వయం లోపించడం గమనించి 1927లో రామవిలాస సభను విడిచిపెట్టి వాసవీ విలాససభలో చేరాడు. అక్కడకూడా ఎక్కువకాలం నిలవలేక 1928లో స్వయంగా శ్రీనాట్యసభ (అమెచూర్స్) అనే సంస్థను స్థాపించి



'హరిశ్చంద్ర' (1935) లో నక్షత్రకుడుగా

హరిశ్చంద్ర, పాదుక, తులాభారం వంటి నాటకాలను ప్రదర్శిస్తూ ఆంధ్రదేశ పర్యటన చేశాడు. 1928 చివర చిరకాల మిత్రుడు డాక్టర్ మోటిపల్లి వీరభద్రరావుగారి చొరవతో చిత్తూరు జిల్లా "సదుము"లో కొంతకాలం ఉపాధ్యాయుడుగా ఉన్నాడు. అక్కడే వాక్సినేటర్ పరీక్షలో ఉత్తీర్ణుడై ఆ వృత్తి చేపట్టినా ఇమడలేక తిరిగి స్వగ్రామం తెనాలి చేరుకొని వాసవీ విలాససభను పునరుద్ధరించే ప్రయత్నం చేశాడు. కాని సమాజాలు మూతపడి కాంట్రాక్టరుల బలిమి ఎక్కువ కావడంతో ఏటికి ఎదురీదలేక తాను కూడా జీవిక కోసం ఆ ఊబిలో దిగి అర్జునుడు, భవానీశంకరుడు, నక్షత్రకుడు వంటి ప్రజామోదం పొందిన పాత్రలను ధరిస్తూ కాలం గడిపాడు.

ఇదే సమయంలో – 1933లో – తెలుగు టాకీలు ప్రారంభమైన తొలిరోజుల్లో కలకత్తా మదన్ థియేటర్ వారి ఆహ్వానం మేరకు వారి 'చింతామణి' సినిమాలో భవానీశంకరుడి పాత్రను పోషించారు. కొద్దిరోజుల్లోనే 'హరిశ్చంద్ర' (1935) సినిమాలో నక్షత్రకుడు, 'సతీతులసి' (1936), 'మోహినీరుక్మాంగద' (1937), 'సారంగధర'లో (1939) సుబుద్ధి, 'పాశుపతాస్త్రం'లో నారదుడు మొదలైన పాత్రలను సమర్థవంతంగా నిర్వహించారు. ఆ తరువాత 'చంద్రహాస' (1941), 'చూడామణి' (1941), 'తల్లిప్రేమ' (1941), 'విష్ణుమాయ' (1963) మొదలైన సినిమాలలో విభిన్నమైన పాత్రలు ధరించాడు.


సినిమాలలో కొత్త నటులు రావడంతో పాత్రల కోసం వేచి చూసే మనస్తత్వంలేని పులిపాటి తిరిగి తెనాలి చేరి రంగస్థల, సినీనటి రామతిలకంతో

కలిసి "ఆంధ్ర నటసభ" (అమెచూర్స్) అన్న నాటక సమాజాన్ని తిరిగి ప్రారంభించి 'తులాభారం'లో కృష్ణుడుగా, 'చింతామణి'లో భవానీశంకరుడుగా నటిస్తూ ఆంధ్రదేశం నలుమూలలా ప్రదర్శనలిచ్చారు. రంగస్థల ఉద్దండులైన రాఘవ, బందా, స్థానం, మాధవపెద్ది మొదలైనవారితో తనకిష్టమైన అర్జున, భవానీశంకర, చెకుముకి శాస్త్రి పాత్రలను ధరించేవారు.

ఎక్కడ ప్రదర్శనలిచ్చినా పులిపాటికి జేజేలు పలికారు జనం. దానికి కారణం ఆయన పాత్ర యెడ, ఆ పాత్ర నడవడిక మీద చూపించే శ్రద్ధ, ఇతర నటులతో సహకారభావంతో నటిస్తేనే నాటకం రక్తి కడుతుందన్న విశ్వాసం, ఎంతటి క్లిష్ట పదజాలాన్నయినా భావస్ఫోరకంగా పలికించగల విన్నాణం, వీనులకు విందు చేసే గాత్ర సారళ్యం. రంగస్థలం మీద రాగం రాజ్యం చేస్తున్న రోజుల్లో రాగమిళితమైన భావప్రధానమైన పద్యపఠనానికి ఆయన యిచ్చిన ప్రాధాన్యం విచక్షణశీలురైన ప్రేక్షకులకు ఆహ్లాదాన్ని కలిగించేది. ఇది ఆయనకు రామవిలాససభలోని శిక్షణ వల్ల అబ్బిన లక్షణం. దానికితోడుగా పాత్రల స్వభావాన్ని, సన్నివేశాల ఔచిత్యాన్ని ఎరిగి నటించిన నటుడాయన. 'హరిశ్చంద్ర'లో నక్షత్రకుడు, 'చింతామణి'లో భవానీశంకరుడు, 'ప్రతాపరుద్రీయం'లో చెకుముకి శాస్త్రి పాత్రలకు ఆయన జీవం పోశాడనే చెప్పాలి. నటనలోని సర్వాంగ సామర్థ్యంలో ఆయనకు సాటి రాగలవారు అరుదని విమర్శకులే అంగీకరించారు. నాయకవేషాలు యిస్తేనే పాత్రధారణ చేస్తాననే పట్టుదల లేక యిచ్చిన పాత్రను ప్రధాన పాత్ర స్థాయికి తీసుకొని పోగల సామర్థ్యం గల నటుడాయన. అందుకే కాశీ కృష్ణాచార్యులుగారి వంటి మహామహుడు పులిపాటిని 'నటశేఖర' బిరుదుతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్‌ను యిచ్చి సన్మానించింది. ఆంధ్రదేశంలోని పల్లెపల్లెనా, ప్రతిపట్టణంలోను ఆయనకు సన్మానాలు జరిగాయి. నిత్యమూ సమకాలీన నాటకరంగంతో సత్సంబంధాలు పెంచుకొని నటులను గురించి, నాటకరంగం గురించి ఉపన్యాసాలు యిచ్చారు, వ్యాసాలు రాశారు.

చివరిరోజుల్లో ఆర్థికంగా చితికిపోయి, పక్షవాత వ్యాధితో అవస్థలు పడుతూ తన 72వ ఏట 1972 జూన్ 6వ తేదీన తెనాలిలోనే పరమపదించాడు పులిపాటి. ❑

# మంగళగిరి (సీనియర్) శ్రీరంజని



**1934**వ సంవత్సరంలో "లవకుశ" సినిమాలో సీత పాత్ర ద్వారా ప్రేక్షకులకు పరిచయమై, మొదటి సినిమాతోనే తారగా గుర్తింపబడి, అఖండ సన్మానాలు అందుకొన్న శ్రీరంజని 1906వ సం॥లో గుంటూరు జిల్లా మురికిపూడి గ్రామంలో జన్మించింది. 1911లో ఆ వూరి బోర్డు స్కూలులో చదువుతూ వుండగానే "విద్యావర్ధని" అనే నాటికలో తల్లి వేషం వేసి ఊరివారి మన్ననలు అందుకుంది. ప్రాథమిక విద్య పూర్తిచేసుకొని మేనత్తలు అంజనీదేవి, శేషగిరిల వద్ద సంగీతమూ, నాట్యమూ అభ్యసించింది. 14వ ఏట తన మేనత్తలు నటులుగా పనిచేస్తున్న శ్రీకృష్ణ విలాససభ అనే నాటక సమాజంలో నటించి నటిగా గుర్తింపు పొందింది. ఆ సమాజం అధిపతి బెజవాడ హనుమద్దాసు, దర్శకుడు ఎ.టి.రామాంజులు అనే ప్రఖ్యాత హార్మోనిస్టు శిష్యుడు. ఆ సమాజానికి హార్మోనిస్టు

నాగుమణి (తరువాతి రోజుల్లో యస్.ఆర్. మూవీస్ అధినేత). శ్రీరంజని, నాగుమణి యిద్దరూ నాటకాలే వృత్తిగా కలిగివుండడంతో వివాహం చేసుకున్నారు. ఈ సమాజం ఎక్కువగా పల్నాడు తాలుకాలోను, రాయలసీమ జిల్లాలలోను పర్యటించేది. ఈ సమాజంలో శ్రీరంజని మగ, ఆడ వేషాలు రెండూ వేసేది. 'శశిరేఖా పరిణయం'లో శశిరేఖగాను, అనిరుద్ధుడిగాను, 'సావిత్రి'లో సత్యవంతుడుగాను, సావిత్రిగాను నటించి పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ఇంకా 'రాధాకృష్ణ'లో కృష్ణుడు, నారదుడు, 'కృష్ణలీలలు'లో దేవకి వంటి విభిన్నమైన స్త్రీ పురుష పాత్రలను ధరించేది.

శ్రీరంజని తన గాత్ర మాధుర్యంతో, సశాస్త్రీయ సంగీతంతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్న తరుణంలోనే హెచ్.యమ్.వి. కంపెనీవారు ఆమెను గ్రామఫోను రికార్డులివ్వవలసిందిగా ఆహ్వానించారు. అనేక నాటకాల 'సెట్'లలో ఆమె ప్రధాననటిగా పాత్రధారణ చేసింది. హెచ్.యమ్.వి. వారు రిహార్సలు కోసం శ్రీరంజనిని బెజవాడ తీసుకువెళ్లారు. సరిగ్గా అదే సమయంలో "లవకుశ" (1934) సినిమాలో సీత వేషం వేసే నటీమణి కోసం ఆ చిత్ర దర్శకుడు సి.పుల్లయ్యగారు బెజవాడ వచ్చి, పారుపల్లి సత్యనారాయణగారి ద్వారా శ్రీరంజనిని గురించి తెలుసుకొని, ఆమెను చూసి, ఆమె పాట విని వెంటనే ఆ పాత్రకు ఆమెను నిశ్చయించారు. అలాగే ఆమె భర్త నాగుమణి గారిని భరతుడి వేషానికి "బుక్' చేశారు.

శ్రీరంజని, నాగుమణి గార్లు బెంగుళూరు వెళ్లి హెచ్.యమ్.వి. కి రికార్డులు యిచ్చి అక్కడ నుంచి నేరుగా 'లవకుశ' సినిమా కోసం కలకత్తా వెళ్లారు.

"లవకుశ" సినిమాలో శ్రీరంజని ధరించిన సీత వేషానికి పండిత ప్రశంస, ప్రేక్షకజన సమ్మోదం లభించడంతో రాత్రికి రాత్రి ఆమె పెద్ద "స్టార్" అయింది. రామతిలకం తరువాత ఆ "తార" హోదా తెచ్చుకున్నది సీనియర్ శ్రీరంజనే! ఆమె ఎక్కడకు వెళ్లినా జనం హారతులు పట్టారు. సినిమాలో కనిపించిన "సీతమ్మ" బొమ్మను వాల్‌పోస్టర్ల నుంచి కత్తిరించి ఇళ్లలో గోడలకు అంటించుకున్నారు. "లవకుశ" సినిమా చూడడానికి ఎక్కడెక్కడి జనమో బళ్లమీద



**వేల్ పిక్చర్స్ వారి 'కృష్ణలీలలు' (1935) లో దేవకి పాత్రలో**

వచ్చేవారు. ఆమెను పసుపు, కుంకుమ, చీరె, రవికెలతో సత్కరించారు. ఆమె నటనను మెచ్చి కాశీనాథుని నాగేశ్వరరావుగారు, జయపూర్ మహారాజు విక్రమదేవవర్మగారు, మద్రాసు గవర్నరు – అందరూ ఆమెకు ప్రశంసలతో పాటు స్వర్ణ పతకాలు అందించారు.

'లవకుశ' విజయవంతం కావడంతో కరుణరస ప్రధానమైన పాత్రలకు శ్రీరంజనే తగిన నటీమణి అని సినిమా ప్రపంచం నమ్మింది. తరువాత ఆమె 'మాయాబజార్' (1935) లో సుభద్ర, 'కృష్ణలీలలు' (1935) లో దేవకి, 'సతీతులసి' (1936) లో పార్వతి, 'సారంగధర' (1937) లో రత్నాంగి, 'నరనారాయణ' (1937) లో గయుని భార్య, 'చిత్రనళీయం' (1938) లో దమయంతి,

'మార్కండేయ' (1938) లో మరుద్వతి, 'వరవిక్రయం' (1939) లో భ్రమరాంబ – వంటి పాత్రలలో నటించి మేటి తారగా సన్మానించబడ్డది.

ఆమెవంటి గాయకనటి బహు అరుదు. కాని కేవలం గానానికే ప్రాధాన్యం యివ్వక నటనకు, ముఖ్యంగా వాచిక సాత్త్వికాభినయాలకు కూడా సమానమైన ప్రాధాన్యతనిచ్చిన ప్రతిభ ఆమెది.

పాతివ్రత్య పాత్రలకు శ్రీరంజని శాంతస్వభావమూ నిండైన ముఖమూ, ఆమెలో కనిపించే భక్తిభావమూ, ఆమె సహజ వినయ సంపన్నత కారణం కనుకనే ఆమెకు అటువంటి పాత్రలు దొరికాయి. 'లవకుశ'లో ఆమె చూపిన పతిభక్తి, పుత్రవాత్సల్యం, పెద్దలయెడ కనబరిచిన భక్తి విధేయతలు సహజంగా ఒప్పడంతో సీత పాత్రలో ఆమె అంత చక్కగా యిమిడిపోగలిగింది.

ఒక పక్క చలనచిత్రాలలో నటిస్తూనే పారుపల్లి సుబ్బారావుగారితో కలిసి 'లవకుశ' నాటకాన్ని ఆంధ్రదేశం నలుమూలలా ప్రదర్శించింది. 1934 ఆంధ్రనాటక కళాపరిషత్తు సభలలో 'రాధాకృష్ణ' నాటకంలో పారుపల్లి రాధగా, శ్రీరంజని మధురగా నటించి నాటకాభిమానుల ప్రశంసలందుకున్నారు.

శ్రీరంజనికి నిజజీవితంలో కూడా భక్తిప్రపత్తులు, పూజలు పునస్కారాలు ఎక్కువ. గుంటూరుజిల్లా ఒంగోలు తాలుకా (అప్పటి) చందలూరులోని మహాలక్ష్మీశ్వరి ఆమె యిష్ట దైవం. శ్రీరంజని నిత్యమూ పూజలు, వ్రతాలు చేసేది.

దురదృష్టవశాత్తు ఆమె తన 33వ ఏట క్యాన్సర్ వ్యాధితో బాధపడి 1939 సెప్టెంబరు 24న మరణించింది. చనిపోవడానికి ముందు తన భర్త కోసం, పిల్లల కోసం తన చెల్లెలు శ్రీరంజనిని వివాహం చేసుకోవలసిందిగా భర్తను కోరింది. చెల్లెలి పేరు కూడా శ్రీరంజని కావడం వల్ల పెద్ద ఆమెను సీనియర్ శ్రీరంజని అని, చిన్న ఆమెను జూనియర్ శ్రీరంజని అని పిలుస్తారు. ఈ జూనియర్ శ్రీరంజని కూడా తరువాతి రోజుల్లో కరుణరస ప్రధానమైన పాత్రలకు పేరు సంపాదించింది.

తల్లి పాత్రలకూ, కరుణరస ప్రధానమైన పాత్రలకు సినిమారంగంలో ఒక ఒరవడిని సృష్టించి చిన్నతనంలోనే తెలుగు సినీప్రేక్షకుల హృదయా□ చెరగని ముద్ర వేసిన నటి శ్రీమతి సీనియర్ శ్రీరంజని.

# దాసరి కోటిరత్నం



దాసరి కోటిరత్నం 1899వ సంవత్సరంలో గుంటూరు జిల్లా పత్తిపాడులో జన్మించింది. తండ్రి నటుడు కావడంతో ఆయన ప్రోత్సాహంతో 8వ ఏటనే రంగస్థల ప్రవేశం చేసి చిన్నపిల్లల పాత్రలు ధరించింది. 'హరిశ్చంద్ర'లో లోహితాస్యుడు, 'బొబ్బిలి యుద్ధం'లో చినరంగారాయుడు, 'ప్రహ్లాద'లో ప్రహ్లాదుడు వంటి పాత్రలు ధరించి పెద్దల మన్ననలు పొందింది. తన తండ్రికి సన్నిహితుడు, గురువుగారు అయిన రాజనాల వెంకటప్పయ్యగారి దగ్గర సంగీతం నేర్చుకున్నది. పదవ యేటనే తల్లి చనిపోవడంతో తండ్రితో పాటు ఆమె మాతామహుల స్వస్థలమైన గుంటూరుజిల్లాలోని నక్కబొక్కలపాడు చేరింది. నాటకాలలో ప్రవేశం, సంగీతంలో కొంత సాధన ఉండటంవల్ల చుట్టుపక్కల గ్రామాలలోని నటులను చేర్చి ఒక నాటక సమాజాన్ని స్థాపించి పక్కగ్రామాలలో నాటకాలు ప్రదర్శించడం ప్రారంభించింది. ఆ సమాజం 'కనకతార', 'కృష్ణలీల', 'రామదాసు', 'సావిత్రి' నాటకాలను అభ్యసించి దిగ్విజయంగా ప్రదర్శనలిచ్చింది. అన్ని నాటకాలలోను ఆమె ప్రధాన స్త్రీ పాత్రలను, అప్పుడప్పుడూ పురుష పాత్రలను కూడా ధరించేది. ఈ ప్రయత్నంలో ఆమె గుంటూరులోని నాటక సమాజాలలో పెద్దలు మల్లాది గోవిందశాస్త్రి, తోట రాఘవయ్య మొదలైనవారి సహాయసహకారాలు తీసుకొనేది. ఆమె మగవేషాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో ఆమెతోపాటు తరుచు పారుపల్లి సుబ్బారావుగారు స్త్రీ వేషం ధరించేవారు. గుంటూరు పెద్దల ప్రోత్సాహంతో తన కార్యస్థానాన్ని గుంటూరుకు మార్చి రెండేళ్లు నాటకాలు ప్రదర్శించింది.

ఇదే సమయంలో దంటు వెంకట కృష్ణయ్యగారు 25 మంది నటీమణులతో నవలా నాటక సమాజం అనే పేరుతో అంతా స్త్రీలే పాత్రధారణ

చేసే నాటక సంస్థను గుంటూరులో ప్రారంభించారు. అందులో కన్నాంబ, అంజనీబాయి, సరస్వతమ్మ, రామాబాయి, తిలకం మొదలైనవారు నటులు. మగవేషాలు వేయడానికి దాసరి కోటిరత్నాన్ని ఆహ్వానించారు వెంకట కృష్ణయ్యగారు. ఆమె ఈ సమాజంలో దాదాపు ఆరు సంవత్సరాలు ప్రధాన పురుష స్త్రీ పాత్రలను ధరించింది. 'సతీ అనసూయ'లో అనసూయగా, అత్రి మహామునిగా, నారదుడుగా - అన్ని పాత్రలలోను ఆమె అసమానంగా నటించేది. ఆ ఒక్క నాటకాన్నే దాదాపు 200 సార్లు ప్రదర్శించింది ఈ సమాజం. ఎక్కడ ఈ నాటకం వేసినా కోటిరత్నాన్ని వెండి బంగారుపతకాలతో సత్కరించేవారు. వీటినన్నింటినీ ఆమె మాలగా గుచ్చి వేసుకొని రంగస్థలం మీదికి రావడం ఆ రోజులలో గొప్పగా చెప్పుకొనేవారు. 'సావిత్రి'లో సత్యవంతుడు, యముడు, 'గంగావతరణం'లో శివుడు పాత్రలు కూడా ఆమెకు మంచిపేరు సంపాదించి పెట్టాయి.



'మోహినీ భస్మాసుర' లో లక్ష్మీదేవిగా

తొలిరోజుల్లో ఒక సమాజాన్ని నడిపిన అనుభవంతో కోటిరత్నం రామతిలకం, అంజనీబాయిలను కలుపుకుని మరో స్వంత సమాజాన్ని స్థాపించింది. ఈ సమాజం ఆధ్వర్యంలో 'సావిత్రి', 'సతీ అనసూయ', 'హరిశ్చంద్ర', 'కనకతార' నాటకాలు ప్రదర్శించింది. ఆ రోజులలో సంగీత దర్శకుడుగా, నాటక దర్శకుడుగా ప్రఖ్యాతి చెందిన కొప్పరపు సుబ్బారావుగారి దర్శకత్వంలో తయారైన ఈ నాటకాలు ఆమెకు మంచి పేరుప్రతిష్టలు సంపాదించిపెట్టాయి. మద్రాసులోను, నైజాంలోను ఈ నాటకాలతో పర్యటించి ఆమె ఎంతో గౌరవప్రపత్తులను పొందింది. ఒక స్త్రీ నేతృత్వంలో నాటక సమాజాలు నడవడం, అవి చక్కని నాటకాలు ప్రదర్శించడం అరుదు. అందువల్ల కూడా ఆమెకు మన్నన, మర్యాదలు లభించాయి. ఈ నాటకాలు విజయవంతం కావడంతో ఆమె 'శ్రీకృష్ణతులాభారం', 'రంగూన్‌రౌడీ'

నాటకలను స్వీకరించి కొప్పరపువారి దర్శకత్వంలోనే విజయవంతంగా ప్రదర్శించింది. స్త్రీ పురుష వేషాలు రెంటినీ సమానమైన ప్రతిభతో నటించడం, ఒక సమాజాన్ని నడపడం, ఆ సమాజంతో రాష్ట్రంలోనే కాక రాష్ట్రేతర ప్రదేశాలకు కూడా ప్రయాణించి నాటకాలు ప్రదర్శించడం – ఈ కారణాల వల్ల నాటకాభిమానులు కోటిరత్నం ధైర్య సాహసాలను మెచ్చుకొనేవారు.



'సతీ అనసూయ' (1935) లో అనసూయగా

1935లో బి.వి. రామానందంగారి దర్శకత్వంలో తయారైన 'సతీ సక్కుబాయి' సినిమాలో ఆమె సక్కుబాయిగా నటించి ప్రేక్షకుల మన్ననలు పొందింది. 1935లో అరోరా ఫిలింస్ సంస్థతో అగ్రిమెంటు కుదుర్చుకుని తాను 15 సంవత్సరాల క్రితం అభిమానించిన నవలా నాటక సమాజం బానర్ మీద తనకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన 'సతీ అనసూయ' నాటకాన్ని సినిమాగా నిర్మించింది. అనూహ్యమైన ఈ సాహసంతో ఆమె తెలుగు సినిమారంగంలో తొలి స్త్రీ నిర్మాత అయింది. ఆ తరువాత ఆమె 'లంకాదహనం' (1936), 'మోహినీభస్మాసుర' (1937), 'వరవిక్రయం' (1939), 'పాండురంగ విఠల్' (1939), 'వరూధిని' (1946) సినిమాలలో నటించింది. కొన్నాళ్లపాటు దాసరి కోటిరత్నంలా పాడే నటి తెలుగు సినిమారంగలో లేదన్న ఖ్యాతి గడించింది. 1945లో రాజరాజేశ్వరి ఫిలింస్‌వారి 'పాదుకా పట్టాభిషేకము' లో కౌసల్య పాత్ర ధరించడానికి మద్రాసుకు చేరింది. అప్పటి నుంచి మద్రాసులోనే ఉండి 'గొల్లభామ' (1947), 'చంద్రవంక' (1951), 'అగ్నిపరీక్ష' (1951), 'బంగారుభూమి' (1954) వంటి చిత్రాలలో చిన్న, పెద్ద పాత్రలు ధరించింది.

కాని ఆమె స్థూలకాయం సినిమా నటనకు సహకరించకపోవడంతోను, నాటకాల మీద ఆమెకు ఉన్న మక్కువతోను తిరిగి తన నాటక సమాజాన్ని




'సతీ సక్కుబాయి' (1935) లో సక్కుబాయిగా

ప్రారంభించి తుంగల చలపతి, పి. సూరిబాబు, సూరవరపు వెంకటేశ్వర్లు కాంబినేషన్‌లో తాను కృష్ణపాత్రను ధరిస్తూ, తుంగల చలపతి సక్కుబాయిగా, సూరవరపు అత్త పాత్రలోను 'సక్కుబాయి' నాటకాన్ని కొన్ని సంవత్సరాలు ఆంధ్ర దేశమంతటా ప్రదర్శించింది.

1958లో ఆమె ఆరోగ్యం దెబ్బతినడంతో ఆమె నటన నుంచి విరమించుకొని తన స్వగ్రామం నక్కబొక్కలపాడు చేరింది. తనకున్నదంతా అనాథలకు దానధర్మాలు చేసింది. నాటక సమాజాలు నడపడానికి వెచ్చించింది. ఆమెకు జరిగిన చివరి సన్మానం 1960లో తణుకు ఆంధ్ర నాటక కళాపరిషత్తు రజతోత్సవాలలో పరిషత్తు చేసిన ఘన సన్మానం. ఆమె ఆర్థికమైన బాధలను గుర్తించి ఆనాటి సంగీత నాటక అకాడమీ ఆమెకు నెలసరి ఆర్థిక సహాయాన్ని అందచేసింది. చివరి రోజుల్లో ఆర్థికంగాను, అనారోగ్యంతోను బాధపడి ఆమె 1972 డిసెంబర్‌లో తన స్వగ్రామం చిలకలూరిపేటలో కన్ను మూసింది.

తెలుగు రంగస్థల నటీమణులలో దాసరి కోటిరత్నానికి ఉన్న ధైర్యసాహసాలు, తెగువ, పట్టుదల మరొకరికి లేవంటే ఆశ్చర్యం లేదు. దాదాపు 40 సంవత్సరాల పాటు రంగస్థల నాటకాలలో అనేక పాత్రలలో - ముఖ్యంగా పురుష పాత్రలలో - ఆమె రాణించింది. ఎంత చక్కని అభినయమో అంత చక్కని గాత్రం. సినిమాలలో గొప్పగా రాణించలేకపోయినా ఆమె గానానికి చివరివరకూ ప్రేక్షకుల మన్నన ఉండేది. సినిమానటిగా, నిర్మాతగా, రంగస్థలనటిగా, సమాజ నిర్వాహకురాలిగా దాసరి కోటిరత్నం ఒక చరిత్రనే సృష్టించిందంటే అతిశయోక్తికాదు. ❑

# పారుపల్లి సుబ్బారావు



'రాధాకృష్ణ' నాటకంలో రాధగా

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారి "రాధాకృష్ణ" నాటకానికి తెలుగు నాటక చరిత్రలోనే ఒక విశిష్టమైన స్థానం ఉంది. అందులో 'తన్మయ భక్తి"ని నిర్వచించే ప్రయత్నం చేసి కృతకృత్యులైనారు పానుగంటి. అందునా, దృశ్యకావ్యంలో ఆ భక్తి భావాన్ని రక్తి కట్టించడానికి అసాధారణ నటనా వైదుష్యం కావాలి. రాధ పాత్రకు కావలసిన శృంగార భక్తిభావంలోని అన్ని కోణాలను అత్యుత్తమంగా నిర్వచించే నేర్పరితనం చూపిన ఏకైక నటుడు శ్రీ పారుపల్లి సుబ్బారావు. ఆయన ఇతర పాత్రలను ఎన్నో రంగస్థలం మీద ప్రదర్శించి మన్ననలు పొందారు. కాని రాధ పాత్రలో ఆయన అడుగడుగునా చూపిన తన్మయీ భావం ప్రేక్షకులను రసలోకాలలో విహరింపచేసింది.

సుబ్బారావుగారిది కృష్ణాజిల్లా దివిసీమ లోని శ్రీకాకుళం. పండిత వంశంలో జన్మించారు. అన్నగారు ప్రఖ్యాత సంగీత విద్వాంసులు, మహోత్తమ సంగీత గాయకులకే గురువులు, 'గాయక సార్వభౌమ' బిరుదాంకితులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు. సుబ్బారావుగారు అన్నగారి దగ్గరనే శాస్త్రీయ

సంగీతం నేర్చుకున్నారు. బందరులో అటు పాఠశాల విద్య, యిటు సంగీత విద్య నేర్చుకునే తరుణంలోనే సుబ్బారావుగారి లలిత సుందర విగ్రహం, శ్రావ్యమైన కంఠస్వరం నాటక సమాజాధిపతులను ఆకట్టుకున్నాయి. ఆవిధంగా ఆయన బందరులోని బాలభరత సంఘంలో ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారి 'రసపుత్ర విజయం'లో విమల వేషంతో రంగస్థల జీవితానికి నాంది పలికారు. ఆ పాత్ర సర్వజనామోదం పొందడంతో ఆయన బాలభరత సంఘంలో సభ్యుడై వారు ప్రదర్శించిన 'సతీ సావిత్రి' నాటకంలో సావిత్రి, 'ప్రహ్లాద'లో లీలావతి పాత్రలను కూడా విజయవంతంగా ధరించడంతో సుబ్బారావుగారి పేరుప్రతిష్టలు ఇనుమడించాయి.

చక్కని శరీర, శారీర లక్షణాలున్న స్త్రీ వేషధారులు అరుదు కావడంతో సుబ్బారావుగారికి ఆహ్వానాలు ఎక్కువయ్యాయి. కొన్నాళ్లు తెనాలి ఫస్టు కంపెనీ అని పిలవబడే శ్రీకృష్ణ విలాససభలో ఉన్నారు. కొన్నాళ్లు మద్రాసు వెళ్లి సుగుణ విలాస సభవారి నాటకాలలో పాత్రధారణ చేశారు. 1914లో బెజవాడ వచ్చి మైలవరం కంపెనీలో ప్రధాన స్త్రీ పాత్రధారిగా వృత్తి నాటక పద్ధతిలో సరికొత్త జీవితం ప్రారంభించారు.

పారుపల్లివారి అభియన కౌశలాన్ని వ్యక్తీకరించడానికి బాలభారతి నాటక మండలి చక్కని వేదిక అయింది. ఈ సమాజం ప్రదర్శించిన దాదాపు అన్ని నాటకాలలోను సుబ్బారావు ప్రధాన స్త్రీ పాత్రలు ధరించారు. ముఖ్యంగా ఉద్వేగ వైవిధ్యాలున్న పాత్రలలో ఆయన రాణించేవారు. ఉదాహరణకు 'పాదుకా పట్టాభిషేకం'లో కైక పాత్రకు ఆయన చేసినంత న్యాయం ఇతర నటులు చేయలేదన్నది సమకాలిక నాటక సమీక్షకుల నమ్మకం. ఒకవైపు తొలి రంగాల్లో రాముని మీది ప్రేమ, తరువాత తన కొడుకుకు పట్టం కట్టాలన్న పట్టుదల, కోపం, బాధ, అసహనం, స్పర్ధ, కార్పణ్యం – ఇన్నింటి సమాహారమైన కైక పాత్రను సుబ్బారావుగారు సునాయాసంగా ప్రదర్శించి "నిజమే సుమా! ఏ స్త్రీ అయినా ఇటువంటి పరిస్థితుల్లో ఈవిధంగా కాక మరొక విధంగా ఎలా ప్రవర్తిస్తుంది?" అన్నంత సహజంగా ఉండేటట్లు తీర్చిదిద్దారు ఆ పాత్రను. అలాగే 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో ద్రౌపది పాత్రను 'లవకుశ'లో సీత పాత్రను ధరించి ఆయన ప్రతిభను చాటుకున్నారు.

కాని సుబ్బారావుగారి నటనా వైచిత్రి అంతా 'రాధాకృష్ణ' నాటకంలో ఆయన ధరించిన రాధ వేషంలో పరాకాష్టకు చేరింది. రాధ శృంగార కరుణ రసాలు ప్రోది కట్టిన మూర్తి. సుబ్బారావుగారి నేత్రాభినయం, ఆయన మాటల్లో చూపే ఆర్ద్రత, అందమైన వేషం, స్ఫుటమైన వాచికం, అన్నగారి దగ్గర నేర్చుకున్న శాస్త్రీయ సంగీతం భూమికగా పాపట్ల కాంతయ్యగారు నేర్పిన పార్శీమట్ల ఊపు – ఇవన్నీ ఒక ఎత్తయితే, మరొక ఎత్తు సుబ్బారావు, జొన్నవిత్తుల శేషగిరిరావు గార్ల సాహచర్యం. 'రాధాకృష్ణ'లో జొన్నవిత్తుల కృష్ణుడుగా, పారుపల్లి రాధగా నటించేవారు. రంగస్థలంలోను, జీవిత రంగస్థలంలోను జొన్నవిత్తుల పారుపల్లికి పథ నిర్దేశకుడు. జొన్నవిత్తుల శేషగిరిరావు కర్ణాటక, హిందూస్థానీ బాణీలు రెంటిలోను కచేరి చేయగల సామర్థ్యం ఉన్న గాయక నటుడు. ఆయన గాత్రం సమ్మోహనం. రాధాకృష్ణలో వారిద్దరు ప్రేయసీప్రియులుగా ఉదాత్త శృంగార భావాలను ప్రేక్షకామోదంగా వ్యక్తీకరించడం 20వ శతాబ్దం తొలి రోజులలో తెలుగు నాటకరంగంలో జరిగిన ఓ పెద్ద ప్రదర్శనా విప్లవం. దానికి సుబ్బారావుగారి రాధ పాత్రచిత్రణ చాలావరకు కారణం. అర్ధ నిమీలిత నేత్రాలతో గగనతలం వైపుకు "కృష్ణా" అని ఆమె ఆక్రందిస్తే కృష్ణుడు వస్తున్నాడని ప్రేక్షకులు కూడా ఆతృతగా అటువైపు ఆశగా చూసేవారు. ఆయన రాక పులకించిన రాధ పులకాంకితాలు చెప్పేవి.

ఈ పాత్ర చిత్రణకు చాలావరకు సహాయం చేసిన వారు ఆ నాటకాన్ని తీర్చిదిద్దిన మల్లాది అచ్యుతరామశాస్త్రిగారు, సంగీత దర్శకులు పాపట్ల కాంతయ్యగారు, రమణీయమైన వేషభూషాలంకారాలను సమకూర్చిన మైలవరం కంపెనీ ఆహార్య నిష్ణాతులు.

ఆనాటి సంప్రదాయం రంగస్థల నటులు సినిమాలలో కూడా నటించడం. పారుపల్లి కూడా మొదటి 'లవకుశ' (1934) సినిమాలో శ్రీరాముని పాత్రను ముగ్ధమనోహరంగా నటించి తొలితరం సినిమా ప్రేక్షకులను కూడా ఆనందపరిచారు.

పానుగంటి నాటకాలలోనే విశిష్టమైన నాటకం 'రాధాకృష్ణ'. అందులో రాధ పాత్ర అభినయానికి నిర్వచనం. పానుగంటి ప్రతి పదమూ రసభూయిష్టంగా రాయడం, ప్రతి కదలిక, చూపు, మాట, పాట రసభూయిష్టంగా పారుపల్లి నటించడం పద్యనాటక యుగానికే ఒక వెన్నెలబాట. ❑

# ఆర్. (రేకందార్) సుభద్రమ్మ



రేకందార్ సుభద్రమ్మ సురభి నాటక సమాజానికి చెందిన ప్రఖ్యాత నటి, దర్శకురాలు, సమాజ నిర్వాహకురాలు. "ఆంధ్ర నాటక కళోద్ధారక" బిరుదాంకితులైన వనారస గోవిందరావు, సుబ్బమ్మగార్ల అయిదవ కుమార్తె. బెజవాడ పట్టణంలో ఆగస్టు 27, 1911 నాడు జన్మించిన సుభద్రమ్మ అందరు సురభి నటీనటులకు మాదిరిగానే చిరుతప్రాయంలోనే నాటక రంగం ప్రవేశించింది. బుడిబుడి నడకలతో చిన్నారి పాత్రలను నటిస్తూ ఉండగానే గోవిందరావుగారు ఈమెకు అక్షరాభ్యాసం చేసి భీమవరంలో రాయప్రోలు సోమనాథశాస్త్రి గారి దగ్గర రెండు సంవత్సరాలు విద్య నేర్పించారు. అమరము, ఆంధ్రనామ సంగ్రహం, పెద్దబాలశిక్ష ఆమూలాగ్రంగా నేర్వడమేకాక ఆమె మంచి అర్థజ్ఞానం సంపాదించింది. ఆ చుట్టు పక్కల గ్రామాల నుంచి కంపెనీ మరొకచోట వేయవలసి రావడంతో ఆమె మరో రెండు సంవత్సరాలు శ్రీమాన్ కొమాండూరి వీరరాఘవాచార్యులవారి వద్ద సంగీతం అభ్యసించింది. ఏడేళ్ల ప్రాయంలో 1918లో తమ తండ్రిగారి గోవిందరాయ సురభి నాట్యమండలిలో ప్రధాన బాలపాత్రలను వేయడం ప్రారంభించింది. ప్రహ్లాదుడు, కృష్ణుడు, కుశుడు, లవుడు మొదలైన వేషాలలో ఆమె రాణించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నది. 1926లో రేకందార్ వెంకట్రావు (చిన వెంకటరావు) గారికిచ్చి వివాహం జరిపించారు తండ్రిగారు.

వివాహానంతరం సుభద్రమ్మగారి నటనా వ్యాసంగం ఇంకా విస్తరించింది. అప్పటినుంచి సమాజం ప్రదర్శించే అన్ని నాటకాలలోను నాయికా నాయక పాత్రలను రెండింటినీ సమర్థవంతంగా వేయడంలో సిద్ధహస్తురాలననిపించు కున్నది. 'సతీసావిత్రి'లో సత్యవంతుడు, 'దశావతారాలు'లో విష్ణువు, నారాయణుడు, 'కృష్ణలీలలు'లో కృష్ణుడు, మన్మథుడు, 'సంపూర్ణ రామాయణం'లో రాముడు వంటి పురుష పాత్రలలో ఎంతో ఠీవిగా పాత్రోచితంగా నటించి పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. అలాగే ప్రధాన స్త్రీ పాత్రలైన దమయంతి, లీలావతి, సుభద్ర మొదలైన పాత్రలలో కూడా నటించి మెప్పు పొందింది. ఉదాత్త పురుష పాత్రలకుండవలసిన రాజసం, ఠీవి ఆమెలో ప్రస్ఫుటంగా రాణించడం వల్ల తండ్రిగారు ఆమె చేత ఎక్కువగా పురుష పాత్రలనే ధరింపచేసేవారు.

1937లో సుభద్రమ్మగారు, ఆమె భర్త రేకందార్ చినవెంకటరావుగారితో కలిసి తమ స్వంత కంపెనీ – శ్రీ వెంకటేశ్వర నాట్యమండలిని – స్థాపించారు. కంపెనీ నిర్వాహకురాలుగా ఆమె అత్యున్నతమైన గౌరవాదరాలను పొందారు. తన సమాజ సభ్యుల బాగోగులను చూసుకునే తల్లిగా, నాటకాలను క్రమశిక్షణతో నేర్పి, ప్రదర్శించే దర్శకురాలిగా, కంపెనీని లాభాలబాటలో పయనింపచేసిన నిర్వాహకురాలిగా అన్నిటికన్నా ముఖ్యంగా ప్రధానమైన పురుషపాత్రలు ధరించడంలో అందెవేసిన చేయిగా పేరెన్నికగన్నారు.

సుభద్రమ్మగారి కంఠం ఎంతో శ్రావ్యమైనది. ఏ భావాన్నయినా అలవోకగా ప్రదర్శించగల అభినయం ఆమె సొత్తు. సత్యవంతుడి వంటి మార్దవమైన పాత్రలోను, యముని వంటి ఉద్ధతపాత్రలోను, సావిత్రి వంటి కరుణరస ప్రధానమైన పాత్రలోను ఒకేరకమైన నాట్యకౌశలాన్ని చూపిన నటీమణి ఆమె.

సురభి నాటకాలలో మొదటి తరానికి చెందిన సురభి రామాబాయి తరువాత సురభి సంస్థలలో కాని, బయటి నాటక సమాజాలలో కాని సుభద్రమ్మగారికి దీటుగా మగవేషధారణ చేసిన స్త్రీలు లేరంటే అతిశయోక్తి కాదు. విభిన్నమైన మనస్తత్వాలు కల పాత్రల్ని ఆమె సమానమైన శక్తియుక్తులతో పోషించింది. 'సంపూర్ణ రామాయణం'లో శ్రీరాముని పాత్రకు, 'కురుక్షేత్రం'లో బలరామ, దుర్యోధన పాత్రలకు, 'లంకాదహనం'లో (తండ్రిగారి వలె) ఆంజనేయ పాత్రకు ఆమెకు పెట్టినది పేరు. అలాగే యముడు, హిరణ్యకశిపుడు వంటి



'సతీసావిత్రి' నాటకంలో యముడుగా ఆర్. సుభద్రమ్మ

ఉద్ధత పాత్రలలో కూడా ఆమె ప్రఖ్యాతి పొందారు. కొన్ని దశాబ్దాలు ఆమె 'సతీ అనసూయ'లో అనసూయగాను, 'కృష్ణలీలలు'లో యశోదగాను తన ప్రతిభాపాటవాలు కనబరిచారు. ఈ అన్ని పాత్రల నిర్వహణలోను ఏ పాత్రకు అనువైన ఆంగిక, వాచిక, సాత్త్వికాభినయాలను సమయోచిత రీతిలో వాడడం ఆమె ప్రత్యేకత.

సుభద్రమ్మగారు తన సమాజంలోని చిన్నపిల్లలకు, తరువాతి తరాల నటీనటులకు క్రమశిక్షణతో శిక్షణను యివ్వడంలో కూడా సురభి కంపెనీ స్త్రీలలో ముందంజ వేశారు. 75 సంవత్సరాలు నిర్విఘ్నంగా– ఈనాటికి కూడా– శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి విజయయాత్ర చేస్తున్నదంటే దానికి కారణం సుభద్రమ్మగారు చూపిన ఆర్థిక, విద్యావిషయిక, నాటకసంబంధమైన మార్గదర్శకత్వమేననడంలో అతిశయోక్తి లేదు.

స్త్రీపురుష పాత్రలను, సాత్త్విక ఉద్ధత పాత్రలను నటించడంలో ఖ్యాతిని గడించి, తండ్రిగారి నాటక సమాజంలో ప్రధానపాత్రలకు పేరొంది, స్వంత నాటక సమాజాన్ని ధీరతతో కొనసాగించి నిర్వాహకురాలిగా, మనసున్న యజమానురాలిగా పేరుపొందిన శ్రీమతి సుభద్రమ్మగారు 1982వ సంవత్సరం మే 28న పరమపదించారు. ❑

# కళావర్ రింగ్

## (శ్రీమతి సరిదె లక్ష్మీనర్సయ్యమ్మ)



తొలి తెలుగు నాట్య కళాకారిణులలో నృత్యగానాలకు అభినయ విన్యాసానికి తనకంటూ ఒక సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి 'కళావర్ రింగ్'గా దక్షిణ దేశమంతటా ప్రసిద్ధికెక్కిన నర్తకి, నటీమణి శ్రీమతి సరిదె లక్ష్మీనర్సయ్యమ్మ. విజయ నగరానికి దగ్గరలో ఉన్న కోరుకొండ ఆమె స్వగ్రామం. సూరెడ్డి సన్యాసి, అప్పయ్యమ్మలు తల్లితండ్రులు. లక్ష్మీ నర్సయ్యమ్మను విజయనగరం ఆస్థాన నర్తకి సరిదె అన్నపూర్ణమ్మకు ఆమె రెండవ ఏటనే పెంపుడు యివ్వడం వల్ల. అప్పటినుంచి ఆమె 'సరిదె' లక్ష్మీనర్సయ్యమ్మ అయింది.

ఆమె చిన్నతనం నుంచే ఆటపాటలలో మేటిగా ఉండి ఎంతటి క్లిష్టమైన పదవిన్యాసమైనా చేయగల బాలమేధావిగా గుర్తింపబడ్డది. తల్లి దగ్గరే భరతవిద్య, కర్ణాటకం నేర్చుకొని 12వ ఏటనే మేళ నాయకురాలుగా విజయనగర పండితుల చేత సత్కరించబడ్డదంటే ఆమె ప్రావీణ్యం గ్రహించవచ్చు. ఇంటి ఆనవాయితీ ప్రకారం తల్లిగారి భరతవిద్యా ప్రదర్శనలో గాత్ర సహకారం అందించే మద్దెల

లచ్చన్నగారి దగ్గర సంగీతాభ్యాసం ప్రారంభించి ఆనాడు విజయనగరంలో కర్నాటకం నేర్పుతూ, సూత్రధారిత్వం నెరిపే కోటిపల్లి గున్నయ్యగారి దగ్గర ఆటకు కావలసిన సంగీతాన్ని నేర్చుకున్నది. తల్లితోపాటు మద్దెల హైమవతి, మద్దెల రాముడు (తన పినతల్లులు) అనే ప్రఖ్యాత నృత్యాంగనల వద్ద భరతవిద్యను క్షుణ్ణంగా నేర్చుకున్నది. ముఖ్యంగా క్షేత్రయ్య పదాభినయంలో దిట్ట అనిపించుకున్నది. 12వ ఏటనే మేళానికి నాయకురాలై తన అభినయకౌశలాన్ని నిరూపించుకొన్నది. నేర్చుకున్న విద్యను పలుచోట్ల ప్రదర్శిస్తూ, రాజాస్థానాలలో జమీందారుల కచేరీలలో నాట్య అభినయ ప్రదర్శనలిచ్చి సువర్ణ హస్త కంకణాలను సన్మానాలను బిరుదులను అందుకున్నది.

1934లోనే ఆమె దాదాపు ముప్పయ్ గ్రామఫోను రికార్డులిచ్చి 'గానకళా కోవిద' బిరుదుతో సత్కరించబడ్డది. ఆమె యిచ్చిన రికార్డులలో హాస్యగీతాలు, శృంగార గీతాలు, పదాలు అధికం. ప్రఖ్యాత జానపదగేయం "చిటపట చినుకులు" ఆమె పాడినదే! అలాగే 'చింతామణి' గ్రామఫోను రికార్డు సెట్టులో ఆమె చింతామణిగా నటించింది. అలాగే 1947లో మద్రాసులోని ఆల్ ఇండియా రేడియో కేంద్రం ప్రసారం చేసిన 'సీతారామ కల్యాణం', 'సక్కుబాయి', 'భక్త రామదాసు' నాటకాలలో ప్రధాన భూమికలను ధరించింది.

1935లో చలనచిత్రరంగం ప్రవేశించి 'రాణీ ప్రమీల' సినిమాలో ప్రమీల వేషం వేసి శహబాస్ అనిపించుకున్నది. అసంఖ్యాక నృత్య ప్రదర్శనలలో పాల్గొని కావలసినంత ధనం సంపాదించింది. కాని పేద విద్యార్థులను, మహిళలను ఆదుకొని అనాథలకు ఆశ్రయం యిచ్చి తన ధనాన్నంతా యితరుల సేవ కోసం వినియోగించింది.

ఆమెకు ఆంధ్రదేశమంతటా అనేక సన్మానాలు జరిగాయి. అఖిల భారత నృత్యోత్సవాల సందర్భంగా 1964లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ భారతీయ నృత్యోత్సవాలలో ఆమెను ఘనంగా సత్కరించింది. చివరి రోజులలో ఆర్థికంగా చితికిపోయి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ యిచ్చే వృద్ధాప్య పింఛనుతో కాలం గడిపి 1964లో పరమపదించింది. ❑

# ఋష్యేంద్రమణి



మంచి ఒడ్డూ పొడుగు, నిండైన విగ్రహం, కొనదేరిన విశాలమైన కళ్లు, పొడుగాటి ఒత్తయిన జుట్టు – ఏ నటికైనా చూడగానే ఆకర్షణీయంగా ఉండే సొగసులు. ఆమె సంగీత నృత్యాలలో కూడా ఇక ఆరితేరినదయితే ఆమెకు సాటి యెవరు? ఆంధ్రదేశంలో 20వ శతాబ్దం రెండో దశకంలో అటువంటి లక్షణాలన్నీ పుణికి పుచ్చుకుని ఋష్యేంద్రమణి రంగస్థలం మీద అడుగుపెట్టింది. తల్లి మొగల్రాజు వెంకటరత్నమ్మ. సంగీత నాట్యాలు వంశపారంపర్యంగా అభ్యసించిన విదుషి. ఆమె నేతృత్వంలో ఏడవ ఏటనే సంగీతనృత్యాలలో పేరు గాంచి 'గజ్జె' కట్టింది ఋష్యేంద్రమణి.

1918లో (జనవరి 1వ తేది?) జన్మించిన ఋష్యేంద్రమణి చిన్నతనంలోనే కొమ్మూరి పట్టాభిరామయ్యగారు స్థాపించిన లక్ష్మీవిలాస నాటకసభలో చేరి 'సావిత్రి' నాటకంలో వాసంతిక వేషం కొన్ని వందలసార్లు ప్రదర్శించింది. ఇందులో సావిత్రిగా ప్రఖ్యాత నటి పి.రామతిలకం, సత్యవంతుడుగా ప్రముఖ గాయక నటుడు కపిలవాయి రామనాథశాస్త్రి నటించారు. అలాగే మరో సమాజంలో 'ప్రహ్లాద'లో ప్రహ్లాదుడి వేషం వేసింది. పద్యాలు, పాటలు గొప్పగా పాడింది. ఆమె పేరు సినిమాలోకం దాకా పాకింది. నాటకాలవాళ్ళందరూ సినిమా ఛాన్సుల కోసం ఎగబడుతున్న రోజుల్లో



'మల్లీశ్వరి' చిత్రంలో

ఋష్యేంద్రమణి ఉత్సాహం కూడా అటువైపే మొగ్గింది.

ఋష్యేంద్రమణి తొలి సినిమా 'శ్రీకృష్ణతులాభారం' (1935). జయసింగ్ శ్రీకృష్ణుడుగా, సభారంజని రుక్మిణిగా, కపిలవాయి నారదుడుగా నటించిన ఈ చిత్రంలో ఋష్యేంద్రమణి సత్యభామ వేషం వేసింది. ఈ చిత్రం ఆర్థికంగా దెబ్బతినడం చేత ఋష్యేంద్రమణి సినిమారంగం వదలి తిరిగి నాటకరంగాన్ని ఆశ్రయించింది. మూడు సంవత్సరాలపాటు కన్నాంబ, కడారు నాగభూషణంల ఆధ్వర్యంలో నడిచిన రాజరాజేశ్వరి నాట్యమండలిలో అనేక పాత్రలు ధరించింది. ముఖ్యంగా 'సావిత్రి'లో నారదుడు, 'రంగూన్‌రౌడీ'లో ప్రభావతి పాత్రలు ఆమెకు మంచిపేరు తెచ్చిపెట్టాయి. ఇంకా 'రాధాకృష్ణ', 'చింతామణి', 'తులాభారం' నాటకాలలో మంచి గుర్తింపు వచ్చింది. దానితో తిరిగి సినిమా ఛాన్సులు వెంటాడసాగాయి ఆమెను. ఈ సమయంలోనే తమ నాట్యమండలిలో హార్మోనిస్టుగా వున్న జవ్వాది రామకృష్ణరావును వివాహం చేసుకుంది.

భర్త 'మాతృభూమి' అనే తమిళ చిత్రానికి సంగీత దర్శకత్వం వహించడానికి మద్రాసు వెళ్లినప్పుడు ఆయనతోపాటు ఋష్యేంద్రమణి కూడా మద్రాసు చేరి సినిమాలలో చిన్న పెద్ద పాత్రలను ధరించడం మొదలుపెట్టింది. ఆమె జీవితంలో అత్యంత ప్రధానమైన ఘట్టం 1942లో జరిగింది. గూడవల్లి రామబ్రహ్మం గారు ప్రఖ్యాత తమిళ కావ్యం 'శిలప్పాదికారం' ఆధారంగా 'పత్ని'




**'పత్ని' పత్రికా ప్రకటన**

అనే సినిమా ప్రారంభిస్తూ అందులో నాయిక కణ్ణగి పాత్రకు ఋష్యేంద్రమణిని ఎంపిక చేశారు. ఈ పాత్రకు కావలసిన నృత్య, సంగీత, సాత్త్వికాభినయాలలో ఋష్యేంద్రమణి ఆరితేరిన నటి కావడంతో ఆ సినిమా విజయవంతం అయింది. ఆమె తారాపథాన్ని అందుకున్నది.

జీవితం చివరివరకు కూడా ఋష్యేంద్రమణి సినిమాల్లో ముఖ్యమైన పాత్రలను ధరిస్తూనే వుంది. 'చెంచులక్ష్మి' (1943)లో ఆదిలక్ష్మిగా, 'సీతారామజననం' (1944) లో కౌసల్యగా, 'సేతుబంధన్' (1946) లో ఇంద్రాణిగా, 'భక్త శ్రీయాళ' (1948), 'ధర్మాంగద' (1949) లో ముఖ్య





'భక్త శ్రీయాళ' పత్రికా ప్రకటన

---

భూమికలను ధరించి వైవిధ్యభరితమైన పాత్రలు పోషించడంలో సిద్ధహస్తురాల ననిపించుకుంది. వీర, కరుణ, శాంత రసాలను పోషించడంలో ఆరితేరిన ఋష్యేంద్రమణికి జీవితాంతం మంచిపాత్రలే లభించాయి. 'మల్లీశ్వరి' (1951) లో మల్లీశ్వరి తల్లి పాత్రను ఎంత సహజంగా పోషించిందో 'విప్రనారాయణ'లో వేశ్యమాత వేషాన్ని అంతే సహజంగా పోషించి మెప్పించింది. 'మాయాబజార్' (1957), 'జగదేకవీరునికథ' (1961), 'అగ్గిరాముడు' (1954), 'కృష్ణసత్య', 'పాండురంగ మహాత్మ్యం' (1957) వంటి జానపద పౌరాణిక చిత్రాల్లోనేకాక 'మిస్సమ్మ' (1959), 'గుండమ్మకథ' (1962), 'మట్టిలో మాణిక్యం' (1971) వంటి సాంఘిక చిత్రాలలో కూడా తల్లిపాత్రలను పోషించి తన ప్రతిభను రుజువు చేసుకున్నది. ఋష్యేంద్రమణి దాదాపు 70 సంవత్సరాలు నటనలోనే జీవితం గడిపి, 2002 ఆగష్టు 17వ తేదీన మరణించింది. ఏరకమైన పాత్రనైనా సునాయాసంగా పోషించి మెప్పించడంలో ఆమెకు ఆమే సాటి అనిపించుకున్న సహజనటి ఋష్యేంద్రమణి. ❑

# తుంగల చలపతిరావు



ఒకే ఒక్క నాటకంతో రెండు దశాబ్దాలపాటు ఆంధ్ర నాటకరంగాన్ని ఏలిన నటుడు ఒకే ఒక్కడు. ఆ నటుడు తుంగల చలపతి. ఆ నాటకం 'సతీ సక్కుబాయి'. ఆ నాటక రచయిత మల్లాది అచ్యుతరామశాస్త్రి. ఆ నాటకాన్ని చేపట్టి నటులను సమకూర్చుకొని, నాటకంలో పాటలు రాసి, అందులో తానొక ప్రధానమైన భూమికను ధరించి, ఆ నాటకానికి దర్శకత్వం వహించినవాడు దైతా గోపాలం. తెలుగు నాటకరంగం మీద 'పాండవోద్యోగవిజయాలు', 'హరిశ్చంద్ర' నాటకాల తరువాత యింత జనామోదం పొందిన నాటకం ఆనాడు లేదంటే దాని రచన, ప్రదర్శనల ఔన్నత్యాన్ని కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. చిన్న పల్లెటూళ్ల నుంచి మద్రాసు, హైదరాబాదు, బెంగుళూరు, మైసూరు, రంగూన్ వంటి నగరాల వరకు ఆ నాటకానికి అందులోని నటులకు నీరాజనాలు పలకనివారు లేరు.

మైలవరం కంపెనీని 1926వ సంవత్సరానికల్లా ఆపివేసే పరిస్థితులు వచ్చాయి. అందులో చివరిరోజుల్లో చేరిన దైతా గోపాలం గారికి మైలవరం కంపెనీ ఆస్థాన రచయిత, దర్శకుడు మల్లాది అచ్యుతరామశాస్త్రిగారు తాను మైలవరం వారి కోసం రాసిన 'సతీ సక్కుబాయి' నాటకాన్ని గోపాలంగారికి యిచ్చి ఆడుకోమన్నారు. కంపెనీలో నటులంతా చెల్లాచెదురైపోయారు. యడవల్లి, ఉప్పులూరి సంజీవరావు గార్లు దుర్గా అమెచ్యూర్ పేరుతో తాము మైలవరం కంపెనీలో ఆడిన 'సావిత్రి', 'శకుంతల' వంటి నాటకాలను తీసుకొని దేశం



**'సతీ సక్కుబాయి' (1935) లో నారదుడుగా**

సి.యస్.ఆర్.ఆంజనేయులుగారు రామదాసు వేషం వేస్తే అందులో బళ్లారి రాఘవ ఛాయలు కనిపిస్తున్నాయన్నారు. అలాగే హరిశ్చంద్ర, చంద్రమతి, సావిత్రి వంటి పాత్రలకు కూడా నటమూలాలు కనిపిస్తాయి. కాని సక్కుబాయికి మూలం తుంగల చలపతే! దానిని భక్తి పరిపూర్ణ దృశ్య కావ్యంగా మలిచినవాడు చలపతే!

చలపతిరావుగారి వాచికం, గానవైఖరి మొదలైన నట సామగ్రి స్థానం వారి లక్షణాలను పుణికిపుచ్చుకున్నా, ఆయన అభినయసర్వస్వమూ స్వీయప్రతిభకు నిదర్శనమే; అడుగడుగునా ప్రేక్షకులను రంజింపచేసినదే! చలపతిరావుగారి అభినయం సాత్త్విక ప్రధానం. ఆయన భావోద్వేగంలో మనం కొట్టుకొనిపోము. కాని క్రమక్రమంగా మనల్ని ఆకట్టుకొని, తన భక్తి రసోన్మత్తతలో మనల్ని కూడా ముంచివేయగలిగినంత ప్రతిభాశాలి. ఆయన మృదువైన గాత్రం ఎన్ని వంపులైనా తిరగ గలిగి, పిల్లనగ్రోవిలో ఉండే అవ్యక్త మధురమైన ధ్వని తరంగాలలాగా మనల్ని ఆకట్టుకుంటుంది. స్వరకల్పనలుకాని, స్వతంత్రమైన పోకడలుగాని కనిపించవు. కాని చెప్పినట్లల్లా వినే గాత్రం, ఎంతటి సంగతినైనా సుకుమారంగా

పలికించగలిగిన గాత్రం కావడం వల్ల ఆసాంతమూ మనసుకు హాయినీ, కించిత్ భావోద్వేగాన్ని కలిగిస్తుంది. వచనాన్ని కూడా సుస్పష్టంగా భావబంధురంగా చెప్పగలిగిన ప్రతిభ ఆయనది.

'సక్కుబాయి' నాటకంతో దేశం నలుమూలలా తిరుగుతూనే 1933లో చలపతిరావుగారు చాలా గ్రామఫోను రికార్డులు కూడా ఇచ్చారు. ముఖ్యంగా 'సక్కుబాయి'లోని పాటలు, పద్యాలు; కొన్ని 'రాధాకృష్ణ' నాటకంలో పాటలను కూడా రికార్డులుగా యిచ్చారు. ఈ పాటల మట్లు అన్నీ హిందూస్థానీ ఫక్కిలో – ఆనాటి సంప్రదాయాన్ని అనుసరించి – రాయబడ్డవి. అయితే మట్లు అవే అయినా, ఏవో పాటలకు అనుకరణాలన్నట్లు తోచక సహజంగానే, సన్నివేశ స్ఫురణకు దోహదకారిగానే వుంటాయి. చలపతిరావుగారి రంగస్థల నటనలో ఉన్నట్లుగానే ఈ రికార్డులలోని పాటలు కూడా నాటకాలలో స్త్రీ పాత్రలు పాడినవి! అయితే స్త్రీ పాత్రల మాటలను, పాటలను పలకడంలో చాలమంది పురుష నటులు స్త్రీల కంఠస్వరాన్ని అనుకరించే ప్రయత్నం చేయడంవల్ల కొంత కృతకంగా కనిపిస్తుంది. ఏ ఉప్పులూరి సంజీవరావుగారి వంటివారికో తప్ప మిగిలినవారికి స్త్రీ సహజమైన గాత్రం అబ్బడం దుర్లభం. అందువల్ల చలపతిరావు గారు తమ సహజమైన కంఠస్వరంతోనే ఈ పాటలు, పద్యాలు పాడడం, లాలిత్యం, కోమలత్వం వాటిలో అడుగడుగునా కనిపించడం చూస్తే ఆయన రంగస్థల నటవైభవాన్ని ఈ రికార్డులలో కూడా చూపారని చెప్పవచ్చు.


'సతీ సక్కుబాయి' (1935) లో నారదుడుగా చేసిన నటనకు మెచ్చి, 1938లో సి. పుల్లయ్యగారు 'మోహినీభస్మాసుర' సినిమా తీస్తూ చలపతి గారిని నారద పాత్రకు ఎన్నుకొన్నారు. కాని సినిమా మీద ఎక్కువ దృష్టి పెట్టక ఆ సినిమా తీస్తూ వుండగా కూడా సక్కుబాయి నాటకాన్ని మరి కొందరు నటులతో – ముఖ్యంగా దాసరి కోటిరత్నం, ఆ తరువాత ఏ.వి.సుబ్బారావు, రేలంగి, శివరావు గార్లతో ప్రదర్శిస్తూనే వున్నాడు ఆయన.

చలపతిరావుగారు 35 సంవత్సరాలు నిండకముందే 1942 మార్చి 29వ తేదీన గుంటూరుజిల్లా మంగళగిరిలో సక్కుబాయి పాత్రలో నటిస్తూ, ఆ భక్తి తన్మయత్వంలో పాండురంగనిలో కలిసిపోయారు. తెలుగు నాటకరంగం మీద ఒక మధురమైన గళం మూగవోయింది. ❑

# మాస్టర్ కళ్యాణి



ఆంధ్రదేశం నలుమూలా తన గాన మాధుర్యంతో వేలాది ప్రేక్షకులను అలరించిన గాయక నటుడు మాస్టర్ కళ్యాణి. పల్లెటూళ్ల పందిరి నాటకాల నుంచి నగరాల్లోని ఖరీదైన నాటకశాలల వరకు ఆయన వేషం వెయ్యని రంగస్థలం లేదు. వన్స్‌మోర్‌లు కొట్టించుకోని ప్రేక్షక సమూహాలు లేవు. శ్రీకృష్ణుడంటే మాస్టర్ కళ్యాణి; నారదుడంటే మాస్టర్ కళ్యాణి. అలా తెలుగునాట ప్రసిద్ధమైన కాంట్రాక్టు నాటక యుగంలో ఎదురులేని నటుడుగా ఎదిగాడు మాస్టర్ కళ్యాణి. బ్రతికిన 62 సంవత్సరాలలో నలభై అయిదు సంవత్సరాలు నాటకాలు వేస్తూనే వున్నా ఆయన అసలు పేరు తెలియదు – మాస్టర్ కళ్యాణి అని తప్ప. ఏ ఊరో తెలియదు; నాటకం ఎక్కడ వుంటే అక్కడ ఉండేవాడు కనుక. తిన్నచోట తినక, ఉన్నచోట ఉండక జీవితమంతా తిరుగుతూ, భుక్తి కోసం నాటకాలాడుతూ జీవితాన్ని గడపడం వల్ల చివరిరోజుల్లో ఏమీలేని బికారిగా వారి పంచన వీరి పంచన బ్రతికి చివరకు అతి దైన్యమైన పరిస్థితులలో మరణించవలసి వచ్చింది. కాంట్రాక్టు నాటకాల యుగంలో స్థిరమైన ఉద్యోగం లేక దేశాటనం చేస్తూ వుండే ఆ మంచినటుడి జీవితం పలువురికి పాఠాలు నేర్పింది.



'సీతా కల్యాణం' (1934) లో మాస్టర్ కళ్యాణి, బెజవాడ రాజరత్నం

మాస్టర్ కళ్యాణి అసలు పేరు నముడూరు వెంకట్రావు. పుట్టింది 1914లో. ఊరు అమలాపురం. తల్లితండ్రులు పేరయ్య, సుబ్బమ్మగార్లు. వారు అంత ఉన్నవారు కాకపోవడంతో పాడడంలో ప్రవేశం ఉండి, గొంతులో భావాలు, రాగాలు యిమిడిపోయే గాత్ర సౌలభ్యం ఉండడంతో 12వ ఏటనే ప్రఖ్యాత హార్మోనియం వాద్యగాడు, పద్య నాటక దర్శకుడు అయిన కురుమద్దాలి రామచంద్రరావుగారు ప్రారంభించిన శ్రీకృష్ణ హాపీ క్లబ్‌లో చేరి 'రామదాసు' నాటకంలో రఘురాముడి పాత్రను అద్భుతంగా నిర్వహించాడు. రామచంద్ర రావుగారి సాయంతో హైస్కూలులో క్లాసులు అయిపోగానే వారి యింటికి వెళ్లి ప్రఖ్యాత హిందుస్థానీ గాయకులైన అబ్దుల్ కరీంఖాన్, బాలగంధర్వ, ఓంకార్‌నాథ్ టాగోర్ వంటి వారి పాటల రికార్డులు విని వారినే అనుకరించి పాడేవాడు. అతి చిన్నతనంలోనే పెద్ద నటులతో పోటీపడి వారిని తోసిరాజనగలిగిన గాన సామర్థ్యం సంపాదించాడు.

మాస్టర్ కళ్యాణి 20వ ఏట 'కృష్ణలీలలు'లో కృష్ణుడుగా కాకినాడలోని వై.యం.హెచ్.సి.లో ప్రదర్శనలిస్తుండగా ఆ పురజనులు తిరిగి తిరిగి ఆయన కృష్ణ వేషాన్ని కోరి వేయించుకొని అయిదవరోజు ఏనుగు నెక్కించి సన్మానం చేసి ఆయనకు అతి యిష్టమైన రాగం కళ్యాణి కనుక, దానిని పాడడంలో సిద్ధహస్తుడు కనుక ఆయనను 'మాస్టర్ కళ్యాణి' బిరుదుతో సత్కరించారు. ఆనాటి నుంచి ఆ

పేరుతోనే ఆంధ్రదేశం అంతటా ప్రసిద్ధుడై, ప్రఖ్యాతనటులైన సి.యస్.ఆర్., బందా, కపిలవాయి రామనాథశాస్త్రి, రెండుచింతల సత్యనారాయణ, వేమూరి గగ్గయ్య గార్ల వంటి ఉద్దండుల సరసన వారితో సరిసమానంగా వేషాలు వేసి తన పాటతో ప్రేక్షకులను సమ్మోహితులను చేశాడు.

'శ్రీకృష్ణ తులాభారం'లో కళ్యాణి కృష్ణుడుగాను, కపిలవాయి నారదుడుగాను కొన్ని వేల ప్రదర్శనలిచ్చారు. రామదాసులో బందా తానీషాగా, కళ్యాణి కబీరుగా ప్రసిద్ధికెక్కారు. రామనాథశాస్త్రి కృష్ణుడుగా, స్థానం సత్యభామగా, కళ్యాణి నారదుడుగా ప్రఖ్యాతమైన 'కాంబినేషన్' గా గణుతికెక్కింది 'శ్రీకృష్ణతులాభారం' నాటకం. ఇంతమంది పెద్దల సహనటుడుగా రాణించడవల్ల కళ్యాణి లేని కాంట్రాక్టు నాటకం ఉండేది కాదు.

కాంట్రాక్టు నాటకాలు ఉచ్ఛస్థితిలో ఉండగా తెలుగులో టాకీలు ప్రారంభ మయ్యాయి. రంగస్థల నటులు వారు నాటకాలలో వేస్తున్న ప్రఖ్యాత వేషాలను సినిమాలలో కూడా నటించారు. మాస్టర్ కళ్యాణి కూడా 1934లో వేల్ పిక్చర్స్ వారి 'సీతాకల్యాణము'లో రాముని పాత్రకు ఎన్నుకోబడ్డాడు. 1937లో వచ్చిన 'రుక్మిణీకల్యాణము'లో కళ్యాణి నారదుడుగా కొన్ని అద్భుతమైన పాటలు పాడాడు.

పాత నాటక నటుల కాలం పోయి సరికొత్త సినిమా నటులు రావడం ప్రారంభం కావడంతో మాస్టర్ కళ్యాణి తిరిగి నాటకరంగానికి వచ్చి శ్రీకృష్ణ, నారద పాత్రలలో తనదైన గానశైలితో ఆంధ్రదేశం నలుమూలలా పర్యటించాడు. ఎక్కడకు పోయినా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. కాని ఒక పాత్రకు ముగ్గురు నలుగురు ఎంపిక కావడంతో కాంట్రాక్టరు యిచ్చే పారితోషికం తగ్గిపోయింది. ఒకరిద్దరు ప్రఖ్యాతుల్ని తీసుకొని మిగిలినవారిని స్థానికంగా తీసుకోవడం వలన క్రమంగా నాటకాలలో అవకాశాలు తగ్గసాగాయి. ఇన్ని దశాబ్దాలు తిరుగుడు జీవితం గడపడం వల్ల ఆరోగ్యం చెడింది. చివరిరోజుల్లో కాట్రావులపల్లి వాస్తవ్యులు వత్సవాయి వంశస్థులు ఆదరణ చూపినా వారి మరణంతో తిరిగి ధర్మసత్రాలలో జీవితం గడపవలసిన దుస్థితి ఎదురైంది.

చివరిరోజులలో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ యిచ్చే నలభై రూపాయల నెలసరి భృత్యంతో జీవితం గడుపుతూ తన 60వ ఏట 1974లో ఆయన మరణించారు. ❑

# ఘంటసాల రాధాకృష్ణయ్య
# ఘంటసాల బలరామయ్య



ఘంటసాల రాధాకృష్ణయ్య

ఘంటసాల సోదరులు నెల్లూరుకు దగ్గరగా ఉన్న పొట్టెపాళెంలోని వెంకటలక్ష్మి, దక్షిణామూర్తుల పుత్రులు. వీరితోపాటు వీరి తమ్ముడు శేషాచలం కూడా నాటకాలలో పాల్గొన్న వ్యక్తే. తొలుత రంగస్థలనటులుగా జీవితాన్ని ప్రారంభించిన ఘంటసాల సోదరులు తరువాత తరువాత రెండు విభిన్నమైన మార్గాలలో స్థిరపడి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. రాధాకృష్ణయ్యగారు నాటకాలలో – ముఖ్యంగా రామదాసు నాటకంలో కబీరుగా – ఆంధ్రదేశ ప్రశస్తిని అందుకోగా ఘంటసాల బలరామయ్యగారు చిత్రనిర్మాతగా, దర్శకుడుగా – ముఖ్యంగా 'బాలరాజు' (1948), 'స్వప్నసుందరి' (1950) వంటి చిత్రాల – దర్శకనిర్మాతగా ప్రశస్తి పొందాడు. వీరిద్దరూ కలిసి గ్రామఫోను రికార్డులివ్వడం ఒక రికార్డు.

ఘంటసాల రాధాకృష్ణయ్యగారు 1898లో జన్మించారు. పాఠశాల విద్యను పొట్టెపాళెంలోనే పూర్తి చేసుకొని 1912లో ఆయన నెల్లూరు పట్టణానికి వచ్చారు. చిన్ననాడు తన ఊర్లో చూసిన తోలుబొమ్మలాటలు, నెల్లూరులో చూసిన సురభి, జ్యోతిసుబ్బయ్య కంపెనీ నాటకాలు నాటకాలవైపుకు రాధాకృష్ణయ్య మనసును లాగాయి. 1914లో నెల్లూరులోని ఆంధ్ర విజ్ఞానసమితిలో చేరి

అందులోని ప్రసిద్ధ నటులు తూములూరి శివరామయ్య, నాగరాజారావుల ప్రోత్సాహంతో తొలిసారి డి.వి. కృష్ణమూర్తి గారు రాసిన 'విషాద తిమ్మరుసు' నాటకంలో తిరుమలాంబ వేషం వేశారు.

అదే సమయంలో ప్రఖ్యాత నటులు కందాడై శ్రీనివాసన్ గారు ఆంధ్రభాషాభిమాని సమాజం నుంచి బయటకు వచ్చి సింహపురి సుగుణవిలాస సభను స్థాపించారు. రాధాకృష్ణయ్య ఆ నాటక సమాజంలో చేరి 'ప్రహ్లాద'లో లీలావతి, 'చిత్రనళీయం'లో దమయంతి, 'విషాదసారంగధర'లో రత్నాంగి, రాజా విక్రమదేవవర్మగారి 'శ్రీనివాస కల్యాణం'లో పద్మావతి, 'మానవతి'లో మానవతి వంటి ప్రముఖ స్త్రీ పాత్రలను ధరించి ప్రేక్షకామోదం పొందారు.

ఆ తరువాత స్వయంగా సింహపురి నాట్యమండలిని స్థాపించి బలిజేపల్లి వారి 'సాత్రాజితీయం'లో కృష్ణుడు, 'రాయబారం'లో కృష్ణుడు వేషాలతోపాటు 'రామదాసు' నాటకంలో కబీరు పాత్రను భక్తిశ్రద్ధలతో అభ్యసించి, కొద్ది దినాలలోనే ఆ పాత్రకు రాధాకృష్ణయ్య గారిని మించిన నటుడు లేడనే ఖ్యాతిని పొందారు. బళ్లారి రాఘవ, సి,యస్.ఆర్. వంటి అనేకులు రామదాసు పాత్ర ధరించగా, రాధాకృష్ణయ్యగారు వారితో పాటు కబీరు వేషం వేసి రసజ్ఞుల మెప్పు పొందారు.

శాంత గంభీర వాక్ప్రవాహం రాధాకృష్ణయ్యగారి సొత్తు. స్పష్టమైన వాచికం, దానికి తోడుగా నిరాడంబరమైన ఆయన నడవడి, సమయోచితమైన రాగాలాపన, భక్తితత్పరత, హిందీలో కబీర్ దోహాలు శ్రావ్యంగా పాడగల అసమాన నైపుణ్యం రాధాకృష్ణయ్య కబీర్ పాత్రను జీవంతం చేసి మనముందు నిలిపాయి. బళ్లారి రాఘవ వంటి నటుడు "రాధాకృష్ణయ్య గారు కబీరు వేషం వేసినప్పుడల్లా నా రామదాసు వేషానికి ఒక నిండుతనం వస్తుందన్న" కితాబునిచ్చారు. కబీర్ పాటలకు ఆయన ఎంచుకున్న హిందూస్థానీ రాగాలు మాల్‌కోస్, భీంపలాస్. ఆయనకు యిష్టమైన రాగాలు ఆనందభైరవి, శంకరాభరణం, తోడి, కాంభోజీలు. శ్రావ్యంగా కర్ణాటక సంగీతానికి దగ్గరైన బాణీలో ఆయన పాడిన పాటలకు అమితమైన స్పందన లభించింది.

నాటకాలు ఆడుతూ వుండగానే అప్పుడే ప్రారంభమైన చిత్రరంగం ఆయనకు ఆహ్వానం పలికింది – అదికూడా తనకిష్టమైన 'రామదాసు' సినిమాలో ఇష్టమైన పాత్ర కబీరుగా. 1933లో ఈస్టిండియా ఫిలిం కంపెనీ వారు తీసిన




'రామదాసు' (1933) లో కబీరుగా ఘంటసాల రాధాకృష్ణయ్య

మొదటి 'రామదాసు' అది. ఆ తరువాత వరుసగా 'సతీ తులసి'లో నారదుడుగా (1936), 'భక్త కబీరు'లో కబీరుగా (1936), 'భక్త మార్కండేయ'లో మృకండ మహర్షిగా (1938), 'పార్వతీ కల్యాణం'లో శివుడుగా (1941) రాధాకృష్ణయ్య నటించి మంచి సినిమా నటుడుగా పేరొందాడు.

చలనచిత్రాల నుంచి విరమించిన తరువాత నెల్లూరు చేరి 1940లో పెద్ద ఎత్తున రాధాకృష్ణ నాట్యమండలిని స్థాపించి వివిధ నటులు రామదాసు పాత్రను ధరించగా తాను కబీరు వేషం వేసి ఆంధ్రదేశ సంచారం చేశాడు. బందరులో ముట్నూరు కృష్ణారావు గారి అధ్యక్షతన "నాట్యగాన విశారద" అన్న బిరుదును పొందాడు. ఆంధ్రదేశ నాటకరంగానికి ముఖ్యంగా నెల్లూరి నాటకరంగానికి ఆయన చేసిన సేవలను ప్రస్తుతిస్తూ రేబాల లక్ష్మీనరసింహారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి గార్ల ఆధ్వర్యంలో నెల్లూరు పౌరులు ఘనసన్మానం చేశారు.

యావదాంధ్ర దేశం ఆయనను "ఆంధ్ర కబీర్"గా కీర్తించింది.

ఘంటసాల రాధాకృష్ణయ్య గారి తమ్ముడు ఘంటసాల బలరామయ్యగారు 1906లో పొట్టిపాళెంలో జన్మించారు. ఆయన మీద అన్నగారి ప్రభావం బాగా ఉండేది. అన్నగారితో పాటు చిన్నతనంలోనే చిన్న రామదాసుగా నటించాడు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంవల్ల నెల్లూరులో అన్నగారి దగ్గర ఉండి విద్యాభ్యాసం చేసి కోఆపరేటివ్ ఇన్‌స్పెక్టరు ట్రెయినింగ్ పూర్తి చేశాడు. చిన్నతనం నుంచీ అన్నగారిలాగే తాను కూడా నటుడిని కావాలని ఆశపడేవాడు. అందుకోసం సంగీతం నేర్చుకొని రాగవరసలో పద్యాలు పాడేవాడు. తెలుగు సినిమా ప్రారంభ దినాలలో స్టేజి నటులే సినిమా నటులుగా స్థలాంతరం చెందారు కనుక ఆయన అన్నగారు రాధాకృష్ణయ్యగారితో పాటు (ఆయన కబీరు వేషం వేశాడు) రామదాసు సినిమాలో వేషం వెయ్యడానికి కలకత్తా వెళ్లాడు. బలరామయ్యగారు ఆ చిత్రంలో నటించకపోవడంతో తెలుగు సినిమాకు ఓ భావిదర్శక నిర్మాత లభించాడు. కలకత్తాలో ఉన్నరోజుల్లో చిత్రనిర్మాణంలో మెళుకువలను ఆకళింపు చేసుకున్నాడు.



ఘంటసాల బలరామయ్య

'రామదాసు' సినిమా తరువాత బలరామయ్యగారు అన్నగారితో పాటు నెల్లూరు తిరిగివచ్చి నెల్లూరి వారితో కలిసి 'శ్రీరామా ఫిలిమ్స్' అనే చిత్ర నిర్మాణ సంస్థను ప్రారంభించాడు. ఈ సంస్థ నిర్మించిన 'సతీ తులసి' సినిమాకి బలరామయ్య ప్రొడక్షన్ ఎక్సిక్యూటివ్. కారణాంతరాల వల్ల ఆయన శ్రీరామా ఫిలింస్ నుంచి బయటకు వచ్చి తన స్వీయ నిర్మాణ సారథ్యంలో "కుబేరా ఫిలిమ్స్"ను ప్రారంభించారు. ఆ సంస్థ 'భక్త మార్కండేయ', 'మైరావణ' చిత్రాలను నిర్మించింది. కాని బలరామయ్యగారు కుబేరా సంస్థ నుంచి కూడా బయటకు వచ్చి స్వంతంగా 1940లో ప్రతిభా పిక్చర్స్‌ను స్థాపించి 1941లో 'పార్వతీ పరిణయము' చిత్రాన్ని




నిర్మించాడు. దానికి బలరామయ్య గారే నిర్మాత, దర్శకుడు. వేల్ పిక్చర్స్ స్టూడియోలో నిర్మించబడిన ఈ చిత్రంలో శాంతకుమారి, ఘంటసాల రాధాకృష్ణయ్యగారు ముఖ్యపాత్రధారులు.

ఆ తరువాత 1943లో బలరామయ్యగారు భానుమతి, వేదాంతం రాఘవయ్య, గగ్గయ్య ప్రభృతులు తారాగణంగా 'గరుడ గర్వభంగం' సినిమాను నిర్మించారు. 1944లో అక్కినేని నాగేశ్వరరావును రాముడిగా సినిమాలకు పరిచయం చేస్తూ 'సీతారామజననం' సినిమా తీశారు. తనను కన్నకొడుకులా చూసి తన యింట్లోనే వుంచుకున్న మహానుభావుడు బలరామయ్యగారని అక్కినేని

ఆయనకు నివాళులర్పించారు. ఆ తరువాతి చిత్రం 'ముగ్గురు మరాఠీలు' (1946). గోవిందరాజుల సుబ్బారావు, కన్నాంబ, సిహెచ్.నారాయణరావు, నాగేశ్వరరావు, శివరావు మొదలైనవారు నటించారు. ప్రథమశ్రేణి నటీమణిగా కన్నాంబకు, ప్రథమశ్రేణి హాస్యనటుడుగా శివరావుకు ఈ సినిమా వలన గుర్తింపు లభించింది. ఈ చిత్రం తరువాతది 1948లో వచ్చిన 'బాలరాజు'. నాగేశ్వరరావు, అంజలీదేవి, యస్. వరలక్ష్మి, శివరావు ముఖ్య తారాగణంగా వచ్చిన ఈ సినిమా సామాన్యమైన చిన్నపట్టణాలలో కూడా 300 రోజులు ఆడి విజయఢంకా మోగించింది.

1949లో 'శ్రీలక్ష్మమ్మ కథ' మీద చర్చలు జరుగుతూ వుండగా మరొకరు అదే కథతో సినిమా తీస్తున్నారని తెలిసి తాను ప్రారంభించిన 'స్వప్నసుందరి' సినిమాను పక్కకు పెట్టి 'శ్రీలక్ష్మమ్మకథ' (1950) ను నిర్మించారు.


ఈ చిత్రం తరువాత 'చిన్నకోడలు' (1952) చిత్రం నిర్మించారు. మరొక జానపద చిత్రం 'రేచుక్క' తీస్తున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి 1953 అక్టోబరు 29న మరణించారు. 'రేచుక్క' (1955) ఆ తరువాత పి.పుల్లయ్యగారి దర్శకత్వంలో విడుదలయింది.

బలరామయ్యగారు తన చిత్రాలలో నటించిన నటీనటులు, సాంకేతిక శాఖలలో పనిచేసేవారు సుఖంగా ఉండాలని ఆకాంక్షించిన వ్యక్తి. తనతో పని చేసినవారు ఎందరో తమ తమ కొత్త నిర్మాణ సంస్థలను ప్రారంభించడానికి సహాయం చేశారు ఆయన. అనేక సంస్థలకు ఉదారంగా సహాయం చేసేవారు. అనేకమంది తారలను, టెక్నీషియన్లను సినిమా పరిశ్రమకు పరిచయం చేసిన గొప్ప నిర్మాత–దర్శకుడు ఆయన.

రాధాకృష్ణయ్య–బలరామయ్యలు తెలుగు నాటక, సినిమా రంగాలలో తమదైన ముద్రతో జీవితాన్ని గడిపిన మాన్యులు. ఒకరు కబీరు పాత్రలో జీవించి, నిత్యజీవితంలో కూడా కబీరు పంథాను అనుసరించినవారు. మరొకరు తాను ఎన్నుకొన్న జీవనపథంలో ప్రగతిని సాధిస్తూనే మిగిలిన అనేకమందికి తన సహాయ సహకారాలు అందిస్తూ జీవితం గడిపిన ధన్యజీవి.

వారు పాడిన గ్రామఫోను రికార్డులు వారి తొలినాటి నాటకానుభవాలకు ఆనవాళ్లు. ❑

# నిడుముక్కల సుబ్బారావు




ఇరవయ్యో శతాబ్దం మొదటి మూడు దశాబ్దాలు ఆంధ్రనాటకరంగంలో వృత్తి సమాజాల యుగం. అందులో మైలవరం కంపెనీ అని పిలవబడే బాలభారతీ నాటక సమాజానికి ప్రముఖమైన స్థానం ఉంది. వ్యాపార నాటకరంగం ఆశించే అన్ని హంగులతోను ఏర్పడ్డ సమాజం అది. ఆ సమాజం కోసమే రాసిన నాటకాలు, ఆ నాటకాలలో పాత్రధారణ చేయడానికి ఆంధ్రదేశం నలుమూలల నుంచి ఎంపిక చేయబడ్డ నటులు, నాటకానికి కావలసిన సంగీతం అందించే అతిరధమహారధులు, విద్యుద్దీపకాంతుల ధగధగలు, కళ్లు మూసి తెరిచేలోపే దృశ్యబంధాల మార్పు – ఈ అన్ని హంగులతో తెలుగు ప్రేక్షకలోకాన్ని అలరించిన నాటక సమాజం అది. అందులో యడవల్లి సూర్యనారాయణ, ఉప్పులూరి సంజీవరావు, అద్దంకి శ్రీరామమూర్తి, జొన్నవిత్తుల శేషగిరిరావు, దైతా గోపాలం వంటి మహామహుల సరసన ప్రతి నాటకంలోను ముఖ్యమైన పాత్రలను ధరిస్తూ నాటకాల విజయానికి తోడ్పడిన ప్రముఖ నటుడు నిడుముక్కల సుబ్బారావు.

శ్రీ సుబ్బారావు మచిలీపట్నంలో జన్మించి అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఒకసారి వింటే ఆ రాగాన్ని తు.చ. తప్పకుండా అలానే పాడగలిగిన గాత్ర సౌలభ్యం చిన్నతనంలోనే అలవడడంతో తన 11వ ఏటనే బందరులోని చిత్రకళాభివర్ధనీ నాటక సమాజంలో చేరి బాలపాత్రలు ధరించడంలో ఆరితేరాడు. అక్కడ వుండగానే 'భీష్మ' నాటకంలో చిన్న భీష్ముడు, 'సతీ అనసూయ'లో మన్మథుడు,

'కనకతార'లో క్రూరసేనుడు వంటి పాత్రలను పోషించాడు. చిన్నతనం నుంచీ ముత్తరాజు సుబ్బారావు, కోట ఆంజనేయులు ప్రభృతుల శిక్షణలో నటనలో మెళుకవలు నేర్చాడు. బందరులోనే కొన్నాళ్లు శానిటరీ ఇన్‌స్పెక్టరు ఉద్యోగం చేస్తూ నాటకాలాడాడు. కాని బెజవాడ నుంచి ఆహ్వానం రావడంతో ఉద్యోగాన్ని వదలి బెజవాడ చేరాడు. కొద్దికాలం బెజవాడలో ఫస్టు థియేటర్ అని పేరు పొందిన హిందూ నాటక సమాజంలో కాశీనాధుని వీరమల్లయ్యగారి శిక్షణలో క్రూరసేనుడు, 'తారాశశాంకం'లో చంద్రుడు, 'సుకన్య'లో అశ్వినీదేవత వేషాలు వేశాడు. ఇంతలో నాటకరంగ అయస్కాంతం లాంటి మైలవరం కంపెనీ మైలవరం గ్రామం నుంచి బెజవాడ చేరడటంతో అందులోచేరి పన్నెండు సంవత్సరాలు వందలకొద్ది ప్రదర్శనలలో, పదులకొద్దీ నాటకాలలో ప్రధాన పాత్రలు ధరించి ప్రశంసలు పొందాడు.

బాలభారతి నాటక సమాజంలో శ్రీ సుబ్బారావు యడవల్లి, ఉప్పులూరి ప్రభృతులతో దాదాపు వారి అన్ని నాటక ప్రదర్శనలలోను పాల్గొనడమే కాక, యడవల్లివారు లేని సమయాలలో ఆయన ధరించే పాత్రలను కూడా ధరించడంతో అన్ని నాటకాలలోని అన్ని పాత్రల పాఠ్యాన్ని కంఠస్తం చేసిన ఘనత ఆయనది. 'పాండవోద్యోగ విజయాల'లో శ్రీకృష్ణుడు, అర్జునుడు; 'గయోపాఖ్యానం'లో అర్జునుడు, 'సావిత్రి'లో సత్యవంతుడు, 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో శిశుపాలుడు, 'బొబ్బిలి యుద్ధం'లో రంగారాయుడు, 'తులసీజలంధర'లో జలంధరుడు, 'చింతామణి'లో బిల్వమంగళుడు, 'సంపూర్ణ రామాయణం'లో శ్రీరాముడు, 'పాదుక'లో భరతుడు వంటి ఎన్నో పాత్రలను ధరించి, మెప్పించి మొత్తం నాటక సమాజానికి తలలో నాలికలా మెలిగేవారు. ఇవికాక 'చింతామణి'లో బిల్వమంగళుడు, 'ధరణికోట' నాటకంలో ఖడ్గ నారాయణుడు, 'చండిక'లో గిరిరాజు వంటి పాత్రలలో అసామాన్యంగా నటించారు. సోమరాజు రామానుజరావు గారు రంగూన్‌లో ఉండగా అక్కడి ఆంధ్రనాటక సమాజం అభ్యర్థన మేరకు సుబ్బారావు గారు ప్రధాన పాత్రధారిగా ఆరు నాటకాలను రెండు నెలల పాటు ప్రదర్శించారు. అక్కడ ప్రదర్శించిన 'సావిత్రి'లో సత్యవంతుడు పాత్రకు ఆంధ్రనాటక సమాజ స్థాపకులు వెలగల వెంకటరెడ్డిగారు, రెడ్డి సన్యాసయ్యగారు సుబ్బారావుగారిని ఘనంగా సత్కరించారు.




'పాశుపతాస్త్రము' సినిమా పోస్టర్ (చేతిలో కమండలంతో వున్నది నిడుముక్కల)

ఆ తరువాత బెజవాడలో సోమరాజు రామానుజరావుగారి 'స్వరాజ్య సోపానము' నాటకంలో గాంధి పాత్ర ధరించినప్పుడు సత్యాగ్రహులు, ప్రజలు జేజేలు పలికారు. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను, ఇతర నటులను అరెస్టు చేసి, స్వంతపూచీకత్తు మీద విడుదల చేశారు.

సుబ్బారావుగారు పోషించిన అన్ని పాత్రలూ ప్రజామోదం పొందినా ఆయనకు ప్రేక్షకులకు కూడా నచ్చిన పాత్ర 'గయోపాఖ్యానం'లో అర్జునుడి పాత్ర. ఈ పాత్రధారణలో ఆయన కృష్ణ పాత్రకు దీటుగా అటు కయ్యము, యిటు నెయ్యము - రెండింటిలోను సమానమైన నటనా వైదుష్యం చూపి విజయనగరం పండిత సభ వారిచేత 'నాట్యవిశారద' అన్న బిరుదును పొందారు. ఆయనకు ఆనాటి మద్రాసులో, హైదరాబాదులో, రంగూన్‌లో జరిగిన సన్మానాలకు లెక్కేలేదు.

ఇతర నటులకు మాదిరిగా పక్కవారిని పక్కకు నెట్టి తాను మాత్రమే రంగస్థలం మీద రాణించాలనే స్వార్థం లేక అందరు నటుల సమిష్టి కృషి నాటకం అని నమ్మిన వ్యక్తి ఆయన. ఒకరితో పోటీకి పోకుండా తనకిచ్చిన పాత్రకు ఎలా న్యాయం చేయాలా అని నలుగురి సలహాలను తీసుకుని పాత్రను తీర్చిదిద్దుకొనే మనస్తత్వం ఆయనది. అందుకే రంగస్థలం మీద అర్జునుడే అయినా నిజజీవితంలో ధర్మరాజుగా పేరు పొందారు.

ఆ రోజుల్లోని ప్రధాన నటులందరికి మాదిరిగానే నిడుముక్కల కూడా సినిమాలలో ప్రవేశించి రంగస్థలం మీద తాను నటించిన, ప్రజలు మెచ్చిన సత్యవంతుడి పాత్రనే ('సతీసావిత్రి' (1933) సినిమాలో) నటించి ప్రేక్షకులను అలరించాడు. ఆ తరువాత 'రుక్మిణీకల్యాణము' (1937) లో శిశుపాలుడుగాను, 'పాశుపతాస్త్రము' (1939) లో అర్జునుడుగాను నటించాడు. ఆరోజుల్లోనే సన్ రికార్డింగ్ కంపెనీకి, హిజ్ మాస్టర్స్ వాయిస్‌కి ఆయన దాదాపు ముప్ఫయ్ రికార్డులిచ్చారు. ఆయన సేవలను గుర్తించి ఆంధ్ర నాటక కళాపరిషత్తు 1960లో తణుకులో జరిగిన స్వర్ణోత్సవాలలో ఆయనను ఘనంగా సత్కరించింది.

సంగీతానికి, భావాభినయానికి సమానమైన ప్రాధాన్యతనిచ్చి సమిష్టి నాటక ప్రదర్శనల ప్రాముఖ్యాన్ని ఆనాడే గుర్తించిన నిడుముక్కల సుబ్బారావు గారు తన 75వ ఏట పరమపదించారు. ❑

# లక్కరాజు విజయగోపాలరావు



స్త్రీ పురుష వేషాలను సమానమైన ప్రతిభా సంపన్నతతో ధరించి ప్రేక్షకుల ఆదరాభిమానాలను, సమకాలీన మహానటుల ప్రశంసలను పొందిన అరుదైన నటుడు లక్కరాజు విజయగోపాలరావు. విద్యార్థిదశలోనే రంగస్థలం మీద తన ప్రత్యేకతను చూపిన గోపాలరావు రేపల్లె తాలుకా కనగాల గ్రామంలో 1903 డిసెంబర్ 4వ తేదీన జన్మించాడు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో మేనమామల యింట తెనాలిలో పెరిగి విద్యాభ్యాసం కొనసాగించాడు. తెనాలి తాలుకా హైస్కూలులో యస్.యస్.యల్.సి. పూర్తి చేశాడు. చదువుకొనే రోజుల్లో పాఠశాలలో ప్రార్థనా కార్యక్రమాలు లక్కరాజు నిర్వహించవలసిందే! కమ్మని కంఠం! రాగయుక్తమైన పద్యపఠనం! ఇదే సమయంలో గుంటూరు ఫస్టు కంపెనీ వంటి ప్రఖ్యాత నాటకసంస్థ తెనాలి వచ్చి నాటకాలు ప్రదర్శించడం చూసి ఉత్తేజితుడైనాడు గోపాలరావు. అలాగే సురభివారి నాటకాలు కూడా ఆ పిల్లవాడిని ప్రభావితం చేశాయి. అప్పుడే తోటివారితో కలిసి 'యూనివర్సల్ అమెచూర్స్' అనే సంస్థ స్థాపించి హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించాడు. అందులో ఫణిహారం వెంకటేశ్వర్లు, ఈమని వీరబ్రహ్మాచారి, స్థానం నరసింహారావు ప్రభృతులు నటించారు. స్థానంతో అప్పటి మైత్రి వారి జీవితకాలం కొనసాగింది. అదే సంస్థ పక్షాన గోపాలరావు ప్రధాన భూమికలు ధరించడం ప్రారంభించాడు. 'రసపుత్ర కదనం', 'రసపుత్ర విజయం' నాటకాలలో గోపాలరావు బహదూర్‌సింగ్, విమల అనే పురుష, స్త్రీ పాత్రలను ధరించి తోటివారిని అబ్బురపరిచాడు.

1920లో గోవిందరాజుల సుబ్బారావు, పెద్దిభొట్ల చలపతి, మాధవపెద్ది వెంకట్రామయ్య వంటి పూర్వ విద్యార్థులు తెనాలిలో తారసపడి నాటకాలు



'సతీ అనసూయ' నాటకంలో తులసి పాత్రలో

వేయడానికి సంకల్పించి 'తిలక్ అమెచూర్స్' స్థాపించారు. గోవిందరాజుల ఆధ్వర్యంలో వీరు ప్రదర్శించిన 'ప్రతాపరుద్రీయం' నాటకంలో గోపాలరావు చెకుముకి శాస్త్రి పాత్రను ధరించి అత్యద్భుతమైన నటనను ప్రదర్శించాడు. 1921లో ప్రారంభమైన రామవిలాససభలో వీరంతా సభ్యులై అదే నాటకాన్ని కొన్ని వందలసార్లు విజయవంతంగా ప్రదర్శించారు. గోపాలరావు అందులో ఒక ముఖ్యమైన సభ్యుడైనాడు.

రామవిలాస సభ తరువాతి నాటకం 'బొబ్బిలి యుద్ధం'. అందులో గోపాలరావు వెంగళరాయుడు. ఈ రెండు నాటకాలు ఆ సభకు, సభ్యులకు కీర్తి ప్రతిష్టలను ఆర్జించి పెట్టాయి. ఆ తరువాత గోపాలరావు 'శ్రీకృష్ణ రాయబారం'లో కర్ణ పాత్ర ధరించాడు, మాధవపెద్ది దుర్యోధనుడు. మాధవపెద్ది, గోపాలరావుల నటనా చాతుర్యానికి ఆ నాటకం గొప్ప నిదర్శనం. 'రోషనార'లో రామోజి అనే సేనాని వేషంతోపాటు రజాక్ అనే హాస్య పాత్రను పోషించి గంభీర హాస్య పాత్రలను రెండింటినీ ఒకే నాటకంలో ఒకదాని తరువాత ఒకటిగా నటించి 'ఔరా!' అనిపించుకొన్నాడు. అలాగే 'అనసూయ' నాటకంలో స్థానం అనసూయగా, గోపాలరావు సుమతిగా ఆంధ్రదేశంలోని ఇద్దరు ప్రతిభావంతలైన వేషధారులు రామవిలాససభలో ఉన్నారని తోటివారికి అసూయ కలిగేటంత గొప్పగా నటించి

రాణించారు. అలాగే 'శ్రీకృష్ణతులాభారం'లో స్థానం సత్యభామ, గోపాలరావు రుక్మిణి. బరంపురం నుంచి మద్రాసు వరకు రామవిలాససభ నాటకాలు వేయని పట్టణం లేదు; ప్రశంసలు అందుకోని ప్రదర్శన లేదు.

అప్పటివరకు వృత్తి నటుడుగా ఉన్న గోపాలరావును తమ సభ్యుడిగా చేర్చుకోవడానికి గుంటూరు న్యాయశాఖోద్యోగులు ఒక నాటక సమాజం స్థాపించారు. ఆయనకు మున్సిఫ్ కోర్టులో గుమాస్తా ఉద్యోగాన్నిప్పించారు. ఇక ఆ సమాజం పక్షాన చోరగుడి దాశరథిరావు ప్రధాన నటుడుగా, గోపాలరావు స్త్రీ పురుష వేషధారిగా 'రాణీ సంయుక్త', 'బొబ్బిలి యుద్ధం', 'విజయనగర పతనం' ప్రదర్శించి పేరు పొందారు. 'విజయనగ పతనం'లో ఒకసారి రాఘవ పఠానుగా గోపాలరావు ఆషాబీగా నటించారు. రాఘవ గోపాలరావు పాత్ర పోషణకు ముగ్ధుడై తాను ఈ జిల్లాలలో ప్రదర్శనలిచ్చినప్పుడు గోపాలరావు తప్పక పాల్గొనాలని కోరాడు.

అయితే ఈలోగా గోపాలరావు ఎల్.ఐ.యం. చదవడానికి మద్రాసుకు వెళ్ళాడు. అక్కడ చెన్నపురి ఆంధ్రసభలో చేరి కామాక్షి సుందరశాస్త్రి గారితో కలిసి 'రోషనార', 'పీష్వానారాయణరావు వధ' నాటకాలను ప్రదర్శించాడు. 'రోషనారా'లో రోషనారగా, 'పీష్వా నారాయణరావువధ'లో నారాయణరావుగా తన ప్రతిభా సంపత్తులను చూపి ఖ్యాతి గడించాడు. రెండవ నాటకాన్ని హిందీలో కూడా తయారుచేసి 1929లో మహాత్మాగాంధి సమక్షంలో ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందాడు.

గోపాలరావు ఎల్.ఐ.యం. పూర్తి చేసి డాక్టరుగా ముందు తెనాలిలోను, ఆ తరువాత చుండూరులోను ప్రాక్టీసు చేస్తున్నా తన నాటక ప్రస్థానాన్ని ఆపలేదు. అక్కడ కూడా సీతారామాంజనేయ నాటక సమాజం అనే నాటకసంస్థను స్థాపించి చంద్రగుప్త నాటకాన్ని పలుమార్లు ప్రదర్శించాడు. అలాగే నాటకాలలోని పద్యాలు, పాటలతో పాటు 'బ్రాడ్‌కాస్ట్' గ్రామఫోను కంపెనీ వారి కోసం 'కృష్ణకర్ణామృతం'లోని శ్లోకాలను, విశ్వనాథ సత్యనారాయణగారి 'ఆంధ్ర పౌరుషము' లోని పద్యాలను ప్రయివేటు రికార్డులుగా యిచ్చాడు.


తాను చేపట్టిన ఏ పాత్రకైనా, ఏ వృత్తికైనా న్యాయం చేయడానికి అహరహరమూ శ్రమించిన అతిరథులైన నటులలో లక్కరాజు విజయగోపాలరావు ఎన్నదగినవాడు. ❑

# ముప్పవరపు భీమారావు



చెప్పుకోదగిన తొలితరం రంగస్థల నటులలో ముప్పవరపు భీమారావు ఒకరు. శాంత గంభీర భావాలను వెలిబుచ్చే పాత్రలలో రాణించిన భీమారావు ముప్ఫయ్ సంవత్సరాలకు పైగా గుంటూరు నాటకరంగంలోని అన్ని ప్రధాన సమాజాల నాటకాలలో పాల్గొని తనకు, తన నటనకు ఒక ప్రత్యేకమైన ప్రతిపత్తిని సంపాదించుకొన్న మంచి నటుడు; అంతకన్న మంచి మనిషి.

భీమారావు జమీందారీ ఛాయా ఉన్న కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు రామారావు, వెంకూబాయమ్మ గార్లు. చిన్నతనంలోనే నాటకాల "పిచ్చి"లో పడి చదువు చాలించి ఆంధ్రదేశంలోని తొలినాటక సమాజాలలో ఒకటైన హిందూ నాటక సమాజం అనే గుంటూరు ఫస్టు కంపెనీలో బాలపాత్రలతో రంగప్రవేశం చేసి యువక పాత్రలకు ఎదిగారు. తగుమాత్రమైన సంగీతం, ఎవ్వరికీ తీసిపోని నటనా చాతుర్యం, ఎవ్వరినీ నొప్పించని మనస్తత్వం – ఈ మానవీయ, నాటకీయ లక్షణాలు నటలోకంలో ఆయనకు ప్రత్యేక గౌరవాన్ని కలగచేశాయి. 1905 సెప్టెంబరు 27న జన్మించిన భీమారావు గుంటూరు ఫస్టు కంపెనీ మలిరోజుల్లో విశ్వామిత్ర, దశరథ పాత్రలకు పేరుపొందాడు. బలిజేపల్లి



'పాండవోద్యోగ విజయాలు' లో ధర్మరాజుగా

లక్ష్మీకాంతం గారిని పద్యపఠనంలో అనుసరించిన భీమారావు ఆయన వేసే నక్షత్రకుని పాత్రను ఆయన సమక్షంలోనే వేసి పేరెన్నికగన్న నటుడుగా స్థిరపడ్డాడు. హరిప్రసాదరావు, పత్రి శ్రీనివాసరావు, బలిజేపల్లి ప్రభృతి మొదటి తరగతి నటుల సరసన నటించి భేష్ అనిపించుకున్నాడు.

ఫస్ట్ కంపెనీ ఆగిపోగానే కొన్నాళ్లు ఇతర గుంటూరు సమాజాలలో నటించి, చివరకు అద్దంకి శ్రీరామమూర్తిగారు 1913లో స్థాపించిన 'స్టార్ థియేటర్'లో చేరి గుంటూరు నటవర్గంలో తనకంటూ ఒక ప్రధానమైన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఈ నాటక సమాజంలో అద్దంకి వారితో పాటు రావిపాటి లక్ష్మీనారాయణ, బొగ్గవరపు రామకృష్ణారావు, జంధ్యాల కృష్ణారావు మొదలైనవారితో కలిసి ప్రముఖ పాత్రలు ధరించాడు. ఈ సమాజంవారి 'సారంగధర'లో రాజరాజ నరేంద్రుడు, 'చింతామణి'లో భవానీశంకరుడు, బిల్వమంగళుడు, 'శ్రీకృష్ణలీలలు'లో వసుదేవుడు, 'బొబ్బిలియుద్ధం'లో ధర్మారాయుడు, 'పాదుక'లో దశరధుడు, 'షిరిడీసాయి చరిత్ర'లో షిరిడీ సాయి వంటి ప్రధాన పాత్రలలో నటించి అన్ని రకాల ప్రేక్షకులను అలరింపచేశాడు. చివరి రోజులలో అబ్బూరి వరప్రసాదరావుగారి 'ఆంధ్ర డ్రమాటిక్ కంపెనీ'లో చేరి 'పాండవోద్యోగ విజయాల'లో ధర్మరాజు పాత్రను అద్భుతంగా పోషించి ప్రశంసలు పొందారు.

భావానుసారంగా పద్యాన్ని చదవడం, పద్యభావానికి రాగం ద్వారా రసాత్మక వ్యాఖ్యానం చేయడం మొదటితరం గుంటూరు నటుల ప్రముఖ లక్షణాలు. బలిజేపల్లి వారి శిష్యుడు భీమారావు ఆజన్మాంతం అదే పద్ధతిని అనుసరించాడు. ఎంతటి క్లిష్టమైన పద్యాన్నయినా అరటిపండు ఒలిచి చేతిలో పెట్టగల భావ ప్రధానంగా తన పద్య పఠనాన్ని తీర్చిదిద్దుకున్నాడు. ఆయనకు పేరు తెచ్చిన పాత్రలలో అతిముఖ్యమైనవి. 'ఉద్యోగ విజయాల'లో ధర్మరాజు, 'పాదుక'లో దశరథుడు, 'షిరిడీసాయి'లో సాయి. మూడు పాత్రలలోను శాంత, గంభీర భావ వ్యక్తీకరణం ముఖ్యం. ఆ పాత్రలే ప్రేక్షకుల మెప్పు పొందాయి. ఆ పాత్రలే భీమారావుకు యిష్టమైనవి. రాజరాజ నరేంద్రుడుగా భీమారావు నటనకు ముగ్ధుడైన సారంగధర వేషధారణకు పేరు పొందిన ఫస్టుకంపెనీ అధినాయకుడు, 'నటపితామహ' బిరుదాంకితుడు హరిప్రసాదరావుగారు ఎవరు రాజరాజ నరేంద్రుడు వేషం వేసినా, భీమారావు కన్న గొప్పగా నటించగలగడం అసంభవం అని పొగిడారు. ఆ పొగడ్తలకు పొంగిపోక భీమరావు నాటకాంతాన హరిప్రసాదరావుగారికి పాదాభివందనం చేశాడట.

1949లో గుంటూరులో జరిగిన చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి గారి సన్మాన సంఘం వారి పక్షాన జరిగిన అఖిలాంధ్ర పాండవోద్యోగ నాటక పోటీలలో భీమారావుగారి ధర్మరాజు పాత్రకు ప్రథమ బహుమతి లభించింది. చెళ్లపిళ్ల వారిని మద్రాసు ప్రభుత్వం ఆస్థాన కవి పదవికి నియమించి గౌరవించగా వారిని సన్మానించడానికి విజయవాడలో 'నభూతో న భవిష్యతి'గా జరిగిన సన్మానసభలో టంగుటూరి ప్రకాశం పంతులుగారి నుంచి సువర్ణ నటరాజ విగ్రహాన్ని బహుమతిగా పొందాడు ముప్పవరపు. మూడు దశాబ్దాల తన నటజీవితానికి ఇది నటరాజు తనకిచ్చిన ఆశీస్సుగా చెప్పుకున్నాడాయన.

పుట్టింది జమిందారీ వంశంలో, జీవితాంతం బతికింది జమిందారుగా. వేసింది రాజు పాత్రలు! అయినా అవసానదశలో పేదతనమే అనుభవించి తన 64వ ఏట గుంటూరులో 1969 జనవరి 2న పరమపదించారు భీమారావు గారు. ❑

# క్షత్రియ పార్వతీబాయి



నాటకాలు గ్రామఫోను రికార్డ్‌సెట్లుగా వస్తున్న రోజుల్లో తెలుగు నాటక ప్రియులను, గ్రామఫోను శ్రోతలను అలరించిన రెండు నాటకాలు – 'సీతా కల్యాణం', 'శాకుంతలం'. ఈ రెంటిలోను పాల్గొని శ్రావ్యమైన తన కంఠస్వరంతో మధురగానాన్ని వినిపించిన గాయనీమణి పార్వతీబాయి. ఆమె 1912లో ఏలూరులో జన్మించింది. తండ్రి లక్ష్మణసింగ్, తల్లి గంగాబాయి. ఎప్పుడో ఉత్తరదేశం నుంచి వలసవచ్చి ఆంధ్రదేశంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న క్షత్రియ కుటుంబం వారిది. తల్లి సంగీతం పాడుతూ వుండడంతో పార్వతీబాయికి

కూడా చిన్నతనం నుంచే రాగాలాపన, పాటలు శ్రుతిపక్వంగా పాడడం అలవాటయింది. చిన్నతనంలో స్కూలులో తెలుగు మాస్టారు ఆమె పాడడం విని, ముచ్చటపడి ఆమెకు తెలుగులో మంచి ప్రవేశం కలగచేశాడు. ఏలూరు నాటక ప్రదర్శనల కూడలి కావడంతో నాటకాలు చూడడం, అందులోని పద్యాలను, పాటలను పాడుతూ వుండడం సాగించింది. సరిగ్గా అదే సమయంలో దొమ్మేటి సూర్యనారాయణ గారు సోమరాజు రామానుజరావు గారి 'రంగూన్‌రౌడీ' నాటకాన్ని చేపట్టి అందులో సుగుణవతి, త్యాగమయి అయిన రౌడీ భార్య అన్నపూర్ణ పాత్రకు ఈమె సరైన నటి అని భావించి ఆమెను ఆహ్వానించాడు. కాని అసలే స్త్రీలింకా రంగస్థలం మీదకు రానిరోజులవి. వచ్చిన కొద్దిమందిని గురించి జనం చెప్పుకునే గుసగుసలు విని పార్వతి తల్లితండ్రులు ఆమెను నాటకాలలో చేరకుండా వారించారు. కాని పార్వతి పట్టుదల వల్ల వారు చివరకు ఒప్పుకున్నారు. ఆ నాటకం ఆంధ్రదేశంలో విజయవిహారం చేయడంతో పార్వతీబాయి పేరు నలుమూలలా తెలిసింది. ఆమె క్షత్రియ కులానికి చెందినది కనుక ఆమెను క్షత్రియ పార్వతీబాయి అని పిలవసాగారు. అదే రూఢి అయిపోయింది.

ఆనాటి నుంచి ఆమె ఎందరో ప్రసిద్ధనటులతో కలిసి నాటక ప్రదర్శనలిచ్చింది. పార్వతీబాయి నాటకంలో ప్రధాన పాత్ర ధరిస్తే నాటకం విజయవంతం అవుతుందన్న నమ్మకం ప్రబలింది నిర్వాహకులకు. ఆ విధంగా ఆమె కపిలవాయి, రేలంగిలతో కలిసి విప్రనారాయణలో దేవదేవిగా, వై. భద్రాచార్యులు గారితో 'హరిశ్చంద్ర'లో చంద్రమతిగా, ఇతర అనేక కాంబినేషన్లలో 'చింతామణి'లో చింతామణి పాత్రను, 'తులాభారం'లో రుక్మిణి పాత్రను, 'రామాయణం'లో కౌసల్య పాత్రను, 'కృష్ణలీలలు'లో యశోద పాత్రను ఉత్తమంగా నిర్వహించింది.

ఇంతలో ప్రధాన నాటక సమాజాలు మూతపడడం, నటీనటులు కంట్రాక్టర్ల చేతుల్లోకి పోవడం జరిగాక అనేకమంది ప్రధాన నటులతో ఆమె నటించింది. అలా నటించినవారిలో అతిరథ మహారథులున్నారు. యడవల్లి, సి.యస్.ఆర్., కపిలవాయి, రఘురామయ్య, స్థానం, పారుపల్లి సుబ్బారావు, కన్నాంబ మొదలైన ఎందరో ప్రఖ్యాతులతో నాటక ప్రదర్శనలలో పాల్గొన్నది.




రంగూన్‌లో ఓడల వ్యాపారి, పారిశ్రామికవేత్త అయిన వెలగల వెంగళరెడ్డి గారి ఆహ్వానం మేరకు ఆమె క్షత్రియ నాటకసభ అనే సంస్థను స్థాపించి దాని తరపున రంగూన్‌లో ఆరు మాసాలు ప్రదర్శనలిచ్చి, లెక్కలేనన్ని బహుమానాలను పొందింది. బరంపురం నుంచి బెంగుళూరు వరకు ఆమె నాటక ప్రదర్శనను యివ్వని పట్టణం లేదు. ఇచ్చిన ప్రతిచోటా ఆమె సన్మానాలు పొందని ప్రదేశమూ లేదు.

క్షత్రియ పార్వతీబాయి చూడచక్కని విగ్రహంతో భక్తి శృంగార రసాలను వెల్లడించగల సాత్త్వికభావ ప్రకటనతో ఏ ఉద్వేగాన్నయినా ప్రస్ఫుటం చేయగల ముఖవర్చస్సుతో ప్రేక్షకులను అలరించడం వల్ల ఆమెకు చలనచిత్రరంగం కూడా ఆహ్వానం పలికింది. ఆమె మొదటి చిత్రం సి.పుల్లయ్యగారు దర్శకత్వం వహించిన 'సతీ సావిత్రి' (1933) సినిమా. అందులో ఆమె మాళవి. ఆ చిత్రం విజయవంతం కావడానికి పార్వతీబాయి హావభావాలు, అందచందాలు, శ్రావ్యమైన కంఠస్వరం కారణాలు. ఆ తరువాత 'చింతామణి' (1933) లో రాధ, 'కబీర్' (1936) లో సితారా, 'సతీ సులోచన' (1936) లో సీత వంటి పాత్రలలో నటించి ప్రశంసలు పొందింది. వాహినీవారి 'దేవత', 'సుమంగళి' చిత్రాలలోను, ఎ.వి.యం. వారి 'భూకైలాస్', 'భాగ్యలక్ష్మి', 'కృష్ణప్రేమ', 'కాళిదాసు', 'మాయామశ్చీంద్ర', 'యోగి వేమన' మొదలైన ఎన్నో చిత్రాలలో నటించి తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించింది.

స్పష్టమైన వాచికం, సుస్వరనాదగరిమ, చూడచక్కని రూపం పార్వతీబాయి నటిగా రాణించడానికి కారణాలు. ఆమె క్షత్రియ కుటుంబ వారసత్వం ఆమె నటనకు ఒక హుందాతనాన్ని తెచ్చిపెట్టింది. రంగస్థలనటిగా, గ్రామఫోను గాయనిగా, సినిమానటిగా ఎంతో వైవిధ్యమైన వేషాలు ధరించి, ధరించిన ప్రతి వేషమూ బాగా చేసిందన్న ఖ్యాతి గడించిన క్షత్రియ పార్వతీబాయి అలనాటి నటీమణుల ప్రతిభను చాటిచూపే తీపి గురుతు. ❑

# అబ్బూరి వరప్రసాదరావు



రెండు దశాబ్దాలపాటు తన శ్రీకృష్ణ వేషంతో సామాజికలోకాన్ని ఉర్రూత లూగించిన నటుడు శ్రీ అబ్బూరి వరప్రసాదరావు. కురుక్షేత్రం, పాండవోద్యోగ విజయాలు వంటి నాటకాలలో శ్రీకృష్ణపాత్రకు కావలసిన [illegible] తెలుగు ప్రేక్షకులకు అందించిన ఘనత అబ్బూరిది. [illegible]

అబ్బూరివారి [illegible]



**'పాండవోద్యోగ విజయాలు' లో శ్రీకృష్ణ పాత్రలో**

లేక అన్నదమ్ములు బయటకు వచ్చి తమ ఊరివాడే అయిన నందుల ఆంజనేయులు గారు హార్మొనిస్టుగా, ఆయన తరిఫీదులో పెద్ద వేషాలు చదివి స్వతంత్రంగా 'ఆంధ్రా డ్రమెటిక్ కంపెనీ' స్థాపించారు. అందులో ముఖ్యంగా అబ్బూరి సోదరులే ప్రధాన పాత్రలు ధరించినా తనకు ముందుతరంలోని ప్రముఖ నటులను తన ప్రదర్శనలలో భాగస్వాములను చేసేవాడు ఆయన. అప్పుడే అబ్బూరి ఉద్యోగ విజయాలలో కృష్ణుడుగా, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడుగా ఆంధ్రలోకానికి ఒక కొత్త తరహా నటనను చవిచూపాడు.

శాస్త్రీయంగా సంగీతం నేర్వకపోయినా అబ్బూరి రాగాలాపనలో ఒక శ్రావ్యత ఉండేది. మిగిలిన సమకాలీన పద్యనాటక నటులలా రాగాలాపనే ప్రధానంగా ఉండక అబ్బూరి రాగాన్ని నాటకానికి అనువుగా మలుచుకున్నాడు.

అందులో నాటకీయతను ప్రవేశపెట్టాడు. దానికి తగిన ఆంగికాభినయాన్ని జోడించేవాడు. వికృతంగా కనిపించని ఆంగిక, వాచిక ప్రతిస్పందనలు అబ్బూరి నటనకు నిండుతనాన్ని యిచ్చేవి. పల్లెటూళ్లలో నాటకం వేసినా ఆయన నాటకం వేస్తున్నాడంటే టిక్కెట్లు దొరికేవి కాదు. అంతటి కలెక్షన్లు ఒక నాటకానికి రావడం 40, 50 దశకాల్లో దాదాపు మృగ్యమనే చెప్పాలి.

అబ్బూరి 'పాండవోద్యోగ విజయాల'లో కృష్ణ పాత్రను అత్యద్భుతంగా పోషించేవాడు. పేరున్న ఇతర నటులు అబ్బూరి కాంబినేషన్‌లో కృష్ణుడు వేషం వేయడానికి జంకేవారు. అబ్బూరి హరిశ్చంద్రుడి వేషం కూడా అంతే నిండుగా ఉండేది. ముఖ్యంగా స్మశానవాటిక రంగంలో జాషువా పద్యాలను జోడించి పాడినప్పుడు కంటతడిపెట్టని ప్రేక్షకుడు ఉండేవాడు కాదు. పద్యాలలోని పదబంధాలను సమయానుకూలంగా ముందువెనుకలకు మారుస్తూ, రెట్టిస్తూ, తూలనాడుతూ, ఎకసెక్కేలాడుతూ అబ్బూరి పాడే పద్యాలకు "వన్స్‌మోర్"ల సంరంభం కూడా ఎక్కువగా ఉండేది.

సంపాదన బాగావున్న చాలామంది కిరాయినటుల బాటలోనే అబ్బూరి కూడా క్రమక్రమంగా దురలవాట్లకు లోనయ్యాడు. క్షయవ్యాధితో కొన్నాళ్లు మదనపల్లిలో వైద్యం చేయించుకున్నాడు. కొంత నయం కావడంతో తిరిగి నాటకరంగంలో తన పాత్రల్ని ధరిస్తూ మళ్లీ విశేషమైన ఆదరం పొందాడు. కాని ఆ వ్యాధి తిరగబెట్టి అబ్బూరి అస్తమించాడు.

అబ్బూరి వరప్రసాదరావు జీవితం కిరాయి నటులకు గుణపాఠంగా నిలిచింది. ఒకవంక తనకున్న పరిధిలో నటనలో కొత్త పద్ధతులను ప్రవేశపెట్టిన ఘనతను ఎంతగా నిరూపించుకున్నాడో, అంతగా ఆ రోజులలోని నటుల సంయమనం లేని స్వేచ్ఛా జీవితం వారి ప్రాణాలకు ఎలా హాని కలిగించిందో కూడా తెలియచెప్పిన వ్యక్తి అబ్బూరి. అబ్బూరి 1966 మే నెలలో అతి చిన్నతనంలోనే మరణించడం దురదృష్టకరం. ఆయన 42 ఏళ్లకే మరణించినా అబ్బూరి బాణీ మాత్రం యిప్పటికీ నిలిచే వుంది. మూడు తరాల కృష్ణపాత్రధారుల వాచికవిధానానికి మార్గదర్శి అయిన అబ్బూరి వరప్రసాదరావు తెలుగు ప్రేక్షకుల ఆదరాభిమానాలకు పాత్రుడు. ❑

# చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్

తాను ఎన్నుకున్న హరికథా రంగంలో నిష్ణాతుడై, తనను ఆహ్వానించిన నాటకరంగంతో మమేకమై, తనను ఆదరించిన సినిమారంగంలో రాణించి ఈ అన్ని రంగాలలోను సమాంతర కృషి చేసిన ఘనుడు 'హరికథా కంఠీరవ' బిరుదాంకితుడు చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్. తండ్రి నరసింహంగారు; తల్లి సూరమ్మగారు. 1905వ సంవత్సరం సెప్టెంబరు 19న విజయనగరంలో జన్మించారు. తండ్రిగారు విజయనగరం సంగీతకళాశాలలో విద్యనభ్యసించి వీణ గురువై సంగీత పిపాసి కావడంవల్ల సూర్యనారాయణ చిన్నతనం అంతా విజయనగర ఆస్థానంలోని కళాపారంగతుల సన్నిధానంలో గడిచింది. చిన్నతనం నుంచి తండ్రిగారి వద్ద సంగీతం అభ్యసించి 8వ ఏట కర్రా జగన్నాథరావు గారి దగ్గర గాత్ర సంగీతం నేర్చుకొని 13వ ఏట హరికథా పితామహులు ఆదిభట్ల నారాయణదాసుగారి ప్రథమ శిష్యవర్గంలో ఒకరైన నేమాని వరహాలదాసు గారి వద్ద హరికథా కథనంలో ఉత్తీర్ణులైనారు. అయినా ఆయన అర్తి ఆయనను నారాయణదాసుగారి శిష్యుణ్ణి చేసింది. వాడవాడలా హరికథాగానంలో తిరుగులేని భాగవతారుగా కొనియాడబడ్డాడు. హరికథాభ్యాసం చేస్తూనే యస్.యస్.యల్.సి. లో ఉత్తీర్ణుడైనాడు.

ఆయన గాత్ర మాధుర్యం, రంగస్థల విన్నాణం చూసి ఆనాడు విజయనగరంలో ప్రఖ్యాతమైన 'వాణీవిలాస నాటకసభ' నిర్వాహకులు శ్రీ అనాసపురపు గోపాలరావుగారు ఆయనను తమ సమాజంలోకి ఆహ్వానించారు. చొప్పల్లివారి రంగప్రవేశం ప్రఖ్యాత దేశభక్తి ప్రధానమైన నాటకం 'రసపుత్ర విజయం' లో వీరమాతగా. అది పండిత పామరామోదం పొందడంతో ఆ సంస్థలో 'భక్తప్రహ్లాద'లో నారదుడుగాను, 'లవకుశ'లో లక్ష్మణుడుగాను నటించి ఉత్తర కోస్తాజిల్లాలలో గుర్తింపు పొందిన నటుడై రాణించాడు.

ఒక వక్క రాష్ట్రం నలుమూలలలో హరికథా కాలక్షేపాలలో నిమగ్నుడై ఉంటూనే ప్రసిద్ధ నటులందరితోను 'గయోపాఖ్యానం', 'సక్కుబాయి', 'ద్రౌపదీ వస్త్రావహరణం' నాటకాలలో ముఖ్య భూమికలు ధరించాడు. ఆనాడు రంగస్థలాన్ని ఏలుతున్న యడవల్లి సూర్య నారాయణ, పారుపల్లి సుబ్బారావు, సి.యస్.ఆర్.ఆంజనేయులు మొదలైన వారితో కలిసి 'ద్రౌపదీ వస్త్రాపహరణం', 'సక్కుబాయి' వంటి నాటకాలను వందల సంఖ్యలో ప్రదర్శించాడు. ముఖ్యంగా సి.యస్.ఆర్.కృష్ణుడుగా పాండవ నాటకాలు ఎక్కడ ప్రదర్శించినా చొప్పల్లి ధర్మరాజు పాత్ర ధరించేవాడు. అలాగే 'సక్కుబాయి' నాటకంలోని 'రామజోగి మందు కొనరే' అనే పాటను ఆబాలగోపాలం భక్తిప్రపత్తులతో గానం చేసేది. ఆ పాటనే 1928లో ఆయన గ్రామఫోను రికార్డుగా కూడా ఇచ్చారు. అలాగే తమ గురువుగారైన ఆదిభట్ల నారాయణ దాసుగారి ఎన్నో కీర్తనలను, తాను స్వయంగా రాసి, గానం చేసిన హరికథలను గ్రామఫోను రికార్డులుగా యిచ్చి నాటక గీతాలకు అతిరిక్తంగా ప్రయివేటు పాటలను రికార్డులుగా యిచ్చిన ఘనతను సంపాదించారు. 1927వ సం॥లో రాష్ట్ర కాంగ్రెస్ సభ్యులుగా ఉండేవారు.



'రుక్మిణీ కళ్యాణము' (1937)లో

నాటకరంగం మీద ఇంత పేరు సంపాదించిన నటుడు సినిమాలలోకి పోకుండా వుంటాడా? తాను రంగస్థలం మీద అధిక పర్యాయాలు ప్రదర్శించిన 'సక్కుబాయి' నాటకాన్ని సినిమాగా తీసినప్పుడు (1935) అందులోకూడా శివయోగి పాత్రను ధరించాడు. అలాగే 'ద్రౌపదీ వస్త్రాపహరణము' (1936) లో ధర్మరాజు పాత్రను, 'రుక్మిణీకల్యాణము' (1937)లో అగ్నిద్యోతనుడుగాను, 'కచదేవయాని' (1938) లో శుక్రాచార్యునిగాను, 'మీరాబాయి' (1940) లో రూపగోస్వామి గాను నటించారు.



**'సతీ సక్కుబాయి' సినిమాలో యోగి పాత్రలో**

సినిమాల నుంచి తిరిగివచ్చి విజయనగరంలో తన గురువుగారైన ఆదిభట్ల వారికి నివాళిగా "హరిదాస సంఘం" ప్రారంభించి దాని కార్యకలాపాలను దిగ్విజయంగా నడిపారు. 1935లో 'మారుతీ భక్తమండలి'ని ప్రారంభించారు. 1943 నుంచి త్యాగరాజస్వామి జయంతులు జరిపారు. అదేకాలంలో గురువుగారి స్ఫూర్తితో జానకీశపథం, సీతాకల్యాణం హరికథలను స్వయంగా రచించి గానం చేశారు. 1956-57లో ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రారంభించినప్పుడు మొదటి జనరల్ కౌన్సిల్‌లో హరికథా విభాగం పక్షాన ప్రభుత్వంచేత సభ్యుడుగా ఎంపిక చేయబడ్డాడు. కాని పూర్తి కాలం కొనసాగక ముందే 1958 అక్టోబరు 31 నాడు స్వర్గస్థుడైనాడు. చివరివరకు తాను మెట్టిన అన్ని ప్రదర్శన కళారంగాలలోను గుర్తింపు పొంది చక్కని గాయకుడుగా, నటుడుగా, హరికథకుడుగా, నిర్వాహకుడుగా, రేడియో తొలిదినాలలో హరికథ పట్ల శ్రోతలు ఆకర్షించబడేటంత హర్షదాయకంగా హరికథా గానం చేసి, అన్ని రంగాలలోను తన పేరును చిరస్థాయిగా చేసుకొన్న కళాకారుడు చొప్పల్లి సూర్యనారాయణ భాగవతార్. ❑

# బెజవాడ రాజరత్నం



**1913**లో తెనాలిలోని చినరావూరులో జన్మించిన రాజరత్నం చిన్నతనం నుంచే తమ వంశ సంప్రదాయాన్ని అనుసరించి సంగీత నృత్యాలను అభ్యసించింది. సమీప బంధువు పి.సరస్వతి (తెనాలి సరస్వతిగా ఆరోజుల్లో ఆమెకు ప్రఖ్యాత నర్తకిగా గుర్తింపు వుంది) దగ్గర నృత్య సంగీతాలను నేర్చుకొని నలుగురిచేతా మెప్పు పొందింది. సంగీతంలో ఆమెకు వున్న ఉత్సాహాన్ని గమనించి తల్లి బెజవాడకు తమ మకాం మార్చి ఆనాడు కర్ణాటక, హిందూస్థానీలలో అఖండ ప్రజ్ఞానిధిగా పేరుపొందిన జొన్నవిత్తుల శేషగిరిరావు గారి దగ్గర సంగీతాభ్యాసానికి చేర్చింది. నాలుగేళ్ళలో స్వయంగా కచేరీలు చేయగల స్థాయికి ఎదిగింది రాజరత్నం. అప్పటికే పేరు ప్రఖ్యాతులార్జించి మూకీ సినిమాలలోను, నాటకాలలోను నటిస్తున్న మరో రాజరత్నం (కాకినాడ రాజరత్నం) వుండడంతో ఈమె 'బెజవాడ రాజరత్నం'గా గుర్తింపు పొందింది.

పాట, ఆటలు రెండింటిలో ఆరితేరిన రాజరత్నానికి 1934లో విడుదల అయిన 'సీతా కల్యాణం'లో సీత పాత్రను ధరించే అవకాశం దొరికింది. ఆ పాత్రలో ముగ్ధగా కనువిందు చేసిన రాజరత్నం వీనులవిందు చేయడానికి 1939లో విడుదల అయిన 'మల్లీపెళ్లి' సినిమా వేదిక అయింది. స్వయంగా పాడుతూ నటించవలసిన ఆ రోజుల్లో 'మల్లీపెళ్లి' లోని ఆమె పాటలు ఆమెలోని



'సీతాకళ్యాణము'(1934)లో సీతగా

గాన పటుత్వాన్ని కొత్త కోణాలలో చూపాయి. "కోయిలరో..", "గోపాలుడే..." అంటూ ఆమె పాడిన పాటలు ఆనాడు ప్రేక్షకులకు వీనుల విందు చేశాయి. ముఖ్యంగా కాంచనమాలతో కలిసి ఆమె పాడిన "ఆనందమేగా వాంఛనీయము.." అనే పాట ఆ దశాబ్దపు మంచి సినిమా పాటలలో ఒకటిగా నిలిచిపోయింది.

రాజరత్నం ఆ తరువాత మూడు నాలుగేళ్ల వరుసగా సినిమాలలో నటిస్తూ అపురూపమైన తన గానమాధుర్యంతో ప్రేక్షకులను అలరిస్తూనే వచ్చింది. 1940లో విడుదల అయిన "విశ్వమోహిని" లో ఆమె తన నటనతో కన్న "ఈ పూపొదరింటా" వంటి పాటలతో మొదటిసారి యువలోకాన్ని ఉర్రూత లూగించింది. ఆ పాటకు యువకుల్లో ఆనాడు కలిగిన ఉత్సాహం తెలుగు సినిమాలో యౌవనోదయ మధురిమలకు నాందిగా చెప్పవచ్చు. ఆ తరువాత వచ్చిన "దేవత" (1941) సినిమా ఆమె సినిమా జీవితానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. బి.యన్.రెడ్డి గారి దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమాలో "జాగేలా వెరపేలా త్రాగుము రాగ సుధారసము" అని పాడిన ఆమె తీయని పాట, ఆ గొంతులో ఆమె చూపిన రాగసుధారస మధురిమ ప్రేక్షకులను ఒక దశాబ్దం పాటు వెంటాడిందంటే అతిశయోక్తి కాదు. ఆ చిత్రంలోని ప్రతి పాటా ఆమె సహజమైన, స్వతఃసిద్ధమయిన గాన మాధుర్యాన్ని వెలువరించింది. ముఖ్యంగా "రాదే చెలి" పాట – ఆనాటి ప్రతి యువతి యువకుడు గుండెల నిండుగా పాడుకున్న పాట! (బయటకు చెప్పలేని రోజులు కదా!).

ఆ తరువాత రాజరత్నం నటించిన సినిమాలలో ఆమె నటన కంటే ఆమె పాటలకే ప్రాముఖ్యం కనిపిస్తుంది. 1945లో వచ్చిన "మాయలోకం", "ముగ్గురు మరాఠీలు" (1946) సినిమాలలో ఆ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. 1947లో వచ్చిన "కన్నగవల్లి" అనే తమిళచిత్రం ఆమె గాయనిగా, నటిగా తెరపై కనిపించిన ఆఖరి చిత్రం అని చెప్పవచ్చు. ఆ తరువాత ఎప్పుడో "జగదేకవీరుని కథ" (1961) లో ఆమె దేవకన్యలకు నేపథ్యగానం చేసింది.



'జీవన్ముక్తిలో' (1942)లో మాస్టర్ విశ్వం, పి.సూరిబాబు, బెజవాడ రాజరత్నం

ఆమెకు నటించే అవకాశాలు తగ్గిపోయి నేపథ్యగానం చేసే అవకాశాలు కొన్ని వచ్చాయి. 1943లో "భక్త పోతన" సినిమాలో భోగిని వేషం వేసిన సామ్రాజ్యానికి "ఇది మంచి సమయము రారా" అనే జావళిని పాడింది. అదే సినిమాలో మాలతి వేసిన పాత్రకు "ప్రీతియె మురవైరి సేవ" అన్న పాట కూడా ఆమెదే! 1948లో "మోహిని" తమిళ సినిమాలో కథానాయిక మాధురి పాత్రకు నేపథ్యగానం చేసింది. దీనితో ఆమె సినిమా జీవితానికి తెరపడిందని చెప్పవచ్చు.

మద్రాసులో సినిమాలలో ఛాన్సులు తగ్గడంతో రాజరత్నం తిరిగి బెజవాడ చేరుకున్నది. చాలమంది నటీమణులకు మాదిరిగా ఆమె కూడా ఒక సమాజాన్ని లేవదీసి సక్కుబాయి నాటకాన్ని ప్రదర్శించడం ప్రారంభించింది. కాని అందులో కూడా ఆమె కృతకృత్యురాలు కాలేకపోయింది. చివరిరోజుల్లో ఒంటరితనంతో జీవితాన్ని భారంగా గడుపుతూ విజయవాడలో ఏకాకిగా మరణించింది. కాని ఆమె పాడిన తియ్యని పాటలు, వాటి వెనుక వున్న మధురమైన ఆమె గాన నైపుణ్యం, అలవోకగా సెలయేరులా సాగే ఆమె గాన ప్రవాహాన్ని విన్నప్పుడు విచలితులు కాని శ్రోతలు ఈనాటికీ వుండరనే చెప్పవచ్చు. ❑

# బెంగుళూరు నాగరత్నమ్మ



మహా విద్వాంసురాలు, శాస్త్రీయసంగీత గాయనీమణి, అకుంఠిత దీక్షాపరురాలు, తన సర్వస్వాన్ని త్యాగరాజస్వామివారి సమాధిని, దేవాలయాన్ని, ఆ పరిసరాలను పరిరక్షించి వేలమంది రామభక్తుల, త్యాగభక్తుల కృతజ్ఞతలను అందుకున్న వ్యక్తి బెంగుళూరు నాగరత్నమ్మ. రంగస్థల నటుల తొలి గ్రామఫోను రికార్డులను గురించి, ఆ నటీనటులను గురించి వివరించే ఈ చిన్న పుస్తకంలో ఆమె జీవిత విశేషాలను చేర్చడం ఆశ్చర్యం కలిగించవచ్చు. ఆమె నటి కాదు. కాని కర్ణాటక సంగీతానికి చేసిన ఎనలేని సేవ, ఇవాల్టికీ వార్షికంగా సాగే త్యాగరాజ బ్రహ్మోత్సవాలు నిరంతరంగా జరగడానికి ఆమె చేసిన అవిరళ కృషి; ఆమె యిచ్చిన ఎన్నో గ్రామఫోను రికార్డులు – ఇందుకు కారణం. సంగీత ప్రపంచమంతా ఆమెకు కలకాలం ఋణపడి వుండాలి.

నాగరత్నమ్మ తల్లి పుట్టులక్ష్మి దేవదాసి. మైసూరు నివాసి. వివాహబంధం లేకుండానే మైసూరుకు చెందిన వకీలు సుబ్బారావుకు పుట్టులక్ష్మికి కలిగిన ఏకైక సంతానం నాగరత్నమ్మ. ఆమెకు సంవత్సరన్నర నిండకమునుపే ఆ వకీలుగారు పుట్టులక్ష్మిని, నాగరత్నమ్మను వదిలివేసాడు. తల్లి మాత్రం కుమార్తెను గుండెలకు హత్తుకొని ఈమెను పోషించడం ఎలా అని రోదించసాగింది. ఇంతలో మైసూరు దివాణంలోని ఆస్థాన పండితుడు గిరిభట్ట తిమ్మయ్య శాస్త్రి పుట్టులక్ష్మిని చేరదీసి

నాగరత్నమ్మకు సంస్కృతం, సంగీతం నేర్పాడు. కాని ఆమె తొమ్మిదవ ఏట శాస్త్రి గారు వారి పోషణ భారాన్ని వహించలేనని తప్పుకున్నాడు. దిక్కులేక తన కుమార్తెను తన తల్లిగారికి తెలిసిన కాంచీపురవాసి, ధనకోటి అమ్మాళ్‌కు అప్పగించాలని కాంచీపురం చేరింది తల్లి. కాని ఈ చిన్నపిల్లకు సంగీతం చెప్పలేనని ధనకోటి అమ్మాళ్ శ్రీరంగంలో ఉన్న మరో గురువుగారికి అప్పగించింది. కాని అంతదూరం ఎవ్వరూలేని దేశానికి పోవడం కష్టమని భావించి పుత్తులక్ష్మి నాగరత్నమ్మను తీసుకొని బెంగుళూరు చేరింది. అప్పటి నుంచి ఆమె 'బెంగుళూరు' నాగరత్నమ్మ అయింది.

నాగరత్నమ్మ అక్కడే స్వయాన త్యాగరాజుగారి శిష్యుడైన వాలాజీపేట కృష్ణస్వామి భాగవతార్ శిష్యుడైన ఫిడేల్ విద్వాన్ బెంగుళూరు మునుస్వామి దగ్గర ఫిడేలు, గాత్రం నేర్చుకోవడం మొదలుపెట్టింది. పుత్తులక్ష్మి తన దగ్గర వున్న ప్రతి పైసా తన కూతురు విద్యాపారంగతురాలు కావడం కోసం ఖర్చు పెట్టింది. 13వ ఏడు వచ్చేసరికి నాగరత్నమ్మ తెలుగు, సంస్కృతం, తమిళం, ఇంగ్లీషులతో పాటు సంగీతంలో కూడా నిష్ణాతురాలైంది. అలాగే బెంగుళూరు కిట్టప్ప దగ్గర భరతనాట్యం, మదరాసు తిరువెంగడాచారి వద్ద అభినయం, ప్రఖ్యాత మైసూరు ఆస్థాన విద్వాంసుడు బిడారం కృష్ణప్ప దగ్గర సంగీతం నేర్చుకొని సర్వకళాకోవిద అయింది.

నాగరత్నమ్మకు 14వ ఏడు రాగానే తన కూతురు ఎక్కడ అనాథగా విడిచి వేయబడ్డదో అక్కడ నుంచే ఆమె విజయదుందుభి మ్రోగించాలని నిశ్చయించుకొని మైసూరు చేరింది పుత్తులక్ష్మి. ఆమె గురువుగారైన వైణిక శిఖామణి వీణశేషన్న సమ్ముఖంలో నాగరత్నమ్మ తన తొలి కచేరీ చేసి విద్వాంసుల నీరాజనాలందుకుంది. మహారాజు జయచామరాజు వొడయార్ ఆహ్వానంతో ఆమె మైసూరు ఆస్థానంలో తనను, తన తల్లిని తిరస్కరించిన తిమ్మయ్య శాస్త్రి సభలో ఉండగానే సంగీత విద్వాంసుల మన్ననలు పొందింది.

అక్కడి విజయం తరువాత నాగరత్నమ్మ మద్రాసు చేరుకుని జార్జిటౌన్‌లో స్థిర నివాసం ఏర్పరచుకొని దేశమంతటా తిరుగుతూ సంగీత విద్వత్సభలలో పాల్గొంటూ తన సంగీత సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ పోయింది. తాను సనాతన ధర్మ విధేయురాలినని, దేవదాసిగా తాను సంగీతనృత్యాలతో భగవంతుడికి ఉపచారాలు చేయవలసిందిగా సనాతన ధర్మం నిర్దేశిస్తున్నదని,

దానినే తాను అనుసరిస్తున్నానని ధైర్యంగా చాటి చెప్పింది. 1905-1934 మధ్యకాలంలో ఆమె అనితరసాధ్యంగా 1235 సంగీత కచేరీలు చేసింది. అనేకచోట్ల సన్మానాలు అందుకున్నది. ఇంతేకాదు. మద్యపానానికి వ్యతిరేకంగా తెలుగులోను, త్యాగరాయ అష్టోత్తర శతనామావళిని సంస్కృతంలోను, పంచీక్కరణ ఖేద్దికానూల్ అనే గ్రంథాన్ని తమిళంలోను రాసింది. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, పురాణం సూర్యనారాయణతీర్థులు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి వంటి కవులు, పండితులు ఆమెకు 'విద్యాసుందరి' బిరుదునిచ్చి గండపెండేరంతో సత్కరించారు. గౌరవ పురస్కారాలు, ధనసంపద ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి.

ఈ సమయంలోనే ఆమెకు తన గురువుగారైన బిడారం కృష్ణప్ప గారి దగ్గర నుంచి ఒక ఉత్తరం వచ్చింది. తాను త్యాగరాజస్వామి సమాధిని దర్శించడానికి తిరువయ్యూరు వెళ్ళానని, అది అతిఘోరమైన పరిస్థితుల్లో ఉన్నదని, సంగీతసార్వభౌముడి సమాధినే నిర్లక్ష్యం చేయడం దైవాపచారమని చెబుతూ దాని కోసం తన శక్తియుక్తులను ఉపయోగించాలని కృష్ణప్పగారు నాగరత్నమ్మను ఆదేశించారు. తన గురువుగారికి, తల్లికి, సర్వ సంగీత ప్రపంచానికి గురువైన త్యాగరాజస్వామికి తన ఋణం తీర్చుకోవడం అవసరమని భావించి ఆనాటి నుంచి తన తుది శ్వాస వరకు ఆ సమాధి మందిరాల పునరుద్ధరణకు తన ధనాన్ని, కాలాన్ని వెచ్చించింది నాగరత్నమ్మ. ఎన్నో కక్షలకు ఆలవాలమైన త్యాగరాజ ఆలయం కమిటీ, ఉత్సవ కమిటీలను ఒకచోట చేర్చి తన నేర్పుతో ఒకే ఉత్సవ కమిటీని ఏర్పాటుచేసి తన ధనంతో ఆ ప్రదేశాన్ని కొని అక్కడ ఒక సంగీత మందిరాన్ని, ధ్యానమందిరాన్ని, త్యాగరాయస్వామి దేవాలయాన్ని నిర్మించింది. "త్యాగయ్య" (1946) సినిమా విజయవంతం అయిన సందర్భంలో చిత్తూరు వి.నాగయ్య గారిని త్యాగరాయ నిలయాన్ని నిర్మించి అక్కడ స్వామి వారి కృతులను పాడేవారికి వసతులను ఏర్పాటు చేయవలసిందిగా కోరింది. నాగయ్య గారు ఆమె కోర్కెను సంతోషంతో నెరవేర్చారు. కర్ణాటక సంగీతజ్ఞులకందరికీ శిరోధార్యమైన తిరవయ్యూరు త్యాగరాయ ఆలయాన్ని, వార్షిక బ్రహ్మోత్సవాలను పునఃప్రారంభం చేయించి అక్కడ కుల,మత, స్త్రీపురుష విభేదాలు లేకుండా అందరూ కచేరీలు చేసేలా ఏర్పాటుచేసిన మహామనీషి బెంగుళూరు నాగరత్నమ్మ 1952వ సంవత్సరం మే 19న మరణించారు. సంగీతం మీద అభిమానం వున్న ప్రతి ఒక్కరూ కృతజ్ఞతతో నివాళులర్పించవలసిన విదుషీమణి నాగరత్నమ్మ. ❑

# మరికొందరు గ్రామఫోను గాయకులు

**తొ**లితరం గ్రామఫోను గాయకులలో చాలమంది సంక్షిప్త జీవిత విశేషాలను మా రెండు సంపుటాలలోను యిచ్చే ప్రయత్నం చేశాం. కాని మరికొందరు ఆ తరంలో ప్రఖ్యాతులై, గ్రామఫోను ద్వారా పలు రికార్డులను అందించి కూడా తాము తెరమరుగై పోయారు. మా చదువరులలో ఎవరికైనా మేమిచ్చిన వివరాలకు మించి వీరిని గురించి తెలిసి వుండవచ్చు. **అలా తెలిస్తే దయచేసి వారిని గురించిన వివరాలను మాకు అందించండి.** తరువాత వచ్చే ముద్రణలలో ఆ విషయాలను చేర్చి ఈ జనామోదం పొందిన గాయకుల విషయాలను అశేషమైన ఆ గ్రామఫోను గాన అభిమానులకు అందిస్తాం. ఈ కింది గాయకులను గురించి మాకు అందిన అతికొద్ది సమాచారాన్ని మీతో పంచుకుంటున్నాం - గ్రామఫోను గాయకులుగా వారు ప్రసిద్ధులు కనుక.

### వల్లూరి జగన్నాథరావు:




కాకినాడ నివాసి. హాస్యనటుడుగా ప్రఖ్యాతుడు. అబ్బాయిగారుగా ప్రఖ్యాతులైన సింగీతం వెంకట్రావుగారు లేదా వెంకటరామయ్యగారి శ్రీకృష్ణ విలాససభలో ప్రముఖ సభ్యుడు. తెలుగులో గ్రామఫోను రికార్డులిచ్చిన తొలి గాయకులలో ఒకడుగా ప్రసిద్ధుడు. జానపద హాస్య గీతాలు పాడిన తొలి గ్రామఫోను గాయకుడు కూడా ఆయనే!

### పసుపులేటి అంజయ్య:

కృష్ణా జిల్లాకు చెందిన అంజయ్యగారు మైలవరంలోను, ఆ తరువాత బెజవాడలోను, ప్రఖ్యాత వృత్తి, వ్యాపార నాటక సంస్థగా పేరు పొందిన -

మైలవరం కంపెనీలో ఆడవేషాలు వేశారు. మైలవరంలో చిన రాజాగారు ప్రారంభించిన ఈ సమాజంలో స్త్రీ వేషధారిగా అంజయ్యగారు యడవల్లి సూర్యనారాయణ, ఉప్పులూరు సంజీవరావు గార్లతో కలిసి దాదాపు 30 సంవత్సరాలు స్త్రీ వేషాలు ధరించారు. యశోద, రుక్మిణి వంటి భక్తి ప్రధానమైన పాత్రలకు ప్రసిద్ధులు.



**కాకినాడ రాజరత్నం:**



కాకినాడకు చెందిన రాజరత్నం చిన్నతనంలో బాలవేషాలు వేసి అందరి మనసులను ఆకట్టుకున్నది. వంశ పారంపర్యంగా కుటుంబ పెద్దల దగ్గర నుంచి సంగీతం నేర్చుకున్నది. సైలెంట్ సినిమాల నాటి నుంచి కూడా సినిమాలలో స్థిరపడిపోయి మూకీ, టాకీలలో పని చేస్తూనే గ్రామఫోను రికార్డులిచ్చింది. ❑

---

*పై ముగ్గురు గాయకులను గురించే కాక ఎన్నో రికార్డులిచ్చిన ఈ క్రింది గాయకులను గురించి మీ దగ్గర సమాచారం వుంటే మాకు పంపగలరు.*

1. రెండుచింతల సత్యనారాయణ 2. ఆకుల నరసింహరావు 3. వి.జె.వర్మ 4. పద్మావతి శాలిగ్రాం 5. డి.సభారంజని (గుంటూరు) 6. ఎస్.ఎన్.రామస్వామి 7. మద్దూరి బుచ్చన్న శాస్త్రి 8. కె.వి.రమణమ్మ 9. ఎమ్.దుర్గాప్రసాద్ 10. కె.ఆర్.కేశవదాసు 11. డి.అమ్మణి 12. కమలాబాయి (నెల్లూరు) 13. వనజాక్షి 14. ప్రయాగ నరసింహశాస్త్రి 15. నిష్ఠల వెంకటేశ్వర్లు 16. తోట రాఘవయ్య 17. రామచంద్ర భాగవతార్ 18. ఎస్.కృష్ణమాచార్య 19. ఘంటసాల శేషాచలం 20. మిస్. వెంకటరత్నం.

# అనుబంధం

## డిస్క్‌లో ఉన్న గ్రామఫోన్ పాటలు, పద్యాలు, శ్లోకాల వివరాలు

| | పాట | గాయనీ గాయకులు |
|---|---|---|
| 1. | పరబ్రహ్మ పరమేశ్వర | కపిలవాయి, రామతిలకం & బృందం |
| 2. | **శకుంతల నాటకం నుండి శ్లోకాలు, పద్యాలు, పాటలు**<br>ఎంతో ఆనందమయ్యె యీ తపోవని...<br>సరసిజమను విద్ధం...<br>ముగ్ధలౌ యీ తపస్వి...<br>పోయె నయ్యో యిపుడునను బాసి...<br>నా హృదయ ఫలకమునాయా...<br>అప్సర స్త్రీకి జన్మించి...<br>అనాఘ్రాతం పుష్పం...<br>చరణమున గృచ్చుకొనె...<br>కింశీతలైః క్లమవినోది... | యడవల్లి సూర్యనారాయణ |
| 3. | గజేంద్రమోక్షము... (పద్యాలు) | బెల్లంకొండ సుబ్బారావు |
| 4. | బొబ్బిలి యుద్ధము (పద్యాలు, సంభాషణలు) | మాధవపెద్ది వెంకటరామయ్య |
| 5. | **శ్రీకృష్ణ రాయబారం (పద్యాలు)**<br>అదిగో ద్వారక...<br>నందకుమార...<br>వంది మాగధులు కైవారంబు... | పులిపాటి వెంకటేశ్వర్లు |
| 6. | దివ్యస్థలంబగు... (పద్యం)<br>(చింతామణి నాటకం నుండి) | పులిపాటి వెంకటేశ్వర్లు |
| 7. | ఆరాధనము సేయ రారే ప్రియసఖులారా... | శ్రీరంజని |
| 8. | మంగళం చేసి... | శ్రీరంజని |
| 9. | మమజీవ సహి... (మాండ్) | దాసరి కోటిరత్నం |
| 10. | సలలిత మురళి.. (రాధాకృష్ణ నాటకం నుండి) | పారుపల్లి సుబ్బారావు |

12. ముద్దుల మొగముపై... (కమాస్) — పారుపల్లి సుబ్బారావు
13. శ్రీ అజహరి సేవిత... — ఆర్. సుభద్రమ్మ
14. ప్రేమ బాలయను... — ఆర్. సుభద్రమ్మ
15. జరుగదు నీతో క్షణము లేనిదే... — ఆర్. సుభద్రమ్మ
16. ప్రియసఖియ యింత... — ఆర్. సుభద్రమ్మ
17. ఏర నా ప్రియ... (నృత్యగీతం) — కళావర్ రింగ్
18. పరువగునా... — కళావర్ రింగ్
19. శరణాగత శ్రీ రఘురామ... — ఋష్యేంద్రమణి
20. భక్తపాలనా దేవా... — ఋష్యేంద్రమణి
21. **సక్కుబాయి నాటకం నుండి పాటలు, పద్యాలు** — తుంగల చలపతిరావు
    - శ్రమపడుచుంటిని... (లలిత)
    - ఈ వియోగ జలధి... (కాలంగట)
    - కదలిరా విధి దూరమా... (ముఖారి)
    - దేవ దేవ నీవె సమస్త...
    - నీవెకదే ఆధారము...
22. శ్యామసుందర కుమార... — మాస్టర్ కల్యాణి
23. ఘోర సంసార సాగరోతారకంబు... — మాస్టర్ కల్యాణి
24. రంగా రంగా... (భజన) — ఘంటసాల బ్రదర్స్
25. సరస సౌభ్రాత్రు... (పద్యం-బేగడ) — ఘంటసాల బలరామయ్య
26. గ్రహరాజు నిజకాలగతి... (దుర్గా రాగం) — నిడుముక్కల సుబ్బారావు
27. దయసేయ గదరయ్య... (దుర్గా రాగం) — నిడుముక్కల సుబ్బారావు
28. సత్యవతి పిత్రు పాదరాజ... — నిడుముక్కల సుబ్బారావు
29. యదుకిశోరమా... — నిడుముక్కల సుబ్బారావు
30. నందకులాభరణ మహిత చరణ... — లక్కరాజు విజయగోపాలరావు
31. సజలజలదనీలం... — లక్కరాజు విజయగోపాలరావు
32. కలసి నివ్వరి ధాన్యములకు... — ముప్పవరపు భీమారావు
33. భక్తయోగపదన్యాసి వారణాసి... — ముప్పవరపు భీమారావు
34. కనుగవనిండ నూరు... — పార్వతీబాయి

| | |
|---|---|
| 35. ఇది తరగుకులవారాసి... | పార్వతీబాయి |
| 36. **శ్రీకృష్ణరాయబారం నుండి పద్యాలు** | |
| చెల్లియో చెల్లకో... | |
| అలుగటయే ఎరుంగని... | అబ్బూరి వరప్రసాదరావు |
| జెండాపై కపిరాజు... | |
| సంతోషంబున... | |
| 37. ఎన్నగాను రామభజన... | చొప్పల్లి సూర్యనారాయణ |
| 38. రామయ తండ్రి... | చొప్పల్లి సూర్యనారాయణ |
| 39. చల్లనివై శ్రమంబడు... (కానడ) | చొప్పల్లి సూర్యనారాయణ |
| 40. సీతారాములకున్న పరస్పర... (దేశి) | చొప్పల్లి సూర్యనారాయణ |
| 41. రామచంద్ర సీతామనోహర... (బేగడ) | చొప్పల్లి సూర్యనారాయణ |
| 42. మురళి హే మురళి... (నృత్య గీతం) | బెజవాడ రాజరత్నం, బి.కమల |
| 43. రారే రారే రమణులారా... | బెజవాడ రాజరత్నం, బి.కమల |
| 44. మా రమణగోపాల... | బెజవాడ రాజరత్నం |
| 45. రార సుధాకర... | బెజవాడ రాజరత్నం |
| 46. రాధాకృష్ణ సంవాదము... | బెజవాడ రాజరత్నం,<br>చొప్పల్లి సూర్యనారాయణ |
| 47. హాయి హాయి గోకులబాల... | బెజవాడ రాజరత్నం |
| 48. ఘల్ ఘల్లనరా గంతిడిరార... | బెజవాడ రాజరత్నం, |
| 49. శ్రీమత్ గోపవధు... | బెంగుళూరు నాగరత్నమ్మ |
| 50. పొగడతరమ అద్భుత మహిమను... | బెంగుళూరు నాగరత్నమ్మ |
| 51. ఇక నేమందునే చెలియా... | బెంగుళూరు నాగరత్నమ్మ |
| 52. రాగం – ఆలాపన... | బెంగుళూరు నాగరత్నమ్మ |
| 53. దేవదేవ సకలలోక... | కాకినాడ రాజరత్నం |
| 54. స్తవనీయులౌ హరిశ్చంద్రాది... | కాకినాడ రాజరత్నం |
| 55. చోద్యమదేదియో తెలియదాయే... | పసుపులేటి అంజయ్య |
| 56. కొయ్యోడి పదం... | వల్లూరి జగన్నాథరావు |
| 57. రాగాలాపాన... (హార్మోనియంపై) | మార్తి సీతారామయ్య |
| 58. శృంగార లహరి... | మార్తి సీతారామయ్య |

## మా ఇతర ప్రచురణలు

Creative Links PUBLICATIONS




**అభ్యుదయ చలనచిత్ర రథసారథి**

**గూడవల్లి రామబ్రహ్మం**

తెలుగు సినిమా తొలితరం నిర్మాత, దర్శకుడు
గూడవల్లి రామబ్రహ్మం జీవితచరిత్ర




**దేవదాసు**

వినోదా వారి 'దేవదాసు' సినిమా నవల.
అక్కినేని 70 వసంతాల నటజీవితానికి
నవనవోన్మేష దర్పణం!




**శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం**

పద్మశ్రీ వారి 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం'
సినిమా నవల, అరుదైన
ఛాయాచిత్రాలతో




**మన సంగీత శిఖరాలు**

చాగంటి కపాలేశ్వరరావుగారు
'ఆంధ్రభూమి' దినపత్రికలో వ్రాసిన ప్రముఖ
శాస్త్రీయ సంగీతజ్ఞుల జీవనరేఖలు